రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం..!!

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు.. కన్నదీ విన్నది నలుగురితో పంచుకున్నదీ ప్రజలకు అందించాలని..

వారి సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలకు దిక్సూచిగా మారాలని అనుకుంటున్నారా? విశాలవంతమైన జర్నలిజం. వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

ప్రజల సమస్యలపై గాండీవం తెలుగు దిన పత్రిక
www.epaper.gandeevam.com

మీకో చక్కని వేదికగా నిలుస్తోంది. ఎవరి ఒత్తిడి లేని విలేకరి వృత్తిని చాటేందుకు సాదరంగా ఆహ్వానిస్తోంది.

జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారిగా రిపోర్టర్లు కావలెను

సంప్రదించండి
9948462690 | 7981054985

https://epaper.gandeevam.in
PRGI TGTEL/25/A0888

ప్రజల సమస్యలపై
# గాండీవం

సంపుటి:02 సంచిక :158 13 శనివారం, జూన్ 2026 తెలుగు దిన పత్రిక
పేజీలు : 8 వెల:రూ.1/

ప్రజల సమస్యలపై గాండీవం తెలుగు దిన పత్రిక

- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం
- అన్ని శుభాకార్యాలు

దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి

ఏటి రాజారావు సీఈవో
Contact : 9948472690

Published from: Hyderabad, Sangareddy

## హెచ్-1బీ వీసా ఫీజు పెంపు వ్యవహారం

బోస్టన్ కోర్టు తీర్పుపై సవాల్ చేయనున్న న్యాయశాఖ

వాషింగ్టన్,జూన్12 గాండీవం




హెచ్-1బీ వీసా ఫీజు విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అస్సలు వెనక్కి తగ్గేది లేదని తేల్చారు. వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ ట్రంప్ యంత్రాంగం తీసుకున్న నిర్ణయాన్ని అమెరికాలోని బోస్టన్ ఫెడరల్ కోర్టు 2 లో




## మీనాక్షికి సుప్రీంలో దక్కని ఊరట

నామినేషన్ తిరస్కరణపై పిటిషన్ కొట్టివేత

ఎన్నికలయ్యాక హైకోర్టును ఆశ్రయించాలని సూచన

న్యూఢిల్లీ,జూన్12 గాండీవం

రాజ్యసభ ఎన్నికల నామినేషన్ తిరస్కరణ వ్యవహారంలో కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు మీనాక్షి నటరాజన్‌కు సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ బరిలో నిలిచిన ఆమె నామినేషన్‌ను మిగతా 2 లో

# సర్ ప్రక్రియ ..ఓ భూతం లాంటిది

చట్టం అనే ముసుగులో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన దొంగ దారి ఎస్ఐఆర్





చట్టం ముసుగులో దెబ్బకొట్టే యంత్రం

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మం,జూన్12 గాండీవం

ఎస్ఐఆర్ సర్ ఆనేది భయంకరమైన ఒక భూతమని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభివర్ణించారు. చట్టం అనే ముసుగులో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన దొంగ దారి ఎస్ఐఆర్ అని తెలిపారు. శుక్రవారం ఖమ్మం జిల్లా ఏదులాపురంలో బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. అధికారులు ముందు ఓటు మ్యాపింగ్ చేస్తారని పేర్కొన్నారు. గ్రామంలో ఓట్లు తొలగించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలంటూ బూత్ లెవల్ ఏజంట్లకు ఆయన స్పష్టం చేశారు. వివిధ కారణాలతో ఓట్లు తొలగిస్తారని బూత్ లెవల్ ఏజంట్లను అప్రమత్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బలంగా ప్రాంతాల్లో ఓటర్ లిస్టు పేరుతో ఓట్లు తొలగిస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ ద్వారా రెండు రాష్టాల్లో అధికారంలో ఉన్న పార్టీలను కేంద్రం ఓడించిందని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. ఓట్ల తొలగింపును తిప్పి కొట్టాల్సిన బాధ్యత బీఎల్ఏలదేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఉన్న అభిమానం కాపాడుకుంటే చాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ లబ్ది పొందాలని చూస్తే.. దానిని తిప్పి కొట్టాల్సిన బాధ్యత మిగతా 2 లో



## సంక్షేమ శాఖలో అవినీతి అంతా అబద్ధం

నిరూపిస్తే దేనికైనా సిద్ధమేనన్న మంత్రులు

హరీష్ రావు లాగా అవినీతి తమకు తెలియదని ఖండన

సిద్ధిపేట,జూన్12 గాండీవం

సంక్షేమ శాఖలో అవినీతి జరిగినట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావుకు రోడ్డు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు. తమ శాఖల్లో తప్పు జరిగిందనేందుకు ఎలాంటి విచారణకు అయినా తాము దేనికైనా సిద్ధమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ విలేకర్లతో మిగతా 2 లో



## పాశ్చాత్య దేశాల ద్వంద్వ ప్రమాణాలు

రష్యాతో చమురు కొనుగోళ్లను సమర్థించిన జైశంకర్

అమెరికా సుంకాల విధింపులో నైతికత లేదన్న మంత్రి

న్యూఢిల్లీ,జూన్12 గాండీవం మిగతా 2 లో




## మీనాక్షి వ్యవహారంపై సిట్ వేయగలరా?

ఉప్పందించిన కాంగ్రెస్ నేత ఎవరో గుర్తించండి

రేవంత్‌కే ఫ్యూచర్ లేదు..ఇక ఫ్యూచర్ సిటీ ఎక్కడ

మీడియాతో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

హైదరాబాద్,జూన్12 గాండీవం

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిదానికి సిట్ వేస్తుంది కదా.. ఆ పార్టీ నాయకురాలు మీనాక్షి నటరాజన్ అంశంపైన కూడా సిట్ వేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మీనాక్షి నటరాజన్‌ను రాజ్యసభకు వెళ్లకుండా అడ్డుకున్న అంశంపై ఆయన స్పందించారు. బీజేపీలో ఎవరికి ఫ్రెండ్స్ ఉన్నారో మీనాక్షి నటరాజన్ అంటే ఎవరికి కోపం ఉందో మిగతా 2 లో




## రేవంత్ రెడ్డి నియంత పాలనకు రోజులు దగ్గర పడ్డాయి

- ఇతర రాష్ట్రాల్లోలాగే తెలంగాణలోనూ కాంగ్రెస్ ఖతం
- కాంగ్రెస్ పార్టీకి ఈసారి డిపాజిట్లు కూడా దక్కవు
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు జోస్యం

కరీంనగర్,జూన్12(ఆర్ఎన్ఎ) మిగతా 2 లో

## యధాతథంగా సింగరేణి మెడికల్ బోర్డు

పారదర్శకంగా, వివాదరహితంగా నిర్వహించండి

అధికారులను ఆదేశించిన డిప్యూటి సిఎం భట్టి

హైదరాబాద్,జూన్12 గాండీవం



సింగరేణి కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. త్వరలోనే సింగరేణి మెడికల్ బోర్డును యథావిధిగా ప్రారంభించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. మెడికల్ బోర్డును పారదర్శకంగా, వివాదరహితంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మెడికల్ బోర్డులో అక్రమాలు, మధ్యవర్తిత్వానికి తావులేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కొత్త బొగ్గు బ్లాకులను సాధించి మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మిగతా 2 లో

## గ్లోబల్ లాజిస్టిక్స్ డెస్టినేషన్‌గా తెలంగాణ

షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ సదస్సులో శ్రీధర్ బాబు

హైదరాబాద్,జూన్12 గాండీవం మిగతా 2 లో



# సంపాదకీయం

## బడిలోనే ..దేశ భవిష్యత్‌కు పునాది !

విద్యావైద్యమే పేదరిక నిర్మూలనకు సామాజిక పురోభివృద్ధికి దోహదపడతాయని సిఎం రేవంత్ రెడ్డి నీతి ఆయోగ్‌లో చెప్పిన మాటలు అక్షర సత్యాలు. కులరహిత సమాజానికి ఇది దోహదపడుతుందని కూడా అభిప్రాయపడ్డారు. అయితే ఇది ఎంతవరకు ఆచరణ చేస్తున్నారో ఆత్మపరిశీలన చేసుకునే సమయం వచ్చింది. స్కూళ్లు తెరవబోతున్నారు. గత రెండున్నరేళ్లుగా స్కూళ్లను ఏ మేరకు అభివృద్ధి చేశారో చెప్పాలి. వసతి గృహాలు మృత్యుకుహారాలుగా మారాయి. యంగ్ ఇండియా స్కూళ్లు అంటూ ఊదర గొట్టడం కాకుండా ఉన్న స్కూళ్లను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలి. ఒకవేళ యంగ్ ఇండియా స్కూళ్లు కావాలనుకుంటే..వాటితో పాటు ఉన్న స్కూళ్లను బలోపతేం చేయాలి. స్కూళ్లను హాస్టళ్లను  అనుసంధానించడం ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయి. దీనిగురించి పట్టించుకోవడం లేదు. పాఠశాలల తో వసతిగృహాలను అనుసంధానించి, సకల సౌకర్యాలు కలిగిస్తే...సిఎం రేవంత్ కోరుకున్న కులరహిత విద్యావిధానం సాధ్యమవుతుంది. అందుకు పెద్దగా పెట్టుబడులు అవసరం లేదు. ఇప్పుడు ఖర్చు చేస్తున్న బడ్జెట్‌లోనే కలెక్టర్లకు ఈ పని అప్పగించి పర్యవేక్షిస్తే సత్వర విజయం సాధించవచ్చు. ఎందుకంటే...స్వేచ్ఛా వాతావరణంలో ఆడుతూ.. పాడుతూ గడపాల్సిన బాలలు పనిలో బందీ అవుతున్నారు. అక్షరాలు దిద్దాల్సిన సమయంలో పత్తి చేలలో పనిచేస్తున్నారు. పుస్తకాల సంచీతో బడికి వెళ్లాల్సిన వారు హోటళ్లు, మెకానిక్ షెడ్లలో కార్మికులుగా మారుతున్నారు.. అక్షరాలు దిద్దాల్సిన చేతులతో బట్టీల్లో ఇటుకలను మోస్తున్నారు. అందుకు తల్లిదండ్రుల పేదరికమే ప్రధాన కారణం. చదువు ప్రాధాన్యంపై వారికి అవగాహన లేకపోవడం, నిరక్షరాస్యత ఇతర కారణాలని చెప్పవచ్చు. పేదరికం బాలల పాలిట శాపంగా మారకుండా ప్రతి ఒక్కరిని బడిలో చేర్పించే బాధ్యత గ్రామాలకు అప్పగించాలి. సర్పంచ్‌లను ఇందుకు బాధ్యులను చేయాలి. ఆర్థిక స్థోమత లేక,కుటుంబ పోషణ భారమై తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి బదులు పనులకు పంపిస్తున్నారు. కొందరు గొర్రెలు, పశువుల కాపరులుగా మారుతున్నారు. మరికొందరు బాలలు యాచకులుగా వీధుల్లో కనిపించడం ఆవేదన కలిగిస్తోంది. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు ఎన్ని కార్యక్రమాలు నిర్వహిస్తున్నా పూర్తిస్థాయి ఫలితాలు సాధ్యం కావడం లేదు. పట్టణ శివారు ప్రాంతాల్లో ఇటుక బట్టీల్లో బాలలు కూలీలుగా పనిచేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాల రిజిస్టర్‌లో పేర్లు ఉన్నా.. బాలలు మాత్రం పత్తిచేలల్లో, ఇటుకల బట్టీల్లో పని చేస్తుంటారు. ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో ఇలా వందలాది మంది బాల కార్మికులను గుర్తించారు. ఈ క్రమంలో మళ్లీ స్కూళ్లు తెవరబోతున్న క్రమంలో పిల్లల సంఖ్య పెంచాలని విద్యాశాఖ ఉత్తర్వులు ఇచ్చింది. అయితే ఒక ప్రణాళిక లేకపోవడం వల్ల వారు పాఠశాల వరకు రాలేకపోతున్నారు. పిల్లలకు ఉచితంగా భోజనం కల్పిస్తున్నా ఆకర్శించలేకపోతున్నారు. ఇందుకోసం గ్రామస్థాయిలో సర్వే చేయిలి. స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలి. ఎందుకంటే దేశ భవిష్యత్ పాఠశాల నుంచే మొదలవుతుంది. ఆరోగ్యకరమైన సమాజం కావాలంటే చదువు కావాలన్న సంకల్పాన్ని నెరవేర్చడం అవసరం. ఇందుకోసం ప్రణాళిక అవసరం. వసతి గృహాల్లో  వసతులు లేవు. అలాంటి వాటిని నడిపే బదులు గ్రామాల్లోనే తల్లిదండ్రుల వద్ద పిల్లలను అప్పగించి, స్కూళ్లకు పంపడం నేర్పించాలి. స్కూళ్లో పెన్సిల్ మొదలు, పుస్తకాలు బట్టలు, ఫీజులు ఉచితం చేయాలి. కులమతాలకు అతీతంగా చేసి మంచి  భోజన వసతులు స్కూళ్లలోనే కల్పించాలి. అప్పుడు పిల్లలు ఇంటినుంచే స్కూళ్లకు వచ్చేందుకు ఇష్టపడతారు. తల్లిదండ్రులు కూడా ఇందుకు ఒప్పుకుంటారు. ఇది పెద్దగా బడ్జెట్‌తో కూడుకున్న పనికాదు. ఇప్పుడు హాస్టళ్లకు పెడుతున్న ఖర్చుతో దీనిని నెరవేర్చవచ్చు. ఇలా చేస్తే వారే రేపటి పౌరులుగా తయారవుతారు. మనం నేర్పిన నడవడిక, మనం తీర్చిదిద్దిన అక్షరాలు వారి జీవిత గమ్యానికి బాటలు వేస్తాయి. పిల్లలు ఎలా ఎదిగాలి, ఫలితాలు రాబట్టేలా ఉపాధ్యాయులకు బాధ్యతలు అప్పగించాలి. సమాజాభివృద్ధికి ఉపయోగపడే వ్యక్తిత్వ వికాసాన్ని పిల్లలు పుణికి పుచ్చుకునేలా బడిలోనే పునాది వేయాల్సి ఉంటుంది. గత అనుభవాలను మననం చేసుకుంటూ ఈ విద్యా సంవత్సరం ప్రభుత్వ బడి పట్ల సమాజానికి నమ్మకం కలిగేటట్లు కార్యాచరణ సిద్ధం చేస్తే మంచిది. ఇందుకు తల్లిడదండ్రులను, గ్రామంలో పెద్దలను పలకరిస్తే బోలెడు సమాచారం చెబుతారు. ప్రభుత్వ బడి బాగా నడుస్తుందంటే మన సమాజం బాగుపడ్డట్లుగానే భావించాలి. ఎందుకంటే ఇప్పటికీ ఇంకా ప్రభుత్వ బడి పట్ల నమ్మకం కలిగిన తల్లిదండ్రులు ఈ సమాజంలో ఉన్నారు. వాళ్ళ నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యార్థులకు నాలుగు అక్షరాలు, నైతిక విలువలు నేర్పే బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాల్సిందే. ఆటంకాలు ఎన్నొచ్చినా ప్రభుత్వం బోధనేతర కార్యక్రమాల చుట్టూ ఉపాధ్యాయులను తిప్పినా.. పిల్లలకు తగు న్యాయం చేయటం కూడా ఉపాధ్యాయుల బాధ్యత. అలాగే పిల్లలకు బోధన చేసే ఉపాధ్యాయులకు స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.  ఒత్తిడి లేకుండా ఉపాధ్యాయులు బడిలో పిల్లలకు బోధన మాత్రమే చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. పాస్ టార్గెట్లు పెట్టడం వల్ల పిల్లలలో సృజనాత్మకత దెబ్బ తింటుంది. బట్టీయ పద్ధతి వల్ల సృజనాత్మకంగా ఆలోచించటం మరచి భవిష్యత్తు అంతా ఎదుటి వాళ్ళ మీద ఆధారపడటం తప్ప తనంతట తను బతకడం అలవాటు లేని పరిస్థితులలోకి నెట్టివేయ బడతారు. ఇవన్నీ అధిగమించాలంటే ప్రభుత్వ సంకల్పమే ముఖ్యం. నీతి ఆయోగ్ సమావేశంలో చెప్పిన అంశాలను ఆచరణలో పెట్టాలి. అందుకు అనుగుణంగా ముందు రాష్ట్రంలోని పాఠశాలల పరిస్థితులను తెలుసుకుని వాటిని బాగు చేయాలి. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ బడులకు పంపగలిగేలా పరిస్థితుల్లో మార్పు తీసుకుని రావాలి. అలాగే ప్రైవేట్ స్కూళ్ల ఫీజు దోపిడీని కూడా అరికట్టాలి. లక్షల్లో ఫీజులు కట్టడం కోసం తల్లిదండ్రులు నానా యాతన పడుతున్నారు. ఇది తప్పాలంటే ప్రభుత్వ బడులు బలోపేతం కావాలి. అందుకు సంకల్పం ఉంటే మార్పు సాధ్యమే.

# రేవంత్ రెడ్డి నియంత పాలనకు  రోజులు దగ్గర పడ్డాయి

మొదటి పేజీ తరువాయి

: రేవంత్ రెడ్డి నియంత పాలనకు రోజులు దగ్గర పడ్డాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి.హరీశ్ రావు హెచ్చరించారు. ఈ సారి కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు కూడా రావని జోస్యం చెప్పారు. తమిళనాడు, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు అధికారం కోల్పోయాయని గుర్తు చేశారు. తెలంగాణలో కూడా అదే జరగబోతోందని అన్నారు. ఈ మేరకు రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి పాలనపై  మరోసారి నిప్పులు చెరిగారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. . సీఎం రేవంత్ రెడ్డి.. జూబ్లీహిల్స్ ప్యాలెస్ చాలదని వంద కోట్ల రూపాయిలతో ఇంకో ప్యాలస్ నిర్మించారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇంటి సమీపంలో దిగడానికి హెలికాప్టర్ చాలదని ఐదు కోట్ల రూపాయిలతో ఎయిర్ బస్ తెచ్చుకుంటున్నారని మండిపడ్డారు. ఫుట్ బాల్ సోకుల కోసం మెస్సీకి రూ.100 కోట్లు ఖర్చు పెట్టారని ఆరోపించారు. అందాల పోటీల కోసం మరో రూ.100 కోట్లు ఖర్చు చేశారన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగితే ఇక్కడి నుంచి అక్కడికి మూటలు పంపటానికి నగదు ఉంటుందని, కానీ విద్యార్థులు, రైతులకు ఇవ్వటానికి మాత్రం డబ్బులు ఉండవా అంటూ సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు చురకలంటించారు. కాంట్రాక్టర్లకు బిల్లులు ఆపి రైతుబంధు నిధులు విడుదల చేయాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కరోనా సమయంలోనూ కేసీఆర్ రైతుబంధు ఇచ్చారని.. ఇప్పుడు సీఎం రేవంత్‌కు ఏమైందని ప్రశ్నించారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మొదటి ఏడాది రైతుబంధు పూర్తిగా ఎగ్గొట్టారు. రెండోసారి మూడు ఎకరాలకు, మూడోసారి రెండెకరాలకే ఇచ్చారు. మొత్తం రూ.20వేల కోట్లు ఎగ్గొట్టి రుణమాఫీ చేశామని చెబుతున్నారు. కేసీఆర్ క్రమం తప్పకుండా రైతుబంధు ఇచ్చారు. 45 రోజుల్లో రూ.9వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు గతంలో సిద్దిపేటలో సీఎం రేవంత్ ప్రకటించారు. 65 రోజులు పూర్తయినా ఇంకా పడలేదు. దేశవ్యాప్తంగా ప్రశంసలందుకున్న రైతు బీమా పథకం కూడా బంద్ అయింది. ఎల్ఐసీకి ప్రభుత్వం ప్రీమియం చెల్లించక పోవడంతో ఆ పథకం నిలిచిపోయింది. రైతు చనిపోతే ఆ కుటుంబానికి అందాల్సిన బీమా కూడా రావడం లేదు. ఎరువులకూ ఇబ్బందులు తప్పడం లేదు. వడ్లు, మక్కలు విక్రయానికి రైతులు పడిగాపులు కాశారు. సంచులు చెదలు పట్టినా వడ్లు కొనే పరిస్థితి లేకుండా పోయింది. 24 గంటల ఉచిత కరెంటూ పోయింది. కాంగ్రెస్ నేతలు అబద్ధాలు చెబుతున్నారు. రైతులు ఆ పార్టీకి ఓటేసే పరిస్థితి లేదన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, మహిళలకు రూ.2,500, రూ.4వేల చొప్పున పింఛను ఇవ్వడం లేదు. ప్రభుత్వ సొమ్ము రూ.100 కోట్లతో సీఎం క్యాంప్ ఆఫీస్ నిర్మించుకున్నారు. అందాల పోటీలు, ఫుట్‌బాల్ సోకులకు నిధులు ఉంటాయి కానీ.. ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతుబంధు, రైతుబీమాకు ఉండవా? రైతులకు డబ్బు ఇచ్చేందుకు రేవంత్‌కు మనసు రావడం లేదు. ఆయనకు అధికారం మత్తెక్కింది. హిట్లర్ పాలనను అంతం చేయడానికి ప్రజలు కంకణం కట్టుకున్నారు. కాంగ్రెస్‌కు డిపాజిట్లు కూడా రావు. మళ్లీ కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని హరీశ్‌రావు అన్నారు.

## హెచ్-1బీ వీసా ఫీజు పెంపవు వ్యవహారం

మొదటి పేజీ తరువాయి

ఇటీవల కొట్టివేసింది. ఈ తీర్పును సవాల్ చేసేందుకు అమెరికా న్యాయశాఖ చర్యలు చేపట్టింది. హెచ్-1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు  పెంచుతూ గతేడాది సెప్టెంబరులో ట్రంప్ తీసుకొన్న నిర్ణయం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అయితే, దీన్ని యూఎస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌తో సహా పలు డెమోక్రటిక్ నేతలు ఉన్న రాష్ట్రాలు కోర్టులో సవాల్ చేశాయి. ఈ క్రమంలో బోస్టన్‌లోని ఫెడరల్ కోర్టు ట్రంప్ నిర్ణయం చట్టవిరుద్ధమైనదని ప్రకటించింది. దీంతో పలు కంపెనీలకు ఊరట లభించనట్లయ్యింది. ఈ నేపథ్యంలోనే ఫెడరల్ కోర్టు తీర్పును అప్పీల్ చేసేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతూ అమెరికా న్యాయశాఖ నోటీసు దాఖలు చేసింది. ట్రంప్ యంత్రాంగం తాజా చర్యలతో ఈ అంశం మరికొన్ని నెలల పాటు న్యాయస్థానాల్లో మగ్గనుంది. దీంతో ఫీజు భారం నుంచి కంపెనీలకు పూర్తి మినహాయింపు దక్కనట్లేని భావిస్తున్నారు.

## సర్ ప్రక్రియ్ ..ఓ భూతం లాంటిది

మొదటి పేజీ తరువాయి

మనందరిపై ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలి?పారు. రాజ్యసభ అభ్యర్థిగా మీనాక్షి నటరాజన్‌కు టికెట్ ఇస్తే బీజేపీ గెలవదని తెలిసి కూడా ఆ పార్టీ అభ్యర్థిని పెట్టిందని చెప్పారు. తెలంగాణాలో ఎఫ్ఐఆర్ ఉందని అన్యాయంగా మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరించారని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. ఇంతకు ముందు ఓట్లు దొంగిలించారని.. ఇప్పుడు సీట్లు దొంగిలించారని బీజేపీ తీరును ఈ సందర్భంగా ఆయన ఎండగట్టారు. సీబీఐ, ఈడీ పేరుతో గెలిచిన వారిని.. వారి వైపు తిప్పుకునేందుకు కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ చూస్తుందని మండిపడ్డారు. ఇలాంటి సమయంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీకి మనమందరం అండగా ఉండాలని పార్టీ శ్రేణులకు మంత్రి పొంగులేటి పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం కుట్రలను తిప్పి కొట్టాల్సిన బాధ్యత కూడా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సైనికుడిలా కష్టపడి ఓటు పోగొట్టకుండా జాగ్రత్త పడాలని బీఎల్ఏలకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు.

## మీనాక్షి వ్యవహారంపై  సిట్ వేయగలరా?

మొదటి పేజీ తరువాయి

వాళ్లే కేసు గురించి ఎన్నికల కమిషన్‌కు చెప్పి ఉంటారన్నారు.మీడియాతో కేటీఆర్ చిట్ చాట్‌లో తన అభిప్రాయాలను వెల్లడించారు. రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీలో ఉన్న 'బ్లాక్ షీప్' ఎవరో కనుక్కోవాలి. కాంగ్రెస్ పార్టీ అంటేనే కంపు. అలాంటి కాంగ్రెస్ కంపులో ద్రోహాల పార్టీ అంశంలో మమ్మల్ని ఎందుకు లాగుతున్నారు? మీనాక్షి నటరాజన్ అంటే పడని వారే ఈ పని చేశారు. మీనాక్షి నటరాజన్‌కి తెలంగాణ కాంగ్రెస్‌లో ఎవరు వ్యతిరేకులో ప్రజలందరికీ తెలుసన్నారు. ముమ్మాటికీ ఆయన చేసిన పనినే ఇది. కాంగ్రెస్ పార్టీనే కుట్రలు చేసుకొని  అందులో ప్రతిపక్షాలను ఎందుకు లాగుతున్నారో తెలుసుకోవాలి. కాంగ్రెస్ పార్టీలో పదవులు, డబ్బులకే వస్తున్నాయని షబ్బీర్ అలీ చెప్పినందుకు అభినందనలు. షబ్బీర్ అలీ ఇప్పటికైనా ఉన్న వాస్తవాన్ని ప్రజల ముందు గట్టిగా చెప్పారు. అసలు గతంలో పీసీసీ పదవిని పైసలకు అమ్ముకున్నది కాంగ్రెస్ పార్టీనే కదా! ఆ తర్వాత ముఖ్యమంత్రి పదవిని కూడా డబ్బులకే అమ్ముకున్నదని ఆరోపించారు. ఇప్పుడున్న ముఖ్యమంత్రి కూడా డబ్బులు పెట్టి పదవి కొనుక్కున్న వ్యక్తే కదా! రేవంత్ రెడ్డి పేమెంట్ కోటా సీటు అన్న విషయం అందరికీ తెలుసు. ప్రతి నెలా డబ్బుల మూట పంపితేనే ఆయన పదవి ఉంటుంది. రేవంత్ రెడ్డి రెగ్యులర్ సీఎం కాదు, రెన్యూవల్ సీఎం అని అందరికీ తెలుసు. కాబట్టి, షబ్బీర్ అలీ చెప్పిన మాటలు ముమ్మాటికీ వాస్తవమన్నారు. ఎయిర్ పోర్టు మెట్రో పూర్తయితే ఇంత ట్రాఫిక్ ఉండదు, కానీ ఆ ప్రాజెక్టు రేవంత్ రెడ్డి ఆపేశాడని ఆరోపించారు. ఉన్న నగరాన్ని గాలికి వదిలేసి ఫ్యూచర్ సిటీ అనడం ఏంటి? సీఎం రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీ అని ఊహల్లో బతుకుతున్నాడని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌ను మరింతగా అభివృద్ధి చేస్తే సరిపోతుందన్నారు. రేవంత్ రెడ్డికే ఫ్యూచర్ లేదు ఇంకా ఫ్యూచర్ సిటీ ఎంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ అసమర్థ పాలనతో రాష్ట్రం 40 ఏండ్లు వెనక్కి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మొన్నటి ఒక్క వర్షానికే నగరం చెరువులను తలపించిందన్నారు. దీనికి రేవంత్ రెడ్డి చేతకాని తనమే కారణమన్నారు. ఎక్కడో ఒకచోటు ఒకటి రెండు చెరువులు బాగు చేసి గొప్పలు చెప్పుకుంటున్నరు. కానీ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వందల చెరువులను సుందరీకరించామని గుర్తు చేశారు. ఇకనైనా అభివృద్ధిపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. జులైలో కేంద్రం మళ్లీ డీలిమిటేషన్ బిల్లు తెస్తుందని మాకు సమాచారం ఉందన్నారు. దేశం మొత్తం కాకున్నా.. తెలంగాణ, ఏపీలో నియోజకవర్గాల సంఖ్య పెంచాలన్నారు. జమిలి ఎన్నికల విషయంలో ఏం జరుగుతుందో చూడాలి. డీలిమిటేషన్లో దక్షిణాదికి ఉన్న 24 శాతం వాటా తగ్గితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మంచి పనితీరు కనబరిచిన రాష్ట్రాలను శిక్షిస్తామంటే ఎలా? దేశాభివృద్ధికి దోహదపడే రాష్ట్రాలకు అన్యాయం చేస్తే సహించే ప్రసక్తే లేదన్నారు.

## పాశ్చాత్య దేశాల ద్వంద్వ ప్రమాణాలు

మొదటి పేజీ తరువాయి

పాశ్చాత్య దేశాల ద్వంద్వ ప్రమాణాలపై భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ తాజాగా విమర్శలు గుప్పించారు. రష్యా చమురును కొనుగోలు చేయమని 2022లో అమెరికా భారత్‌ను అభ్యర్థించిందని చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరల స్థిరీకరణ దిశగా రష్యా చమురు కొనుగోలు చేయాలని యూఎస్ చెప్పిందని అన్నారు. ఫిన్‌లాండ్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా తమకు స్థిరమైన సరఫరాదారుగా ఉందని కూడా మంత్రి జైశంకర్ తెలిపారు. యూఎస్ మాత్రం పరస్పర విరుద్ధ విధానాలను అవలంబించిందని అన్నారు. యూఎస్ నిర్ణయాలకు నైతిక ప్రాముఖ్యాన్ని ఆపాదించాల్సిన అవసరం లేదని కూడా అభిప్రాయపడ్డారు. అప్పట్లో అమెరికా భారత్‌ను ప్రత్యేకంగా అభ్యర్థించింది. చమురు మార్కెట్ స్థిరత్వం కోసం రష్యా చమురును కొనుగోలు చేయాలని చెప్పింది. ముడి చమురు ధరల లభ్యత, ధరల ఆధారంగా మేము కొనుగోళ్లు చేస్తాము' అని మంత్రి జైశంకర్ స్పష్టం చేశారు. రష్యా విషయంలో భారత్ మరీ ఉదారంగా వ్యవహరిస్తూ ముడి చమురు కొనుగోలు చేస్తోందన్న ఒక విలేకరి ఆరోపణపై మంత్రి ఈ మేరకు స్పందించారు. ఆ సమయంలో మార్కెట్‌లో ముడి చమురులో అధిక భాగం రష్యాకు చెందినదేనని అన్నారు. భారత్‌కు ఎంతోకాలంగా ముడి చమురును సరఫరా చేస్తున్న పశ్చిమాసియా దేశాల క్రూడాయిల్ ను ఐరోపా దేశాలు ఎక్కువగా కొనుగోలు చేసేవని చెప్పారు. ఆ పరిస్థితుల్లో తాము తమ దిశను మార్చుకోవాల్సి వచ్చిందని వివరించారు. రష్యా చమురును కొనుగోలు చేస్తున్నామని మొదట సుంకాలు విధించారు. ఆ తరువాత మళ్లీ వాటిని సడలించారు. కాబట్టి, ఇక్కడ ఏదో గొప్ప సైద్ధాంతిక ప్రాతిపదిక ఉన్నట్టు భావించకూడదు. ఇది నైతికతకు సంబంధించిన అంశంగా పరిగణించడం అనవసరం అని మంత్రి జైశంకర్ తేల్చి చెప్పారు.ఈ సందర్భంగా రష్యా విషయంలో భారత్ అనుసరిస్తోన్న విధానంపై ఐరోపా దేశాలు చేస్తోన్న విమర్శలను ఆయన తిప్పికొట్టారు. రష్యా చమురు కొంటున్నందుకు తమను ప్రశ్నిస్తోన్న ఆ దేశాలు విక్రయించిన ఆయుధాలతో ప్రత్యర్థులు భారత్‌పై దాడులకు ఉపయోగించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈసందర్భంగా భారత్ దేశ ఇంధన ఎంపికలను ఆయన సమర్థించారు. అంతర్జాతీయ ఇంధన మార్కెట్లను స్థిరీకరించేందుకు అమెరికానే రష్యా చమురు కొనుగోలు చేయమని చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. ఉక్రెయిన్‌తో యుద్ధం ప్రారంభమైన దగ్గరినుంచి రష్యాతో భారత్ మరీ సానుకూలంగా వ్యవహరిస్తోందని, ఆ దేశ చమురుపై అతిగా ఆధారపడుతోందని ఈ చర్చలో మంత్రికి ప్రశ్న ఎదురైంది. దానికి మంత్రి సూటిగా బదులిచ్చారు. భారతదేశ ప్రత్యర్థులకు ఐరోపా దేశాలు ఆయుధాలు అమ్మిన విషయాన్ని గుర్తుచేసి, స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. భారత్ తయారుచేసిన ఆయుధాలతో ఏ ఐరోపా దేశంపైనా దాడి జరగలేదు. ఐరోపా ఆయుధాల విషయంలో కూడా నేను అలా చెప్పగలిగితే బాగుండేది. ఐరోపా ఆయుధాలు అమ్మింది. వాటిని భారత్‌పై దాడి చేయడానికి ఉపయోగించారు. ఇప్పుడే కాదు.. కొన్నేళ్లుగా అలా జరుగుతోంది. ఐరోపాను ప్రమాదంలో పడేసే పని ఏదీ భారతీయులు చేయలేదని పేర్కొన్నారు. అలాగే రష్యా చమురు విషయంలో భారత విధానంపై మరోసారి స్పష్టత ఇచ్చారు.

## యధాతథంగా సింగరేణి మెడికల్ బోర్డు

మొదటి పేజీ తరువాయి

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అర్హులైన ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శనివారం మంచిర్యాలలో 335 మంది వారసులకు ఉద్యోగ నియామక పత్రాలను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. సింగరేణిలో మారుపేర్ల సమస్య పరిష్కారానికి న్యాయ నిపుణుల సలహాలతో ముందుకు సాగుతున్నామని భట్టి చెప్పారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత సింగరేణిలో మొత్తం 2,657 ఉద్యోగాలను భర్తీ చేసినట్లు తెలిపారు. ఇందులో 2,102 కారుణ్య నియామకాలు, 555 ప్రత్యక్ష ఉద్యోగాల భర్తీ చేశామన్నారు. కారుణ్య నియామకాల కోసం వయోపరిమితిని 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచినట్లు వెల్లడించారు. 40 వేల మంది సింగరేణి ఉద్యోగులకు రూ.1.25 కోట్ల ప్రమాద బీమా సదుపాయం కల్పించినట్లు తెలిపారు. ఉద్యోగుల కోసం రూ.10 లక్షల ఉచిత సహజ మరణ బీమా అమలు చేస్తున్నామని వెల్లడించారు. కాంట్రాక్టు కార్మికులకు రూ.40 లక్షల ప్రమాద బీమాతో పాటు బోనస్ చెల్లిస్తున్నామని డిప్యూటీ సీఎం చెప్పారు. గత రెండేళ్లలో సింగరేణి కార్మికులకు రూ.1,500 కోట్ల లాభాల వాటాను పంపిణీ చేసినట్లు తెలిపారు. సింగరేణి ఆస్పత్రులను ఆధునికీకరిస్తున్నామని, గోదావరిఖనిలో అత్యాధునిక క్యాథ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

## గ్లోబల్ లాజిస్టిక్స్ డెస్టినేషన్‌గా తెలంగాణ

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ రాష్ట్రాన్ని  గ్లోబల్ లాజిస్టిక్స్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. శుక్రవారం హెచ్ఐసీసీ నోవాటెల్‌లో ఎఫ్‌టీసీసీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ 2026' సదస్సుకు మంత్రి శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లాజిస్టిక్స్ రంగంలో భవిష్యత్ అవకాశాలపై సదస్సు చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌లో కీలక రంగంగా లాజిస్టిక్స్‌ను ప్రభుత్వం గుర్తించిందన్నారు. లాజిస్టిక్స్ పాలసీ 2.0 ద్వారా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. తెలంగాణ వ్యాప్తంగా మెగా మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కులు, డ్రై పోర్టుల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని మంత్రి తెలిపారు. బాండెడ్ వేర్ హౌజింగ్ లాజిస్టిక్ పార్కుల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఏఐ సైబర్ సెక్యూరిటీ మెషీన్ లెర్నింగ్ వినియోగానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. లాజిస్టిక్స్ రంగానికి అవసరమైన నైపుణ్యాలు కలిగిన మానవ వనరులను తయారు చేయడంపైనా ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పెట్టుబడిదారులకు ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని హామీ మంత్రి శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు.

## సంక్షేమ శాఖలో అవినీతి అంతా అబద్ధం

మొదటి పేజీ తరువాయి

మాట్లాడుతూ.. బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా తాను, మైనార్టీ శాఖ మంత్రిగా అజారుద్దీన్, ఎస్సీ, ఎస్టీ మంత్రిగా అడ్లూరి లక్ష్మణ్ ఉన్నామని పేర్కొన్నారు. మైనార్టీ, బీసీ, ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖల్లో పారదర్శకంగా మంత్రులుగా సంబంధం లేకుండా ప్రిన్సిపాల్ సెక్రటరీ సవ్యసాచి ఘోష్‌కు తాము నిర్ణయాధికారం ఇచ్చామని గుర్తు చేశారు. అయితే అవినీతి జరిగిందంటూ హరీశ్ రావు అవగాహన లేకుండా మాట్లాడి ఆయన.. తన స్థాయిని తగ్గించుకుంటున్నారని చెప్పారు. గత ప్రభుత్వంలో చేసిన విధంగా అవినీతి జరుగుతుందనే భావనలో ఆయన ఉన్నట్లు ఉన్నారని ఎద్దేవా చేశారు. మంత్రులు అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్ పక్షాన చెబుతున్నానని.. సంక్షేమ శాఖల్లో అవినీతి జరిగిందని రుజువు చేస్తే దేనికైనా సిద్ధమన్నారు. పేదలకు విద్య, నాణ్యమైన ఆహారం అందాలనే ఆలోచన తమకు ఉందని తెలిపారు.  అవినీతి జరిగిందంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు చేస్తున్న ఆరోపణలను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఖండించారు. ఈ అవినీతిపై చర్చించేందుకు మీరే డేట్ టైమ్ ఫిక్స్ చేయండి.. చర్చిద్దామంటూ హరీశ్ రావుకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సవాల్ విసిరారు. గురుకుల విద్యార్థుల షూస్, యూనిఫాం, బుక్స్ టెండర్‌లో రూ. 2 వేల కోట్ల అవినీతి జరిగిందన్న హరీష్ రావు ఆరోపణలను తాను ఖండిస్తున్నట్లు చెప్పారు. తాము జాతీయ స్థాయిలో టెండర్లు పిలిచామని గుర్తు చేశారు. మొత్తం టెండర్ విలువే రూ.687 కోట్లు అని వివరించారు. రూ.2 వేల కోట్ల అవినీతి జరిగిందని హరీశ్ రావు పచ్చి అబద్దాలు చెప్పారని మండిపడ్డారు. వారు అవినీతి చేసినట్లే తాము చేశామని అనుకుంటున్నారా? అంటూ బీఆర్ఎస్ నేతను మంత్రి సూటిగా ప్రశ్నించారు. ఏడు లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ కోసం తాము మంచి ఆలోచన చేస్తే హరీశ్ రావుకు అక్కసు ఎందుకు? అని ప్రశ్నించారు. మీరు గురుకులాలకు ఒక్క కొత్త భవనం అయినా నిర్మించారా?.. ఎస్సీ విద్యార్థుల కోసం ఒక్క హాస్టల్ భవనం అయినా కట్టించారా? అని హరీశ్ రావుకు ఈ సందర్భంగా ప్రశ్నలు సంధించారు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలంటూ హరీశ్ రావుకు స్పష్టం చేశారు. ప్రభుత్వ సంస్థలకు కూడా కొంత శాతం ప్రొక్యూర్‌మెంట్‌కు అవకాశం ఇచ్చామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పేర్కొన్నారు.

## మీనాక్షికి సుప్రీంలో దక్కని ఊరట

మొదటి పేజీ తరువాయి

రిటర్నింగ్ అధికారి తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ప్రస్తుతం ఎన్నికల పక్రియ కొనసాగుతు న్నందున, ఈ దశలో తాము జోక్యం చేసుకోలేమని కోర్టు స్పష్టం చేసింది. నామినేషన్ తిరస్కరణపై అభ్యంతరాలు ఉంటే ఎన్నికల పక్రియ ముగిసిన తర్వాత నిబంధనల ప్రకారం 'ఎన్నికల పిటిషన్'  దాఖలు చేసుకోవచ్చని స్పష్టం చేస్తూ, మీనాక్షి నటరాజన్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసుపై కీలక విచారణ జరిపింది. మీనాక్షి నటరాజన్ తరఫున కోర్టులో సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ బలమైన వాదనలు వినిపించారు. ఆమెపై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని, ఒక ప్రైవేట్ ఫిర్యాదుకు సంబంధించిన అంశాన్ని కోర్టు ఇంకా పరిగణనలోకి కూడా తీసుకోలేదని సింఘ్వీ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఆ వ్యవహారంలో కేవలం నోటీసు మాత్రమే ఇచ్చారని, అలాంటప్పుడు క్రిమినల్ కేసుల వివరాలను అఫిడవిట్‌లో వెల్లడించలేదనే ప్రశ్నే ఉత్పన్నం కాదని ఆయన వాదించారు. రిటర్నింగ్ అధికారి చట్ట విరుద్ధంగా, అత్యంత ఏకపక్షంగా వ్యవహరించి నామినేషన్‌ను తిరస్కరించారని కోర్టుకు విన్నవించారు. అయితే, గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన మైలురాయి లాంటి తీర్పులను ఉటంకించిన ధర్మాసనం, ఎన్నికల పక్రియ మధ్యలో కోర్టులు జోక్యం చేసుకోలేవని తేల్చి చెప్పింది. రిటర్నింగ్ అధికారి నిర్ణయంపై ఇప్పుడు స్టే ఇవ్వలేమని, బాధితులు ఎన్నికల అనంతరం తగిన హైకోర్టును ఆశ్రయించడమే ఏకైక మార్గమని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు తీసుకున్న ఈ నిర్ణయంతో మీనాక్షి నటరాజన్‌కు ప్రస్తుతానికి న్యాయపరమైన ఉపశమనం లభించనట్లయింది.

# జమ్మికుంటలో గులాబీ శ్రేణుల మహా సంగ్రామ సభలా మారిన బిఆర్ఎస్ సభ్యత్వ నమోదు అవగాహన సమావేశం

**జమ్మికుంట, జూన్ 12, గాండీవం :**





జమ్మికుంట పట్టణంలోని ఎంపీఆర్ గార్డెన్స్‌లో బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం, సర్ ఓటర్ నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన సమావేశం ఘన విజయవంతమైంది. పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులతో సభా ప్రాంగణం గులాబీమయయంగా మారింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు, మాజీ మంత్రి జీవన్ రెడ్డి, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్, సభ్యత్వ నమోదు నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాకేష్ కుమార్, ఎర్రోళ్ల శ్రీనివాస్, గెల్లు శ్రీనివాస్ యాదవ్ తదితరులు హాజరై పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, స్వాభిమానానికి ప్రతీకగా బి.ఆర్.ఎస్ పార్టీ నిలిచిందన్నారు. తెలంగాణ సాధన నుంచి రాష్ట్ర అభివృద్ధి వరకు ప్రతి అడుగులోనూ భారతీయ రాష్ట్ర సమితి పాత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో తెలంగాణ అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని ఆయన విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, రైతులు, యువత, మహిళలు, నిరుద్యోగులు తీవ్ర నిరాశలో ఉన్నారని అన్నారు. తెలంగాణను దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దిన నాయకుడు కేసీఆర్ అని, సంక్షేమం--అభివృద్ధి రెండింటినీ సమన్వయం చేసిన పాలనను ప్రజలు మళ్లీ కోరుకుంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను గమనిస్తున్నారని. రానున్న రోజుల్లో గులాబీ జెండా మరింత బలంగా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ కోసం కష్టకాలంలోనూ అండగా నిలిచిన ప్రతి కార్యకర్తకు బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు. కార్యకర్తల కష్టమే పార్టీ బలం అని, వారి త్యాగాలు ఎప్పటికీ వృథా కావని అన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ బలోపేతంలో ప్రతి కార్యకర్త భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. హుజూరాబాద్ నియోజకవర్గ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ, సీడ్ వరి, సాధారణ వరి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు నష్టపోతున్నారని, మక్క కొనుగోళ్లు, యూరియా సరఫరా, సాగునీటి నిర్వహణలో ప్రభుత్వ వైఫల్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని అన్నారు. దళితబంధు పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేసిన ఆయన.. బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన సంక్షేమ పథకాలను కొనసాగించకుండా ప్రజలను నిరాశపరచడం బాధకరమన్నారు. అలాగే హుజూరాబాద్ డంపింగ్ యార్డ్ అంశంపై ప్రజలకు పూర్తి సమాచారం ఇవ్వాలని, ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేసే అధికారులను ప్రశ్నించడానికి బిఆర్ఎస్ ఎప్పుడూ వెనుకాడదన్నారు. కేసీఆర్ నాయకత్వంలో, హరీశ్ రావు ఆధ్వర్యంలో వివిధ కుల సంఘాల భవనాలకు శంకుస్థాపనలు చేసి అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేశామని గుర్తుచేశారు. తెలంగాణలో సమగ్ర అభివృద్ధి, సామాజిక న్యాయం, సంక్షేమమే బిఆర్ఎస్ లక్ష్యమని తెలిపారు. రానున్న రోజుల్లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఉద్యమ స్ఫూర్తితో ముందుకు తీసుకెళ్లాలని. ప్రతి గ్రామంలో గులాబీ జెండా మరింత బలంగా ఎగిరేలా కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రజల ఆశీర్వాదంతో పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం కాయం అని జోష్యం చెప్పారు. తెలంగాణ పునర్నిర్మాణానికి కేసీఆర్ నాయకత్వమే ప్రత్యామ్నాయం అని ప్రజలు నమ్ముతున్నారని పాడి కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు.

# 2010 పూర్వం నియమితులైన టీచర్లకు టెట్ మినహాయింపు ఇవ్వాలి

## తపస్ జిల్లా అధ్యక్షులు ప్రసాద్ రావు డిమాండ్

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 12 గాండీవం**

ఏప్రిల్, 2010 కంటే ముందు నోటిఫికేషన్ ద్వారా నియమైన ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం తపస్ జగిత్యాల జిల్లా శాఖ డిమాండ్ చేసింది. శుక్రవారం జిల్లా తపస్ కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు బోయినిపెల్లి ప్రసాద్ రావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రసాద్ రావు, ప్రధాన కార్యదర్శి కొక్కుల రాజేష్ లు మాట్లాడుతూ ఎన్సీటీఈ నిబంధనల ప్రకారం 2025 సెప్టెంబర్ 1న సుప్రీం కోర్ట్ ఇచ్చిన తీర్పు మేరకు 2028 ఆగస్టు 31 లోపు టెట్ పాస్ కాని సర్వీస్ టీచర్ల సర్వీస్ తొలగించే అవకాశం ఉందని తపస్ జిల్లా అధ్యక్షులు బోయినపల్లి ప్రసాద్ రావు, ప్రధాన కార్యదర్శి కొక్కుల రాజేష్ ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణలో దాదాపు 30,000 మంది టీచర్లు దీని ప్రభావానికి లోనవుతారని తెలిపారు. 2010కి ముందు టెట్ అవసరం లేకుండా నియమితులైన వారిపై ఇప్పుడు టెట్ తప్పనిసరి చేయడం అన్యాయమని, 30 ఏళ్లుగా బోధిస్తున్న టీచర్లకు సంబంధం లేని సబ్జెక్టులు చదవాల్సి వస్తుందని వారు అన్నారు. ఎన్ సీ ఆర్ టీ, ఎస్ సీ ఈ ఆర్ టీ ల ఆధ్వర్యంలో దీక్ష, నిష్ఠ వంటి శిక్షణలు అందిస్తున్నందున టెట్ అవసరం లేదని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ తెచ్చి 2010 పూర్వపు నియామకాలకు మినహాయింపు ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు. కార్యక్రమంలో బోనగిరి దేవయ్య, సందేల్లి మలహాల్ రావు, నాగమల్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.




# బెంగుళూరు లో ఫోటో టుడే ఎక్స్పో ను ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఎస్‌కె హుస్సేన్

**తెలంగాణ గాండీవం దినపత్రిక జూన్ 12**



జూలై 12,13 మరియు 14వ తేదీలలో మూడు రోజుల పాటు ప్యాలెస్ గ్రౌండ్ త్రిపుర వాసిని కన్వెన్షన్ లో జరుగుతున్న ఫోటో టుడే ఎగ్జిబిషన్ ను తెలంగాణ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ ఞాఖ. హుస్సేన్ ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీబఎ–ఞావశ్రీశ్రీ ఆర్గనైజేషన్ వారు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ ఎక్స్పో కి దేశంలోనే అనేక రాష్ట్రాల ఫోటోగ్రాఫర్స్ వేలాదిగా పాల్గొంటారు. బెంగళూరు లో జరుగుతున్న ఈ ఫోటో టుడే ఎగ్జిబిషన్ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అసోసియేషన్ నుండి రాష్ట్ర కోశాధికారి బీమిడి మాధవరెడ్డి , ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు శ్రీ లింగమూర్తి , పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు పోగుల విజయ్ కుమార్ , మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షులు శ్రీ కుమ్మరి నరసింహ , రాష్ట్ర మీడియా చైర్మన్ శేఖర్ పేరేపల్లి ప్రత్యేక అతిధులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ఞాఖ హుస్సేన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాకుండా ఇండియా లో వేరు వేరు రాష్ట్రాలలో జరిగే ఎగ్జిబిషన్ కార్యక్రమాలకు మన జిల్లా ప్రతినిధుల అవగాహన కోసం తీసుకెళ్తామని వివరించారు. తెలంగాణ రాష్ట్ర అసోసియేషన్

# దుబాయ్ ప్రమాద బాధితులకు రూ.2.60 కోట్ల సహాయం.

**'బుర్జీల్'కు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కృతజ్ఞతలు**

**మృతుల కుటుంబాలకు రూ.26 లక్షల చొప్పున ఆర్థిక సాయం**

**-- హైదరాబాద్‌కు బుర్జీల్ చైర్మన్‌ను ఆహ్వానించిన ఎమ్మెల్యే**

**జగిత్యాల జిల్లా ప్రతినిధి జూన్ 12 గాండీవం:**



ఇటీవల దుబాయ్‌లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఏడుగురు కార్మికుల కుటుంబాలకు, గాయపడిన తొమ్మిది మందికి యూఏఈకి చెందిన బుర్జీల్ హోల్డింగ్స్ చైర్మన్, ప్రముఖ వ్యాపారవేత్త డా. షంషీర్ వయలిల్ ప్రకటించిన 10 లక్షల దిర్హంల (సుమారు రూ.2.60 కోట్లు) మానవతా సహాయ ప్యాకేజీపై చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హర్షం వ్యక్తం చేశారు. డా. షంషీర్ వయలిల్ అందుబాటులో లేకపోవడంతో ఆయన సంస్థ ప్రతినిధులు ఎ. విజయ కుమార్, అహ్మద్ బిన్ సులేమాన్, ఎం. ఉన్ని కృష్ణన్, డా. పంకజ్ కుమార్ భట్‌లను శుక్రవారం దుబాయ్‌లో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కలిసి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై అడ్వయిజరీ కమిటీ సభ్యుడు కొట్టాల సత్యం గౌడ్, దుబాయ్‌లోని తెలంగాణ సామాజిక కార్యకర్తలు జువ్వాడి శ్రీనివాసరావు, శామ్యూల్ దామెర, సలావుద్దీన్, ఎస్వీ రెడ్డి, ద్యాగతి మహిపాల్ యాదవ్, సుతారి సత్యనారాయణ, కోరెపు మల్లేష్, ఎమ్మెల్యే పీఏ ముత్యం శంకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యం మాట్లాడుతూ డా. షంషీర్ వయలిల్‌తో పాటు బుర్జీల్ ప్రతినిధులను హైదరాబాద్‌కు ఆహ్వానించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి సమక్షంలో మృతుల కుటుంబాలకు సహాయ చెక్కులను అందజేసేలా చర్యలు తీసుకోవాలని ప్రతిపాదించినట్లు వెల్లడించారు. ప్రమాదంలో మృతి చెందిన ఏడుగురిలో ముగ్గురు జగిత్యాల జిల్లాకు చెందిన వారేనని, మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి లక్ష దిర్హంలు (సుమారు రూ.26 లక్షలు) చొప్పున ఆర్థిక సాయం అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే గాయపడిన తొమ్మిది మందికి వైద్య చికిత్స, పునరావాసం, ప్రభావిత కుటుంబాల పిల్లల విద్య కోసం కూడా ప్రత్యేక సహాయం అందించనున్నట్లు పేర్కొన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దుబాయ్‌లోని భారత రాయబార కార్యాలయాన్ని సందర్శించి కాన్సులేట్ అధికారులతో సమావేశమయ్యారు. ప్రమాదంలో మృతి చెందిన వారి మృతదేహాల తరలింపు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. అనంతరం రాషేద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఎమ్మెల్యే పర్యటనను దుబాయ్‌లోని సామాజిక కార్యకర్తలు గుండెల్లి నర్సింలు, సుతారి సత్యనారాయణతో పాటు హైదరాబాద్‌కు చెందిన ఎన్నారై అడ్వయిజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, సభ్యుడు నంగి దేవేందర్ రెడ్డి సమన్వయం చేసినట్లు తెలిపారు.

# ఏ ఐ సి టి ఈ ప్రగతి స్కాలర్‌షిప్ కు ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థిని ఎంపిక

**కేసముద్రం,జూన్12,గాండీవం**



కేసముద్రం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు, చెందిన విద్యార్థిని జి.వెన్నెల ప్రతిష్ఠాత్మకమైన ఏఐసిటి ఈ ప్రగతి స్కాలర్‌షిప్ 2025-2026 కు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఈ మల్లికార్జున్ తెలిపారు. అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఞా×జుజు) ఆధ్వర్యంలో బాలికల ఉన్నత సాంకేతిక విద్యను ప్రోత్సహించేందుకు అందజేసే ఈ స్కాలర్‌షిప్ ద్వారా జి. వెన్నెలకు ప్రతి విద్యా సంవత్సరానికి రూ.50,000/- ఆర్థిక సహాయం అందనుంది ఈ ఆర్థిక సహాయం ప్రస్తుత విద్యా సంవత్సరంతో పాటు ద్వితీయ మరియు తృతీయ సంవత్సరాలలో కూడా కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఈ.మల్లికార్జున్ మాట్లాడుతూ,జి.వెన్నెల సాధించిన ఈ విజయం కళాశాలకు గర్వకారణమని, ఇతర విద్యార్థినులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించుకుంటూ ఇటువంటి జాతీయ స్థాయి స్కాలర్‌షిప్‌లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాల నోడల్ అధికారి బి.సత్యనారాయణ మాట్లాడుతూ,ఏఐసిటిఈ అందిస్తున్న వివిధ స్కాలర్‌షిప్ పథకాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం ద్వారా మరింత మంది లబ్ధి పొందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వెన్నెల ఎంపికకు సహకరించిన అధ్యాపక బృందానికి ఆయన అభినందనలు తెలియజేశారు. వెన్నెల ప్రతిష్ఠాత్మక స్కాలర్‌షిప్‌కు ఎంపిక కావడంతో కళాశాల అధ్యాపకులు,సిబ్బంది సహ విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

**జిల్లాలో జర్నలిస్టులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తాం**

**త్వరలో యూనియన్ సభ్యులకు ఐడి కార్డులు అందజేస్తాం**

**యూనియన్ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి**

**టియుడబ్ల్యూజే ఐజేయు జిల్లా అధ్యక్షుడు చీటి శ్రీనివాసరావు**

**జగిత్యాల జిల్లా ప్రతినిధి జూన్ 12,గాండీవం:**



జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేసి రాబోయే తరానికి ఆదర్శంగా నిలిచే విధంగా యూనియన్ కార్యక్రమాలు చేపడుతున్నామని టియుడబ్ల్యూజే ఐజేయు జిల్లా అధ్యక్షుడు చీటి శ్రీనివాసరావు అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తా సమీపంలో గల టియుడబ్ల్యూజే ఐజేయు అనుబంధ ప్రెస్ క్లబ్ లో శుక్రవారం జిల్లా అధ్యక్షుడు చీటి శ్రీనివాసరావు అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా కార్యవర్గ సభ్యుల సహాయ సహకారాలు ఉంటేనే జర్నలిస్టుల సంక్షేమం కోసం వినూత్న కార్యక్రమాలు చేపట్టి సక్సెస్ అవుతాం అన్నారు. జిల్లాలోని యూనియన్ సభ్యులందరికీ ఐడి కార్డులు అందజేసే దిశగా పని చేస్తున్నామని, అందులో 70 శాతం కార్డులు పూర్తయ్యాయని తెలిపారు. మిగతా సభ్యుల వివరాలు త్వరగా పంపిస్తే ఈ నెలాఖరు వరకు ఐడి కార్డులు పంపిణి చేయనున్నట్టు వివరించారు. అక్రిడేషన్ కార్డుల పట్ల అపోహాలు వద్దని, అర్హులైన ప్రతి ఒక్క జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డు అందేలా యూనియన్ పక్షాన కృషి చేస్తామన్నారు. జిల్లాలో అక్రిడేషన్ కార్డుల జారీ ప్రక్రియ ఇంచార్జి డిపిఆర్వో వల్ల జాప్యం జరిగిందన్నారు. జిల్లాలో అన్ని పత్రికలకు జివో ఆదారంగా 450 కి పైగా కార్డులు ఇవ్వడానికి కమిటి ఆమోదం తెలిపిందన్నారు. అర్హులకు కార్డు రాకపోతే కొట్లాడదాం కాని అనర్హులు మాత్రం కార్డు పొందరాదన్నారు. జర్నలిస్టులుగా సమాజం కోసం పని చేసే అర్హులైన వారందరికీ కార్డులను అందజేసేలా చూస్తామన్నారు. వృత్తిలో కొనసాగుతున్న జర్నలిస్టులందరికీ మొదటి విడత కార్డులు జారీ చేస్తారని వివరించారు. జిల్లాలో జర్నలిస్టుల కోసం శిక్షణా తరగతులు పెట్టుకోవాలని రాష్ట్ర కార్యవర్గానికి తెలిపామని, మీడియా అకాడమి తరుపున శిక్షణా తరగతులు నిర్వహిస్తారన్నారు. ఈ శిక్షణా తరగతులకు 50 నుండి 60 మంది జర్నలిస్టులే అర్హులు కావున జిల్లాలో 3 చోట్ల శిక్షణా తరగతులు కావాలని అకాడమీ చర్మెన్ ను కోరామని చెప్పారు. త్వరలోనే నియోజకవర్గాల వారీగా ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తాం అన్నారు. త్వరలో జర్నలిస్టులకు, వారి కుటుంబాలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించేలా అధికారులతో చర్చించామన్నారు. యూనియన్ కార్యవర్గ సభ్యులు కార్యక్రమాల విషయంలో నిర్లక్ష్యం చేయకుండా జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో ముందుండాలని పిలుపునిచ్చారు. యూనియన్ పక్షాన జర్నలిస్టులకు క్రీడా పోటీలు నిర్వహిస్తాం అని అన్నారు. యూనియన్ ప్రాతినిధ్యం లేని మండలాలకు ప్రాతినిధ్యం ఇచ్చి ఈసి మెంబర్లను నియమించాలని సూచించారు. త్వరలో జిల్లా కార్యవర్గానికి ఉప కమిటీలు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. సీనియారిటీ ఉన్న వారికి ఉప కమిటిల్లో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతి నెల జిల్లా కార్యవర్గ సమావేశానికి హాజరు కాని వారిని కార్యవర్గం నుండి తొలగిస్తాం అన్నారు. ప్రైవేటు విద్యా సంస్థల్లో చదివే జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో 50 శాతం రాయితీ కల్పించాలని కలెక్టర్ ను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని, త్వరలోనే అన్ని మండలాల ఎం ఈ ఓలకు సర్క్యూలర్లు అందుతాయన్నారు. అదేవిధంగా యూనియన్ ను విచ్ఛిన్నం చేసే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తాం అని హెచ్చరించారు. ఫీల్డ్ లో లేని వారిని యూనియన్ నుంచి తొలగించడం జరుగుతుందన్నారు. కార్యవర్గ సభ్యులందరూ యూనియన్ పటిష్టతకు విభిన్న కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బెజ్జంకి సంపూర్ణ చారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగుల గోపాల్ చారి, ఉపాధ్యక్షులు గడ్డల హరికృష్ణ, హైదర్ అలీ, అల్లే రాము, లోక రమణా రెడ్డి, కోశాధికారి సిరిసిల్ల వేణు గోపాల్, సహాయ కార్యదర్శులు గుర్రం చంద్ర శేఖర్, కోరేపు రాజ్ కుమార్, చింత నరేష్, కార్యవర్గ సభ్యులు మనోజ్, శంకర్ గౌడ్, రఘుపతి రెడ్డి, హరీష్, నరేష్, సాజీద్, జమీర్ అలీ, గౌస్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

# మోచి బజార్‌లో షార్ట్ సర్క్యూట్‌తో ఇంటిలో అగ్ని ప్రమాదం

## -- ఘటన స్థలాన్ని సందర్శించిన మున్సిపల్ చైర్‌పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్

**జగిత్యాల జిల్లా ప్రతినిధి జూన్ 12,గాండీవం:**

జగిత్యాల పట్టణంలోని మోచి బజార్ ప్రాంతంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ ఇంటిలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఫైర్ ఇంజన్‌తో ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెస్తున్నారు. ఈ ప్రమాదంలో ఇంటిలోని కొంత సామగ్రి దగ్ధమైనట్లు తెలిసింది. అగ్ని ప్రమాదం విషయం తెలుసుకున్న జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ ఘటన స్థలాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. విద్యుత్ పరికరాలు, వైరింగ్ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, షార్ట్ సర్క్యూట్‌లను నివారించేందుకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను అదుపులోకి తీసుకురావడాన్ని చైర్‌పర్సన్ అభినందించారు. వారి వెంట కమిషనర్ సత్య ప్రణవ్, అడువాల జ్యోతి లక్ష్మణ్, కూతురు శేఖర్, సిరిపురం శ్రీలత శ్రీనివాస్, ఫైర్ సిబ్బంది ఉన్నారు



# నర్సింగ్ కళాశాలలో ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవ సందర్భంగా న్యాయ అవగాహన సదస్సు

**సంగారెడ్డి గాండీవం దినపత్రిక జూన్ 12**




జాతీయ న్యాయ సేవాధికార సంస్థ మరియు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవానిచంద్ర ఆదేశాల ప్రకారం ఈ రోజు సంగారెడ్డి లోని నర్సింగ్ కళాశాల నందు ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య న్యాయ అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి సౌజన్య మాట్లాడుతూ, బాల కార్మికత్వం సమాజానికి శాపమని, ప్రతి బాలుడికి విద్య, ఆరోగ్యం మరియు రక్షణ కల్పించడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. బాల కార్మిక (నిషేధం మరియు నియంత్రణ) చట్టం, విద్యా హక్కు చట్టం మరియు బాలల హక్కులకు సంబంధించిన వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. 14 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టడం చట్టరీత్యా నేరమని, బాల కార్మికులను గుర్తించినట్లయితే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. పిల్లలను విద్యకు దూరం చేయకుండా పాఠశాలల్లో చేర్పించి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని పిలుపునిచ్చారు. బాలల సంక్షేమం, భద్రత మరియు హక్కుల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెలిపారు. ఎవరికైనా న్యాయ పరమైన విషయాలలో ఉచిత న్యాయ సహాయం అందిస్తామని ఏదైనా న్యాయ సహాయం కోరినచో న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయం, సంగారెడ్డిని సంప్రదించగలరు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి బి సౌజన్య అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ యాదయ్య స్కోప్ ఎన్జీవో ఉప్పలయ్య సంగారెడ్డి టౌన్ ఎస్ఐ సర్దార్ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మరియు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రిప్రైమరీ సెంటర్లను అంగన్వాడీ కేంద్రాలకు కేటాయించాలి

**ఆర్మూర్, గాండీవం, జూన్ 12 :-**

తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం ప్రీ ప్రైమరీ సెంటర్లను అంగన్వాడీ కేంద్రాలకు కేటాయించాలని ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాలవ్య కి వినతి పత్రం అందజేశారు. అనంతరం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అంగన్వాడీ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఏ రమేష్ బాబు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభిస్తున్న ప్రి ప్రైమరీ సెంటర్లను అంగన్వాడీ కేంద్రాలకు కేటాయించి వారి సేవలను ఉపయోగించు కోవాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా నాలుగు సంవత్సరాలు ఉన్న ప్రతి విద్యార్థిని ప్రీ ప్రైమరీ సెంటర్లకు బదిలీ చేయాలని ప్రభుత్వం ఆదేశించడం మూలంగా అంగన్వాడీ కేంద్రాలలో పిల్లల సంఖ్య తగ్గిపోతుందని ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలల్లో నాలుగు సంవత్సరాలు ఉన్న విద్యార్థులందరినీ చేర్పించడం జరుగుతుందని ఇప్పుడు ప్రీ ప్రైమరీ సెంటర్లు కొత్తగా ప్రారంభిస్తే అంగన్వాడీ కేంద్రాలలో పిల్లల సంఖ్య తగ్గటమే కాకుండా అంగన్వాడీ టీచర్ల ఉద్యోగ భద్రతకే ముప్పు వస్తుందని ఆయన అన్నారు. అంగన్వాడి టీచర్లు ఇప్పటికే బాలింతలు, గర్భిణీలు, పసిపిల్లలకు, పౌష్టికాహారం అందించటంతో పాటు విద్య బుద్ధులను నేర్పుతున్నారని అటువంటి అనుభవం ఉన్నవారికి అప్పగిస్తే మరింత ప్రయోజనం నెరవేరుతుందని, తద్వారా ప్రీ ప్రైమరీ సెంటర్ల టీచర్లకు ఇచ్చే వేతనాలను అంగన్వాడీలకు ఇస్తే కనీస వేతనం పెరగటానికి అవకాశం ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా సిఐటియు ఆర్మూర్ ఏరియా బాధ్యులు ఎల్లయ్య, అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు చంద్రకళ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు గోదావరి ,లక్ష్మి, జగదాంబ, చంద్రకళ, తదితరులతోపాటు సెక్టార్ లీడర్లు పాల్గొన్నారు.



# చదువులో రాణిస్తున్న మున్నూరు ముద్దు బిడ్డ అంకితకు రూ.5,000 ఆర్థిక సహాయం

## మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు లింగిశెట్టి హనుమంతరావు ఉదారత

**తెలంగాణ గాండీవం, జూన్ 12 :-**

సికింద్రాబాద్ శాంతినగర్ (లాలపేట) కు చెందిన కీర్తిశేషులు కొత్త నరసయ్య కుమార్తె, 10 వ. తరగతి విద్యార్థిని కొత్త అంకిత చదువులో ప్రతిభ కనబరుస్తూ ముందుకు సాగుతున్న నేపథ్యంలో ఆమె విద్యాభ్యాసానికి ఆర్థిక సహాయం అందించారు.సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు లింగిశెట్టి హనుమంతరావు ని అంకిత కుటుంబ సభ్యులు సంప్రదించగా, ఆయన వెంటనే స్పందించి తన వంతు సహాయంగా రూ.5,000 నగదును స్వయంగా అందజేశారు. అంతేకాకుండా విద్యార్థినికి ఉపయోగపడే విధంగా ఉచిత నోట్‌బుక్స్ కిట్‌ను కూడా అందించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ కార్యవర్గ సభ్యులు బిల్లకంటి రవికాంతారావు, మాడ ప్రమోద్, సికింద్రాబాద్ మున్నూరుకాపు యువజన విభాగం ఉపాధ్యక్షుడు మున్నూరు చందు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అంకిత తల్లి భార్గవి మాట్లాడుతూ తమ కుటుంబ పరిస్థితిని అర్థం చేసుకుని వెంటనే సహాయం అందించిన లింగిశెట్టి హనుమంతరావు కి మరియు మున్నూరు కాపు సంఘము నాయకుల కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.స్థానికులు కూడా హనుమంతరావు సేవా దృక్పథాన్ని అభినందిస్తూ, విద్యార్థులకు ఇలాంటి ప్రోత్సాహం మరింత మంది దాతలకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.




# ఆరోగ్య ఉప కేంద్రం, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ కార్యాలయం తనిఖీ

**ఆర్మూర్, గాండీవం, జూన్ 12 :-**

ఆర్మూర్ పట్టణంలోని రాజారాం నగర్ కాలనీలో గల పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మరియు డిప్యూటీ డిఎంహెచ్ఓ కార్యాలయాన్ని జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ రాజశ్రీ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇస్తున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీల యొక్క ఆరోగ్య పరీక్షలు, ప్రసవానంతర సేవలు మరియు అసంక్రమిత వ్యాధిగ్రస్తుల మందుల పంపిణీ గురించి వాకబు చేశారు. ల్యాబ్ ను, ఫార్మాసిస్టు గదిలో గల మందులను, అటెండెన్స్ రిజిస్టర్, ఇతర అన్ని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారిణి రాజశ్రీ మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్యశాఖ తరఫున అందిస్తున్న అన్ని రకాల వైద్య సేవలు ఇంటింటికి అందించాలని, ప్రచారం చేయమని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి డాక్టర్ శ్రేయ, సబ్ యూనిట్ అధికారి సాయి, విస్తరణాధికారి చంద్రశేఖర్, శాంత సూపర్వైజర్, ఆనంద్, దత్తాద్రి, సురేష్, చరణ్, గౌతమి, రత్నకుమారి, మల్లీశ్వరి, రజిత, గజ్జు లాల్, తదితరులు పాల్గొన్నారు.





# యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

## -దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్
## -కొత్తకోటలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 2కే రన్
## -హాజరైన, పోలీసు రెవెన్యూ అధికారులు

**దేవరకద్ర, జూన్ 12 గాండీవం:**

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో డ్రగ్స్ కు మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా శుక్రవారం వనపర్తి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 2 కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పోలీసు, రెవెన్యూ ఉన్నత అధికారులతో కలిసి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి జిఎంఆర్ ప్రసంగించారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన మన అందరి బాధ్యత అని ఆయన అన్నారు.డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి, ఉజ్వల భవిష్యత్ కోసం బాటలు వేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.ఒకప్పుడు విదేశాలకు పరిమితమైన డ్రగ్ సంస్కృతి, మన ప్రాంతాలకు వ్యాపించిందన్నారు.డ్రగ్స్ బారిన పడి యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తపరిచారు.డ్రగ్స్ కు బానిసలై కొంతమంది యువత ఆత్మహత్యలకు సైతం పాల్పడుతు న్నారన్నారు.గతంలో డ్రగ్స్ వ్యాప్తి ఉధృతంగా ఉండేది, దానిని కంట్రోల్ చేసేందుకు, డ్రగ్స్ ను అరికట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో ఉన్న నార్కోటిక్ బ్యూరోను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసి, పూర్తిస్థాయిలో నిధులు కేటాయించి ఈగల్ ఫోర్సును



ఏర్పాటు చేశారన్నారు.డ్రగ్స్ పై ప్రభుత్వం చేస్తున్న పోరాటంలో పౌరులుగా మనమందరం డ్రగ్స్ నిర్మూలనలో భాగమై, డ్రగ్స్ తీసుకుంటున్న వారి వివరాలను, డ్రగ్స్ విక్రయిస్తున్నారని సమాచారం తెలిసిన వెంటనే 1908 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం తెలియజేయాలన్నారు.డ్రగ్స్ పై సమాచారం ఇచ్చిన పౌరుల వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామని ఎమ్మెల్యే అన్నారు.మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమం నిర్వహించిన పోలీస్ శాఖకు ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.మాదకద్రవ్యాల వినియోగం సమాజాన్ని మానసికంగా, ఆర్థికంగా నాశనం చేస్తుంది, మాదక ద్రవ్యాల నిర్మూలన ప్రతీ ఒక్కరి బాధ్యత, డ్రగ్ ఫ్రీ సొసైటీ కోసం అందరం కృషి చేద్దామన్నారు.అనంతరం ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన అవేర్నెస్ కార్యక్రమంలో కూడా ఎమ్మెల్యే పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, యువకులు, మహిళలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# యూరియా యాప్ ను మార్చాలి

## యూరియా కేటాయింపులపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి

**ఆర్మూర్, గాండీవం, జూన్ 12 :-**


భారతీయ జనతా పార్టీ అలూర్ మండల శాఖఅధ్యక్షులు సూర శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఆలూర్ తహశీల్దార్ కి యూరియా విషయంపై మెమొరాండం ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన బీజేపీ పార్టీ జిల్లా కార్యదర్శి పోల్కశీ వేణు మాట్లాడుతూ తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం యూరియా యాప్ ను తీసుకొచ్చి రైతులకు అనేక ఇబ్బందులకు గురిచేస్తుందని, తక్షణమే యూరియా బుకింగ్ యాప్ ను, మండల స్థాయి ప్రతిపాదికను మార్చి స్థానిక సొసైటీ లకు, ఫెర్టిలైజర్ షాపులకు అందుబాటులోకి తీసుకురావాలని, అలాగే ఎకరానికి యూరియా కేటాయింపులపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి హరీష్, జిల్లా నాయకులు సుభాష్ , బాస సురేష్ ప్రళయ్ తేజ్, మండల ఉపాధ్యక్షులు పోశెట్టి, ఓ బి సి మోర్చ అధ్యక్షులు నడిశారం మల్లయ్య, కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి మహేష్, సీనియర్ నాయకులు నాగేష్, సురేష్ గౌడ్, అజయ్, సాయి పటేల్, తదితరులు పాల్గొన్నారు.



# బిజెపి యువ మోర్చ పట్టణ కమిటి ఎన్నిక

**జమ్మికుంట, జూన్ 12, గాండీవం :**

బిజెపి యువ మోర్చ పట్టణ కమిటి ఎన్నిక భారతీయ జనతా పార్టీ యువ మోర్చ జమ్మికుంట పట్టణ అధ్యక్షులు తూర్పాటి శంకర్ అధ్వర్యంలో యువమోర్చ పూర్తి కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు.బిజెవైయం ఉపాధ్యాక్షులుగా ప్రతాప్ వినయ్,పోడేటి అనిల్,బోనగిరి ప్రణిత్,యం.డి. సాదిక్ పాషా.ప్రధాన కార్యదర్శులుగా పనికారి రమేష్, పసునూటి శివ, నాగరాజ్. కార్యదర్శులుగా లకిడె రాజు,కొంకటి అజేయ్,పంజాల అనిల్ నిడిగొండ సచిన్.కోశాధికారిగా చందా సంతోష్ ని ఎన్నుకొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు హాజరై నూతనంగా ఎన్నికైన యువమోర్చ పట్టణ కమిటిని అభినందించారు.ఈ సందర్భముగా రాజు మాట్లాడుతూ, యువ మోర్చ అధ్యక్షులు తూర్పాటి శంకర్ అధ్వర్యంలో పట్టణ కమిటి సభ్యులు పార్టీని ప్రజల్లోకి, విద్యార్థుల సమస్యలపై పరిష్కారానికి ముందుండాలని, నరేంద్ర మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్ళడంలో యువమోర్చ్ కార్యకర్తలు ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమములో పట్టణ కార్యకర్త పాల్గోన్నారు.


భారతీయ జనతా యువమోర్చ
జమ్మికుంట పట్టణ శాఖ
జి. కరీంనగరము, తెలంగాణ.

తూర్పాటి శంకర్
BJYM పట్టణ అధ్యక్షులు
సెల్: 7032458914

అడ్రస్: ఇంటి నెం. 16-1-143/C, హనుమాండ్లపల్లి-జమ్మికుంట, జి. కరీంనగరము.

తేది.12/06/2026

పత్రికా-ప్రకటన

బిజెపి యువ మోర్చ పట్టణ కమిటి ఎన్నిక

బిజెపి యువ మోర్చ పట్టణ కమిటి ఎన్నిక భారతీయ జనతా పార్టీ యువ మోర్చ జమ్మికుంట పట్టణ అధ్యక్షులు తూర్పాటి శంకర్ అధ్వర్యంలో యువమోర్చ పూర్తి కమిటీని ఎన్నుకొని ప్రకటించారు.

బిజెవైయం ఉపాధ్యాక్షులుగా :1) ప్రతాప్ వినయ్, 2) పోడేటి అనిల్, 3) బోనగిరి ప్రణిత్, 4) యం.డి. సాదిక్‌పాషా

ప్రధాన కార్యదర్శులుగా: 1) పనికారి రమేష్, 2) పసునూటి శివ నాగరాజ్,

కార్యదర్శులుగా: 1) లకిడె రాజు 2) కొంకటి అజేయ్ 3) పంజాల అనిల్ 4) నిడిగొండ సచిన్

కోశాధికారిగా: చందా సంతోష్ గార్లని ఎన్నుకొన్నారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు గారు హాజరై నూతనంగా ఎన్నికైన యువమోర్చ పట్టణ కమిటిని అభినందించారు.

ఈ సందర్భముగా కొలకాని రాజు గారు మాట్లాడుతూ యువ మోర్చ అధ్యక్షులు తూర్పాటి శంకర్ అధ్వర్యంలో పట్టణ కమిటి సభ్యులు పార్టీని ప్రజల్లోకి, విద్యార్థుల సమస్యలపై పరిష్కారానికి ముందుండాలని, నరేంద్ర మోడీ గారి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్ళడంలో యువమోర్చ కార్యకర్తలు ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమములో పట్టణ కార్యకర్తలు పాల్గొన్నారు.

భవదీయ

# షార్ట్ సర్క్యూట్ తో దగ్ధమైన ఇల్లు..

## దాదాపు 8 నుండి 10 లక్షల ఆస్తి నష్టం..

**జగిత్యాల జిల్లా ప్రతినిధి జూన్ 12,గాండీవం:**

జగిత్యాల పట్టణంలోని స్థానిక మోచి బజార్ 40 వ వార్డులో గల రాచర్ల గంగాధర్ కు చెందిన పెంకుటి ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కు గురైఅగ్నికి ఆహుతి అయింది.

ఈ ప్రమాదంలో ఐదు లక్షల వరకు కుట్టు మిషన్లు, మరియు ఇతర సామాగ్రి కాలి బూడిదవ్వగా దాదాపు8 నుండి 10 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు..ఈ ప్రమాదం సంభవించిన సమయంలో ఉదయం కావడం వలన ఇంట్లో ఎవరూ లేకపోవడం వలన ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు అందువలన పెద్ద ప్రమాదం తప్పింది.. లేకపోతే ఇంకా పెద్ద మొత్తంలో ఆస్తి నష్టం తోపాటు ప్రాణం నష్టం జరిగేది అని బాధితుడు వాపోతున్నాడు..ప్రభుత్వం తక్షణమే స్పందించి తమను ఆదుకోవాలని విన్నవించుకున్నాడు..ఇదిలా ఉండగా అగ్ని ప్రమాదం జరిగిన వీధిలోకి కనీసం ఫైర్ ఇంజన్ కూడా పోయే విధంగా రోడ్డు వెడల్పు లేకపోవడం ఇక్కడ గమనించాల్సిన అంశం...

**ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి.. అడువాల జ్యోతి..**

ఇదిలా ఉండగా బాధిత కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలి వారిది నిరుపేద కుటుంబం కావున తక్షణమే ఆర్థిక సహాయం అందించాలి.. అని మాజీ మున్సిపల్ చైర్ పర్ ,స్థానిక కౌన్సిలర్ అడవాల జ్యోతి అన్నారు.. బాధితులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం నుండి అన్ని విధాలుగా సహాయం అందించేందుకు తమ వంతుగా కృషి చేస్తామని ఆమె బాధిత కుటుంబానికి భరోసా ఇచ్చారు



# అడ్డాకల్ పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా కె.మురళి బాధ్యతల స్వీకరణ

**మహబూబ్‌నగర్ జిల్లా గాండీవం దినపత్రిక 12**

జూన్ )అడ్డాకల్ పోలీస్ స్టేషన్‌కు ఇటీవల బదిలీపై వచ్చిన సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కె.మురళి గురువారం నాడు అడ్డాకల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ప్రస్తుత ఎస్ఐ శ్రీనివాస్ నుండి అధికారికంగా చార్జి స్వీకరించారు.అనంతరం మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ డి.జానకి, ను మర్యాదపూర్వకంగా కలిశారు. కె.మురళి పోలీసు శాఖలో చేరకముందు భారత సైన్యంలో (ఆర్మీ) సుమారు 18 సంవత్సరాల పాటు దేశ సేవలో విధులు నిర్వహించారు. అనంతరం 2020 సంవత్సరంలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా తెలంగాణ పోలీసు శాఖలో సబ్ ఇన్స్పెక్టర్ గా చేరారు. పోలీసు శాఖలో చేరిన తర్వాత మదనాపూర్, మరికల్ మరియు కోదండాపూర్ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహించి విశేష అనుభవాన్ని సంపాదించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అడ్డాకల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజలకు మరింత సమర్థవంతమైన పోలీసు సేవలు అందించడంతో పాటు శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. ప్రజలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ, చట్ట పరిరక్షణలో నిబద్ధతతో పనిచేయాలని పేర్కొన్నారు.నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించే దిశగా కృషి చేస్తానని ఎస్ఐ కె.మురళి తెలిపారు.



# ఇందిరమ్మ ఇల్లు స్లాబ్ ను ప్రారంభించిన

## - గ్రామ సర్పంచ్ జూపాక మమత

**ద్వారకా నగర్ జూన్12 గాండీవం**

పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం ఎక్లాస్ పూర్ గ్రామం లో ఘనంగా ఇందిరమ్మ ఇల్లు స్లాబ్ పనులు అట్టహాసంగా ఉప్పులేటి శ్రీలత-శంకర్ దంపతుల ఇందిరమ్మ ఇల్లు స్లాబ్ కి కొబ్బరికాయ కొట్టి పనులు సర్పంచ్ జూపాక మమత-శ్రీనివాస్, అంతర్గం మండలం ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షుడు లగిశెట్టి రాకేష్, ప్రారంభించడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు బరపటి తిరుపతి పేదల సొంతింటి కలను నిజం చేసే దిశగా ఎక్లాస్ పూర్ గ్రామంలో మరో ముందడుగు పడింది. గ్రామ పరిధిలోని ఉప్పులేటి శ్రీలత- శంకర్ కు మంజూరైన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణంలో భాగంగా, నేడు స్లాబ్ పనులను గ్రామ సర్పంచ్ జూపాక మమత-శ్రీనివాస్, ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు లగిశెట్టి రాకేష్,బరుపటి తిరుపతి శాస్త్రోక్తంగా కొబ్బరికాయ కొట్టిప్రారంభించారు.లబ్ధిదారురాలు ఉప్పులేటి శ్రీలత-శంకర్ ఇంటి నిర్మాణ పనులు వేగవంతం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ జూపాక మమత -శ్రీనివాస్, ఉప్ప సర్పంచ్ లగిశెట్టి రాకేష్ లు మాట్లాడుతూ రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ కృషి తో ప్రభుత్వ లక్ష్యం ప్రకారం ప్రతి పేదవానికి పక్కా ఇల్లు ఉండాలన్నదే మా సంకల్పమని , గ్రామం లో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తాం అని సర్పంచ్ పేర్కొన్నారు.నిర్మాణ పనుల్లో ఎక్కడా నాణ్యత తగ్గకుండా చూసుకోవాలని, సకాలంలో పనులు పూర్తి చేసి గృహ ప్రవేశానికి సిద్ధం చేయాలని అధికారులకు, మేస్త్రీలకు సర్పంచ్ జూపాక మమత- శ్రీనివాస్ ఉప్ప సర్పంచ్ లగిశెట్టి రాకేష్ లు సూచించారు. అనంతరం సొంతింటి కల నెరవేరుతున్నందుకు చాలా సంతోషంగాఉందనీ,పనులను పర్యవేక్షిస్తూ అండగా నిలుస్తున్న సర్పంచ్ కి కృతజ్ఞతలనీ లబ్ధిదారులు ఉప్పులేటి శ్రీలత-శంకర్, అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జూపాక మమత- శ్రీనివాస్, అంతర్గాం మండల ఉప సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులు,ఉప సర్పంచ్ లగిసెట్టి రాకేష్, లబ్ధిదారురాలు ఉప్పులేటి శ్రీలత -శంకర్ కుటుంబ సభ్యులతో పాటు, గ్రామ పంచాయతీ, కార్యదర్శి రమేష్,ప్రజ ప్రతినిధులు, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# బోయిన్ పల్లి మార్కెట్ యార్డ్ పక్కన 8 ఎకరాల భూమి వివాదం

: రూ.400 కోట్ల ప్రభుత్వ భూమి ప్రైవేటు ఎలా అయింది? -- టీఆర్ఎస్ నేత మన్నే క్రిశాంక్ ప్రశ్న

ఈ భూమి వివాదం పై ఎమ్మెల్యే, కంటోన్మెంట్ అధికారులు ఎందుకు మౌనం?

ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడంపై పలు అనుమానాలు

ఇందులో ఎవరి వాటా ఎంత? తేల్చాల్సిన సమయం వచ్చిందన్న క్రిశాంక్

సికింద్రాబాద్, జూన్ 12: గాండీవం

బోయిన్పల్లి మార్కెట్ యార్డ్ సమీపంలోని సుమారు 8 ఎకరాల భూమి వివాదం మరోసారి రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. సుమారు రూ.400 కోట్ల విలువైన ఈ భూమిని ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లేలా ప్రభుత్వం సహకరించిందని టీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నే క్రిశాంక్ ఆరోపించారు.శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గతంలో ప్రభుత్వ భూమిగా పేర్కొన్న ఈ స్థలం ఇప్పుడు ప్రైవేట్ వ్యక్తుల పేర్లతో బోర్డులు వెలుస్తుండడం వెనుక అనేక అనుమానాలు ఉన్నాయని అన్నారు. ఒకప్పుడు ఈ భూమిని ప్రభుత్వ ఆస్తిగా ప్రకటించి కాపాడాలని డిమాండ్ చేసిన నాయకులే నేడు మౌనం వహించడం ఆశ్చర్యకరమని పేర్కొన్నారు.ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యే శ్రీ గణేష్ గతంలో తన సోషల్ మీడియా వేదికగా ఈ భూమిని ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ చేసిన పోస్టులను ఇప్పుడు బయటపెట్టి ప్రజలకు చూపిస్తున్నామని తెలిపారు. అప్పుడు ప్రభుత్వ భూమి అయిన స్థలం ఇప్పుడు ప్రైవేట్ ఆస్తిగా ఎలా మారిందో ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వంలోని కొందరు మంత్రులు, కంటోన్మెంట్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలతో ఈ భూమిని కబ్జా చేసే ప్రయత్నాలు జరిగాయని ఆరోపించారు. కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు



అప్పగించడంలో ఎవరి పాత్ర ఎంత ఉందో పూర్తిస్థాయిలో విచారణ జరిపి బయటపెట్టాలని డిమాండ్ చేశారు.కంటోన్మెంట్ ప్రాంతంలో ఉన్న ఈ విలువైన భూమిని పేదల కోసం డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణానికి వినియోగించాల్సిందిపోయి, ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లడం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని ఆయన అన్నారు.ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులపై ఉందని, అయితే ఈ వ్యవహారంలో ఎమ్మెల్యే, కంటోన్మెంట్ అధికారులు, పోలీసులు ఎందుకు మౌనం పాటిస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు.ఈ భూమి వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి నిజాలు వెలుగులోకి తీసుకురావాలని, లేకపోతే కంటోన్మెంట్ ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు, ధర్నాలు నిర్వహిస్తామని మన్నే క్రిశాంక్ హెచ్చరించారు.

# సమస్యల పరిష్కారం కోసం ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్న సింగరేణి అధికారులు

గత రెండేళ్లుగా పెండింగ్లో ఉన్న సమస్యలను పరిష్కారం చేయాలంటూ

అధికారుల సంఘం అధ్యక్ష కార్యదర్శుల ఆవేదన

గోదావరిఖని జూన్ 12 గాండీవం

గత రెండేళ్లుగా సింగరేణి అధికారులకు సంబంధించిన ప్రధాన సమస్యలేవీ పరిష్కారం కాకపోవడంపై అఖిల భారత బొగ్గు గనుల అధికారుల సంఘం సింగరేణి శాఖ అధ్యక్షులు తాళ్లపల్లి లక్ష్మీపతి గౌడ్ మరియు ప్రధాన కార్యదర్శి పెద్ది నర్సింహులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.అధికారుల వేతనంలో భాగమైన ప్రతిభ ఆధారిత చెల్లింపు ను కోల్ ఇండియా లిమిటెడ్ లో చెల్లిస్తున్నప్పటికీ, సింగరేణి సంస్థలో గత రెండేళ్లుగా అమలు చేయడం లేదని వారు తెలిపారు. అలాగే, సి ఐ ఎల్ లో 2026 జనవరి నుంచి వేతన శ్రేణి ఉన్నతీకరణ అమల్లోకి వచ్చినప్పటికీ, సింగరేణి సంస్థలో ఇప్పటివరకు అమలు చేయలేదని పేర్కొన్నారు. అదనంగా, సిఐఎల్ లో అమలులో ఉన్న అనేక భత్యాలు సింగరేణి అధికారులకు అందడం లేదని, దీనివల్ల అధికారుల్లో తీవ్ర అసంతృప్తి మరియు అసహనం పెరుగుతోందని తెలిపారు. ఈ పరిస్థితి సంస్థ అభివృద్ధి, ఉత్పాదకత మరియు కార్యనిర్వహణపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. సింగరేణి చరిత్రలో అధికారులు ఇంత స్థాయిలో అసంతృప్తికి గురికావడం ఇదే మొదటిసారని వారు పేర్కొన్నారు.ఈ సమస్యల పరిష్కారం కోసం 15.06.2026 నుంచి దశలవారీ ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు, అవసరమైతే సమ్మెకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు.సమస్యల పరిష్కారం కోసం పలుమార్లు సంస్థ చైర్మన్ గారికి నోటీసులు అందజేసినట్లు తెలిపారు. అలాగే, నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశామని పేర్కొన్నారు. యాజమాన్యం సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో గతంలో నిర్ణయించిన రిలే నిరాహార దీక్షలను వాయిదా వేసినట్లు వెల్లడించారు. అయితే, ఇప్పటి వరకు సమస్యల పరిష్కారంలో ఎలాంటి పురోగతి కనిపించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.సింగరేణి సంస్థను తమ సొంత సంస్థగా భావిస్తూ విధులు నిర్వహించే అధికారులు, ప్రస్తుత పరిస్థితుల్లో తప్పనిసరి పరిస్థితుల కారణంగా ఆందోళన బాట పట్టాల్సి వస్తోందని పేర్కొన్నారు.ాబట్టి, ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం స్పందించి అధికారుల న్యాయమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, తద్వారా ఆందోళన కార్యక్రమాలకు దారితీయకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.
-- అఖిల భారత బొగ్గు గనుల అధికారుల సంఘం సింగరేణి శాఖ




# ప్రైవేట్ స్కూళ్ల అధిక ఫీజు దోపిడిపై ఉక్కు పాదం మోపండి

పేద కుటుంబాలను పీల్చి పిప్పి చేస్తున్న ప్రైవేట్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

అడ్డగోలు ఫీజు వసూళ్లను నియంత్రించాలి:

సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లావుడియా ప్రసాద్ నాయక్

వైరా నియోజకవర్గ ఇంచార్జ్ (గాండివం జూన్ 12)

ఈరోజు లక్ష్మీదేవి పల్లి మండలం లో సేవలాల్ బంజారా సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం జరిగింది స్కూల్స్ అధిక ఫీజు దోపిడీని అరికట్టాలని సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్ నాయక్ అన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం జిల్లాలోని లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్, కొత్తగూడెం మండలాల్లో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అధిక ఫీజులను వసూలు చేస్తున్నాయని చెప్పారు. పాఠ్యపుస్తకాలు, ఫీజులు, యూనిఫాంల పేరుతో తల్లిదండ్రులను అడ్డంగా దోపిడీ చేస్తూ.. వేలాది రూపాయలను అడ్డగోలుగా ముక్కుపిండి వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నడూలేని విధంగా ఈ ఏడాది ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అధిక ధరలకు పుస్తకాలను విక్రయిస్తున్నట్లు మాకు సమాచారం ఉందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఎస్సీ ఎస్టీ బీసీ 25% ఉచిత విద్య అందించాలని ప్రవేట్ పాఠశాల మెనూ బోర్డులో అధిక ఫీజులు ౹ాఖ+ నుండి పదో తరగతి దాకా అధిక ఫీజులు బోర్డు పెట్టాలని మరియు ప్రైవేట్ పాఠశాల ౹ాఖ+ నుంచి 5వ తరగతి వరకు రూ.30 వేల నుంచి రూ.50 వేలు వసూలు చేస్తున్నారని చెప్పారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఒక్కో విద్యార్థి నుంచి తరగతులను బట్టి పుస్తకాల కోసం రూ.6వేల నుంచి రూ.8500 వరకు, యూనిఫాంకు రూ.5 నుంచి




రూ.6 వేలు వసూళ్లు చేస్తున్నారని వెల్లడించారు. తల్లిదండ్రులు బిల్ అడిగితే బిల్లులు ఇవ్వకుండా ఆడిటింగ్ కు దొరకకుండా, తమవద్ద వున్న తాత్కాలిక బుక్కుల్లో వ్రాసుకుంటూ.. ఏజెన్సీ ప్రజలను నిలువునా దోచుకుంటున్నారని విమర్శించారు. +ూ బిల్లును మాత్రం ఇవ్వకుండా విద్యార్థుల తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేయడం విచారకరం అని ఆందోళన వ్యక్తం చేశారు. సదరు మండలాల్లోని ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడిని, ధన దాహార్తికి తమరు స్పందించి అడ్డుకట్ట వేయాలని కోరారు. విద్యార్థుల తల్లి తండ్రుల బలహీనతను ఆసరాగా తీసుకోని ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా వేలాది రూపాయలు దోపిడీ చేస్తున్నారని తెలిపారు. వీరిపై జిల్లా విద్యాశాఖ అధికారి, కమర్షియల్ టాక్స్ ఉన్నత అధికారులకు, ఆదాయ పన్ను శాఖ అధికారులకు మండల ఎవశీ అధికారి తక్షణమే చర్యలు తీసుకోవాలని సేవలాల్ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి లావుడియా వెంకటేష్ నాయక్, భుఖ్య అనంతరాములు నాయక్, బానోత్ నాగేష్ నాయక్, ధరావత్ నరేష్ నాయక్, బోడ రమేష్ నాయక్, బానోతు బాల నాయక్, ధరావత్ కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు

# ఈ నెల 25 నుండి జరగబోయే ఓటర్ల నమోదు కార్యక్రమం నిర్వహణకై ఎన్ టి పి సి కాకతీయ మండపంలో సంబంధిత అధికారులకు శిక్షణ క్యాంపు

జిల్లా అదనపు కలెక్టర్ ముఖ్య ఓటర్ల నమోదు అధికారి ఇన్చార్జి కమిషనర్ అరుణశ్రీ ఆధ్వర్యంలో

గోదావరిఖని జూన్ 12 గాండీవం

పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ ఓటర్ల నమోదు ముఖ్య అధికారి రామగుండం కమిషన్ కమిషనర్ జె అరుణశ్రీ ఆధ్వర్యంలో ఎన్టిపిసి పెర్మనెంట్ టౌన్షిప్ లోని కాకతీయ కళ్యాణ మండపంలో సంబంధిత ఇన్చార్జీలతో శిక్షణా శిబిరం శుక్రవారం నిర్వహించారు ఈనెల 25 నుండి ఓటర్ల నమోదు విషయంలో చేపట్టే కార్యక్రమాల గురించి ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు శుక్రవారం రోజున ఉదయం 10:00గంటల నుండి మధ్యాహ్నం 2:00 వరకు కాకతీయ కల్యాణమండపం యందు రామగుండం అసెంబ్లీ నియోజకవర్గం పరిధి లోని అందరూ సహాయ ఓటర్ల నమోదు అధికారులు, బి ఎల్ ఓ లు సూపెర్వైసోర్స్, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల సభ్యులు తో జూన్ 25 నుండి జరుగబోయే నమోదు కు సంబందించి ట్రైనింగ్ ప్రోగ్రామ్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఓటర్ల నమోదు అధికారి జీ. అరుణ శ్రీ ఐఏఎస్ పాలకుర్తి తహసీల్దార్ జె. సునీత రామగుండం తహసీల్దార్ రవీందర్ రావు మరియు మాస్టర్ ట్రైనర్ నాయబ్ తహసీల్దార్ అనీల్లు హాజరు అయినారు.



# జగిత్యాల ఆర్టీసీ డిపోకు నూతన మేనేజర్గా ఎన్. రమేష్ బాధ్యతల స్వీకరణ

ప్రయాణికులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యమని వెల్లడి

జగిత్యాల జిల్లా ప్రతినిధి జూన్ 12 గాండీవం

జగిత్యాల ఆర్టీసీ డిపో నూతన డిపో మేనేజర్గా ఎన్. రమేష్ శుక్రవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డిపో అధికారులు, సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎన్. రమేష్ మాట్లాడుతూ ప్రయాణికులకు నాణ్యమైన, సురక్షితమైన మరియు సమయపాలనతో కూడిన రవాణా సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. డిపో అభివృద్ధి, ఆదాయ వృద్ధి, సిబ్బంది సంక్షేమం కోసం సమిష్టిగా పనిచేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డిపో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొని నూతన డిపో మేనేజర్కు అభినందనలు తెలియజేశారు.



# మృతురాలి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేత

జమ్మికుంట, జూన్ 12, గాండీవం :

జమ్మికుంట మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామ పరిధిలోని అంబేద్కర్ కాలనీ కి చెందిన బోయిని ఎల్లమ్మ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందగా.. మృతురాలి కుటుంబ సభ్యులను సర్పంచ్ పోల్సాని వినోద-నారాయణరావు కుమారుడు పోల్సాని వేణురావు పరామర్శించారు. మృతురాలి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి రూపాయలు 5 వేల ఆర్థిక చేయూతను అందించారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప-సర్పంచ్ రెబెల్లి వెంకటేష్, వార్డు సభ్యులు మాట్ల సురేష్, పుల్లూరి రాజేశ్వరి-రాములు, బండారి ప్రశాంత్, కుటుంబ సభ్యులు బోయిని అంకుష్, బోయిని రాజయ్య తదితరులు పాల్గొన్నారు.




# నూతన ఎస్సై అనిల్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన సర్పంచ్లు

ఆలూర్ జూన్ 12 గాండివం

మాక్లూర్ పోలీస్ స్టేషన్కు నూతనంగా బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించిన ఎస్సై అనిల్ రెడ్డిని డికంపల్లి, కల్లడి, చిన్నపూర్ గ్రామాల సర్పంచ్లు మరియు స్థానిక నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా డికంపల్లి సర్పంచ్ మచ్చర్ల చిన్నయ్య, కల్లడి సర్పంచ్ గంగోల్ల సుస్మిత ప్రళయ్ తేజ్, చిన్నపూర్ సర్పంచ్ పుప్పాల చిన్నలు ఎస్సైకి శాలువా కప్పి సన్మానించారు. గ్రామాల అభివృద్ధితో పాటు శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖకు తమ వంతు సహకారం అందిస్తామని వారు తెలిపారు.నూతన ఎస్సై అనిల్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజల సహకారంతో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్లు మచ్చర్ల చిన్నయ్య, పుప్పాల చిన్న, గంగోల్ల ప్రళయ్ తేజ్తో పాటు నాయకులు గంగోని వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.







# జనగామ గ్రామములో ఈదురు గాలులకు తెగుబడిన కరెంటు వైర్లు

అక్కడే మేతమేస్తున్న మూడు పాడి గేదెలు మృతి

మూడు లక్షల విలువగల గేదలు మృతితో రోదిస్తున్న యాజమాన్లు

నష్టపరిహారం చెల్లించాలంటూ

ఎన్పిడీసీఎల్ అధికారులకు గ్రామస్తుల వినతి

గోదావరిఖని జూన్ 12 గాండీవం

రామగుండం కార్పొరేషన్ పరిధిలో 6వ డివిజన్ జనగామ గ్రామంలోని గోదావరి ఒడ్డున ఉన్న పొలాలల్లో నిన్న సాయంత్రం వచ్చిన ఈదురు గాలులకు ఎస్ ఎస్ 37/63 కె వి ఏ ట్రాన్స్ ఫార్మర్ ఎల్ టి లైన్ లో ఫిన్ ఇన్సూలేటర్ డ్యామేజ్ అవడం తో వైర్లు తెగి పొలాలల్లో కింద పడగ మేతకు వెళ్లిన సుందిళ్ల గ్రామానికి రైతులు సుంకరి బాలకృష్ణ కు చెందిన రెండు సూడి గేదెలు వాటి విలువ 1,60,000 /-లక్ష అరువై వేల రూపాయిలు, అదే గ్రామానికి చెందిన సుంకరి రమేష్ ది సూడి గేదె దాని విలువ 1,50,000/- లక్ష యాభై వేల రూపాయిలు,విలువ గల మూడు పాడి గేదెలు, తెగిన విద్యుత్ వైర్లు తాకి విద్యుత్ షాక్ కి గురైయి గేదెలు అక్కడిక్కడే మృతి చెందాయి. స్థానిక రైతుల సమాచారం మేరకు 6వ డివిజన్ కార్పొరేటర్ ఆవుల శ్యామని రమేష్ అక్కడికి చేరుకొని ఎన్ పి డి సి ఎల్ లైన్ మెన్ కి సమాచారం ఇచ్చి, వాటిని పరిశీలించండి జరిగింది అలాగే వాటిని వెటర్నరీ వైద్యులు పంచనామా చేసి వాటిని రైతులు సమక్షంలో పూడ్చి పెట్టటం జరిగింది ఈ సందర్భంగా కార్పొరేటర్ ఆవుల శ్యామని రమేష్ మాట్లాడుతు మృతి చెందిన పాడి గేదెల అంచనా విలువతో ఆ యొక్క గేదెల యాజమానులకు నష్ట పరిహారం ఇవ్వాలని ఎన్ పి డి సి ఎల్ అధికారులను కోరటం జరిగింది.



# పరిస్థితి బాగోలేదని నా భర్త ముందే చెప్పాడు, లిస్టులో ఫస్ట్ పేరు ఆయనదే..

చీఫ్ ఇంజనీర్ భార్య భార్గవి.

తెలంగాణ జూన్ 12: గాండీవం

విశాఖపట్నం: ఒమన్ తీరంలో ఒక వాణిజ్య నౌకపై జరిగిన అమెరికా సైనిక దాడిలో ముగ్గురు భారతీయులు మృతి చెందడం తెలిసిందే. ఈ ఘోర ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారిలో ఆంధ్రప్రదేశ్లోని విశాఖపట్నానికి చెందిన 44 ఏళ్ల మెరైన్ చీఫ్ ఇంజనీర్ సురేష్ కూడా ఉన్నారు.?ఈ దాడిపై సురేష్ భార్య భార్గవి పీటీఐతో మాట్లాడారు. భర్త జూన్ 9న తనతో ఫోన్లో మాట్లాడారని, అక్కడ పరిస్థితులు ఏం బాగోలేవని, త్వరలోనే ఇంటికి వచ్చేయాలని ఉందని చెప్పారని తెలిపారు. జూన్ 10న అమెరికా చేసిన దాడిలో ఆయన చనిపోయారు. గత 5 నెలలుగా సముద్రంలోనే విధుల్లో ఉన్న సురేష్, త్వరలోనే ఇంటికి రావాల్సి ఉండగా ఈ విషాదం చోటుచేసుకుంది. ఈ ఘటనతో సురేష్ స్వస్థలమైన విశాఖపట్నంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి.సురేష్ విధులను ముగించుకుని ఇంటికి తిరిగి రావడం కోసం అప్పటికే రిలీవింగ్ లెటర్ (ఉద్యోగ విధులనుండి విడుదలకు సంబంధించిన పత్రం) కూడా లభించిందని భార్య భార్గవి తెలిపారు. తాను బాగా అలసిపోయానని, ప్రస్తుతం పరిస్థితులు కూడా బాగోలేవని తన భర్త రిక్వెస్ట్ చేసుకున్నారని తెలిపారు...



## 3వ ఏషియన్ ఆత్యా-పత్యా చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకాలు సాధించిన క్రీడాకారులు రామావత్ ప్రకాష్,నేనావత్ బిందు గార్లకు సంగారెడ్డి కలెక్టర్ ప్రతీక్ జైన్ అభినందనలు

**సంగారెడ్డి జిల్లా పుల్కల్. గాండీవం.దినపత్రిక.న్యూస్.12. జూన్.**

సంగారెడ్డి. జిల్లా. పుల్కల్ భూటాన్‌లో ఈ నెల 7 నుంచి 9 వరకు నిర్వహించిన 3వ ఏషియన్ ఆత్యా-పత్యా చాంపియన్‌షిప్‌లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించి స్వర్ణ పతకాలు సాధించిన పుల్కల్ మండలపరిదిలోని లాల్ సింగ్ నాయక్ తండాకు చెందిన రామావత్ ప్రకాష్, దాసుగడ్డ తండాకు చెందిన నేనావత్ బిందును సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అభినందించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి గర్వకారణంగా నిలిచిన ఈ క్రీడాకారులు భవిష్యత్తులో కూడా మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. బాలుర విభాగంలో రామావత్ ప్రకాష్, బాలికల విభాగంలో నేనావత్ బిందు భారతదేశానికి ప్రాతినిధ్యం వహించి స్వర్ణ పతకాలు సాధించడం తెలంగాణకు గర్వకారణమని పేర్కొన్నారు.సంగారెడ్డి జిల్లా మారుమూల గిరిజన గ్రామాలకు చెందిన ఈ క్రీడాకారులు తెలంగాణలో శిక్షణ పొంది అంతర్జాతీయ స్థాయిలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించి గోల్డ్ మెడల్స్ సాధించడం విశేషమన్నారు. వారి విజయంతో క్రీడా వర్గాలు, విద్యార్థులు, తెలంగాణ ప్రజలు, దేశ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం అందోల్ నియోజకవర్గ అధ్యక్షుడు దినేష్ నాయక్‌తో పాటు అజయ్, హరీ, కిరణ్, ప్రవీణ్, తుకారం, సురేష్, విష్ణు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు



## ప్లాస్టిక్ నిషేధం, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్--2026 నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయాలి

### ప్లాస్టిక్ రహిత సంగారెడ్డి నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి:: మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్

**సంగారెడ్డి, గాండీవం దినపత్రిక జూన్ 12:--**

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్--2026 నిబంధనలను సమర్థవంతంగా అమలు చేయాలని సంగారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్ పిలుపునిచ్చారు.గురువారం సంగారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో ఆమె అధ్యక్షతన తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో కలిసి ప్లాస్టిక్ నిషేధం, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్--2026 నిబంధనలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి అధికారిణి విజయలక్ష్మి పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పర్యావరణానికి తీవ్ర హాని కలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని పూర్తిగా నిలిపివేసి, వాటికి బదులుగా పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను వినియోగించాలని సూచించారు. అలాగే సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్--2026 నిబంధనల ప్రకారం తడి, పొడి, హానికర వ్యర్థాలను మూలస్థాయిలోనే వేరు చేసి, శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించడం ద్వారా పరిశుభ్రమైన పట్టణాల నిర్మాణం సాధ్యమవు తుందని తెలిపారు.సదస్సులో భాగంగా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో వ్యాపార సంఘాల ప్రతినిధులకు బట్ట సంచులను పంపిణీ చేసి, ప్లాస్టిక్ క్యారీ బ్యాగులకు ప్రత్యామ్నాయంగా వాటి వినియోగాన్ని ప్రోత్సహించారు.ప్లాస్టిక్ రహిత సంగారెడ్డి నిర్మాణానికి వ్యాపారవేత్తలు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు సమష్టిగా కృషి చేయాలని అధికారులు ఈ సందర్భంగా కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కిరాణా దుకాణాల సంఘం ప్రతినిధులు, బేకరీ షాప్ అసోసియేషన్ సభ్యులు, వ్యాపారవేత్తలు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




## ఆయిల్ పామ్ సాగుపై రైతులకు రెండు రోజుల విజ్ఞాన యాత్ర

### ఖమ్మం జిల్లాలో ఆయిల్ పామ్ తోటల సందర్శనకు రైతుల బృందం

**సంగారెడ్డి, గాండీవం దినపత్రిక జూన్ 12:-**

రైతుల్లో ఆయిల్ పామ్ సాగుపై అవగాహన పెంపొందించి, శాస్త్రీయ సాగు పద్ధతులను ప్రోత్సహించేందుకు జిల్లా ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతుల కు రెండు రోజుల ఆయిల్ పామ్ విజ్ఞాన యాత్రను గురువారం అడిషనల్ కలెక్టర్ సంగీత జెండా ఊపి ప్రారంభించారు.జాతీయ ఆయిల్ పామ్ మిషన్ (చీవీజూ-ఞా) కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఈ విజ్ఞాన యాత్రకు సంగారెడ్డి జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన ఆయిల్ పామ్ సాగుపై ఆసక్తి గల 22 మంది రైతులను ఖమ్మం జిల్లా కొనిజర్ల మండలంలోని ఆయిల్ పామ్ తోటల సందర్శనకు గోద్రెజ్ ఆగ్రోవెట్ సంస్థ సహకారంతో తీసుకెళ్లినట్లు జిల్లా ఉద్యాన అధికారి సోమేశ్వర తెలిపారు . జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నుంచి అదనపు కలెక్టర్ సంగీత రైతుల బృందం విజ్ఞాన యాత్రను జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆయిల్ పామ్ పంట రైతులకు దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయాన్ని అందించే లాభదాయక పంట అని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, సబ్సిడీలను సద్వినియోగం చేసుకుని రైతులు ఆయిల్ పామ్ సాగు విస్తరణకు ముందుకు రావాలని సూచించారు.రెండు రోజులపాటు కొనసాగే ఈ విజ్ఞాన యాత్రలో రైతులు ఆయిల్ పామ్ తోటలను ప్రత్యక్షంగా సందర్శించి సాగు విధానాలు, నాణ్యమైన మొక్కల పెంపకం, తోటల నిర్వహణ, ఎరువుల యాజమాన్యం, నీటి వినియోగ పద్ధతులు, పంట దిగుబడులు, కోత అనంతర నిర్వహణ, ప్రాసెసింగ్ మరియు మార్కెటింగ్ అంశాలపై క్షేత్రస్థాయిలో అవగాహన పొందనున్నట్లు తెలిపారు.అదేవిధంగా, ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులతో ముఖాముఖి సమావేశమై వారు అనుసరిస్తున్న సాగు పద్ధతులు, పంట ద్వారా పొందుతున్న ఆదాయం, ఎదుర్కొన్న సవాళ్లు మరియు వాటి పరిష్కార మార్గాలపై ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం ఉంటుందాన్నారు.ఈ విజ్ఞాన యాత్ర ద్వారా రైతుల్లో ఆయిల్ పామ్ సాగుపై మరింత అవగాహన పెరిగి, శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టేందుకు ప్రోత్సాహం లభిస్తుందని జిల్లా ఉద్యాన శాఖ అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి సోమేశ్వరరావు, ఉద్యాన శాఖ అధికారులు, గోద్రెజ్ ఆగ్రోవెట్ సంస్థ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.




## ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి, బాధితులకు అండగా నిలవండి.

### రోడ్డు ప్రమాదాలు, ఆర్థిక నేరాలు, ఆన్‌లైన్ మోసాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలి.

### విధులలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు, సిబ్బందికి రివార్డులు, ప్రశంసాపత్రాలు అందజేత.

### మంత్లీ క్రైమ్ రివ్యూ మీటింగ్‌లో అధికారులకు పలు సూచనలు చేసిన ఎస్పీ పరితోష్ పంకజ్.

**( సంగారెడ్డి గాండీవం దినపత్రిక జూన్ 12 )**

సంగారెడ్డి జిల్లా సురక్ష ప్రతినిధి: మంత్లీ క్రైమ్ రివ్యూ మీటింగ్‌లో భాగంగా ఈ రోజు తేది: 12.06.2026న సంగారెడ్డి జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లా పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని జిల్లా ఎస్పీ శ్రీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ నిర్వహించారు.ఈ సందర్భంగా అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్, మిస్సింగ్, ఎన్‌బీడబ్ల్యూ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇన్వెస్టిగేషన్‌లో వేగం పెంచాలని, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి, బాధితులకు అండగా నిలవాలని అధికారులకు సూచించారు. లాంగ్ పెండింగ్ కేసుల ఛేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలని, ఇన్వెస్టిగేషన్‌లో సందేహాలు ఉంటే ఇన్వెస్టిగేషన్ సపోర్ట్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలన్నారు. పోలీసు స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదిదారులతో మర్యాదగా మాట్లాడి, వారికి భరోసా కల్పించాలన్నారు.ఎస్.హెచ్.ఓలు తమ పరిధిలోని ప్రతి గ్రామానికి విలేజ్ పోలీసు అధికారిని నియమించాలని, ఆయా గ్రామాలలో రౌడీ షీటర్లు, కేడీలు, సస్పెక్ట్‌లను తరచూ తనిఖీ చేస్తూ వారి కదలికలపై నిఘా ఉంచాలన్నారు. విలేజ్ పోలీసు అధికారులు ఆయా గ్రామాలలో ముందస్తు సమాచారాన్ని సేకరించి, శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. మహిళల భద్రత, రోడ్డు ప్రమాదాలు, ఆర్థిక నేరాలు, ఆన్‌లైన్ మోసాల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యపరచాలన్నారు.సబ్ డివిజనల్ పోలీసు అధికారులు తమ పరిధిలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్‌లు నిర్వహించి, జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని సూచించారు. బ్లూ కోల్ట్స్ మరియు నైట్ పెట్రోలింగ్ సిబ్బంది "పాపిలాన్ డివైస్"లను వినియోగిస్తూ అనుమానాస్పద వ్యక్తుల ఫింగర్‌ప్రింట్లు సేకరించాలన్నారు.నేరాల అదుపులో,




జరిగిన నేరాలను ఛేదించడంలో సీసీ కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు వివరిస్తూ, ప్రతి గ్రామంలో ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల వద్ద, వివిధ కులాలు, మతాలకు చెందిన ప్రార్థనా స్థలాలు, పరిశ్రమలు, ధాబాలు, పెట్రోల్ బంకులు తదితర ముఖ్యమైన ప్రాంతాలలో కమ్యూనిటీ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా వివిధ సంఘాల పెద్దలకు అవగాహన కల్పించాలని ఎస్.హెచ్.ఓలకు సూచనలు చేశారు.వివిధ విభాగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు, సిబ్బందికి కాష్ రివార్డులు, ప్రశంసాపత్రాలు అందజేయడం జరిగింది. అదేవిధంగా తమ తమ పోలీసు స్టేషన్లలో సిబ్బంది ప్రతిభను గుర్తిస్తూ ప్రశంసాపత్రాలకు సిఫారసు చేయాలని ఎస్.హెచ్.ఓలకు సూచించడం జరిగింది.అనంతరం ఎస్.హెచ్.ఓ వాహనాల కండిషన్‌ను తనిఖీ చేస్తూ, ప్రతి వాహనానికి క్రమం తప్పకుండా సర్వీసింగ్ చేయించి, పూర్తి స్థాయి పనితీరులో ఉండే విధంగా చూసుకోవాలని డ్రైవర్లకు సూచించారు. అత్యవసర సమయంలో ఉపయోగపడే కిట్లు ఎల్లప్పుడూ వాహనంలో అందుబాటులో ఉండాలని అన్నారు. వాహనాలను పరిశుభ్రంగా ఉంచిన డ్రైవర్లకు ఎస్పీ రివార్డులను ప్రకటించారు.ఈ సమీక్షా సమావేశంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, డీఎస్పీలు సత్యయ్య గౌడ్, ప్రభాకర్, వెంకట్ రెడ్డి, సైదా నాయక్, ఏఆర్ డీఎస్పీ నరేందర్, ఇన్‌స్పెక్టర్లు రమేష్, కిరణ్ కుమార్, నాగేశ్వర్ రావు, సదా నాగరాజు, ప్రవీణ్ రెడ్డి, ఫింగర్‌ప్రింట్ ఇన్‌స్పెక్టర్ వినయ్ కుమార్ మరియు జిల్లా ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌ఐలు, సబ్‌ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## అధికార దర్పం: అటెండర్లతో ఎంపీడీవో కారు కడిగింపు!

### ఫరూక్ నగర్ ఎంపీడీవో కార్యాలయంలో వెలుగుచూసిన అధికార దుర్వినియోగం

### ఎంపీడీవో కార్యాలయమా..? లేక అధికారి కారు షెడ్డా..?

### ఫరూక్ నగర్ ఎంపీడీవో శ్రీకాంత్ అధికార దర్పం..

### కింది స్థాయి సిబ్బందితో వెట్టిచాకిరీ!

### మహిళా అటెండర్‌తో బహిరంగంగా కారు కడిగింపు..

### భగ్గుమంటున్న జనం

**ఫరూక్ నగర్ (రంగారెడ్డి జిల్లా): గాండీవం**

ప్రజా సేవ చేయాల్సిన అధికారుల తీరు రోజురోజుకూ దిగజారుతోంది. ప్రభుత్వ కార్యాలయాలను తమ సొంత జాగీరులా భావిస్తూ, కింది స్థాయి సిబ్బందిని తమ పర్సనల్ పనివాళ్లుగా వాడుకుంటున్న ఫరూక్ నగర్ ఎంపీడీవో శ్రీకాంత్ నిర్వాకం బట్టబయలైంది. ఈరోజు ఉదయం 11 గంటల సమయంలో ఏకంగా ఫరూక్ నగర్ మండల పరిషత్ కార్యాలయం ముందే సాక్షాత్తూ ఎంపీడీవో తన కారును అటెండర్లతో కడిగించుకోవడం ఆయన అధికార దుర్వినియోగానికి పరాకాష్ట.

**అటెండర్లకు జీతాలిచ్చేది మీ కారు కడగడానికా శ్రీకాంత్ గారూ..?**

ప్రజా ధనంతో ప్రభుత్వ పనుల్లో సహాయపడటం కోసం నియమించబడిన అటెండర్లను ఎంపీడీవో తన వ్యక్తిగత సేవకులుగా వాడుకుంటున్నారు. కార్యాలయం ముందే అందరూ చూస్తుండగా, రామ్మోహన్ అనే అటెండర్‌తో పాటు, ఒక మహిళా అటెండర్‌ను కూడా తన కారు శుభ్రం చేసే పనికి పురమాయించడం తీవ్ర దుమారం రేపుతోంది. ప్రభుత్వ ఫైళ్లు అందిస్తూ అధికారులకు, ప్రజలకు మధ్య వారధిగా ఉండాల్సిన మహిళా ఉద్యోగితో.. నడిరోడ్డుపై పైపులు పట్టించి కారు కడిగించడం మహిళా లోకాన్ని, ఉద్యోగ వ్యవస్థను కించపరచడమే. ఇది సర్వీస్ నిబంధనల ఉల్లంఘన మాత్రమే కాదు, అమానవీయం కూడా.




**ఉన్నతాధికారుల కళ్లు మూసుకుపోయాయా..?**

ఒక మండల స్థాయి అధికారి ఇంత బరితెగించి కార్యాలయం ముందే వెట్టిచాకిరీ చేయించుకుంటుంటే వ్యవస్థ ఏమైపోయినట్లు? ఆధారాలతో సహా దొరికిపోయిన ఈ అధికారిపై చర్యలు తీసుకోకపోతే, ఇక ప్రభుత్వ కార్యాలయాలు అధికారుల ప్రైవేట్ ప్రాపర్టీలుగా మారిపోక తప్పదు.రంగారెడ్డి జిల్లా కలెక్టర్ మరియు ఉన్నతాధికారులు తక్షణమే ఈ ఘటనపై స్పందించి సమగ్ర విచారణ జరపాలి. కింది స్థాయి సిబ్బందితో, అందులోనూ ఓ మహిళా అటెండర్‌తో బలవంతంగా కారు కడిగించుకున్న ఎంపీడీవో శ్రీకాంత్ పై కఠినమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని, వెంటనే ఆయన్ను సస్పెండ్ చేయాలని ప్రజలు మరియు ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకునే దమ్ము అధికారులకు ఉందా లేదా అన్నది ఇప్పుడు వేచి చూడాలి!

## ఆరోగ్యమే మహాభాగ్యం... ఆరోగ్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చు,

### పోలీసుల ఆరోగ్యం, ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి: పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

### పరేడ్‌లో పాల్గొన్న సిబ్బందిని అభినందించిన పోలీస్ కమిషనర్.

**గోదావరిఖని జూన్ 12 గాండీవం**

రామగుండం పోలీస్ కమిషనరేట్ హెడ్‌క్వార్టర్స్ పరేడ్ గ్రౌండ్‌లో అర్మ్డ్ సిబ్బందికి వారాంత పరేడ్ నిర్వహించారు. ఈ పరేడ్‌కు కమాండర్‌గా అడ్మిన్ ఆర్ఐ శేఖర్ వ్యవహరించారు. పరేడ్‌కు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ముఖ్య అతిథిగా హాజరై గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం సిబ్బంది ప్రదర్శనను పరిశీలించి పలు సూచనలు చేశారు.పోలీస్ శాఖలో విధుల నిర్వహణకు శారీరక దారుఢ్యం అత్యంత ముఖ్యమని,ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది తమ ఆరోగ్యం,ఫిట్‌నెస్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు.పోలీస్ పరేడ్ అనంతరం సిబ్బందిని ఉద్దేశించి సీపీ మాట్లాడుతూ,నిత్య విధులతో పాటు ఎన్నికల విధుల్లోనూ కష్టపడి పనిచేసిన సిబ్బందిని అభినందించారు. సుమారు వంద మంది సిబ్బంది పాల్గొని పరేడ్‌ను విజయవంతంగా నిర్వహించారని ప్రశంసించారు.పోలీస్ ఉద్యోగంలో ఆరోగ్యం, శారీరక సామర్థ్యమే ప్రధాన బలమని పేర్కొన్నారు.ఫిట్‌గా ఉంటేనే ఏ బాధ్యతనైనా సమర్థవంతంగా నిర్వర్తించగలమన్నారు.ఆహారపు అలవాట్లు,విశ్రాంతి, వ్యాయామం వంటి అంశాలపై ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టాలని సూచించారు.పోలీస్ సిబ్బంది ఆరోగ్య పరిరక్షణ కోసం కమిషనరేట్ పరిధిలో తరచూ వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, త్వరలో మరో మెగా మెడికల్ క్యాంపును కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.వివిధ వైద్య నిపుణులను అందుబాటులోకి తీసుకువచ్చి సిబ్బందికి మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు చర్యలు



తీసుకుంటున్నామని చెప్పారు.మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది పరేడ్‌లో చురుకుగా పాల్గొనడాన్ని అభినందించి,పోలీస్ యూనిఫాంలో ఉన్న ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు, బాధ్యతలు, అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పురుషులు, మహిళలు సమానంగా పనిచేస్తూ శాఖ ప్రతిష్ఠను పెంచాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మహిళా పోలీసుల కోసం ప్రత్యేక ప్లాటూన్ల ఏర్పాటు దిశగా చర్యలు తీసుకునే అంశాన్ని పరిశీలిస్తున్నామని వెల్లడించారు.సిబ్బంది మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉండటం వల్ల ఫిట్‌నెస్,పనితీరు, టర్నౌట్ మరింత మెరుగుపడుతాయని పేర్కొన్నారు.పరేడ్‌లో కొన్ని సాంకేతిక అంశాల్లో సమన్వయం మెరుగుపర్చాల్సిన అవసరం ఉన్నప్పటికీ, మొత్తం ప్రదర్శన సంతృప్తికరంగా ఉందని కమిషనర్ అభిప్రాయపడ్డారు.ఈ పరేడ్‌లో ఆర్‌ఐలు దామోదర్,శేఖర్, మల్లేష్,రమేష్, ఆర్‌ఎస్‌ఐలు ప్రవీణ్ కుమార్,వెంకట్,శివ, పోచలింగం తదితర అర్మ్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

## రాజీ మార్గమే.. రాజ మార్గం..

### జూన్ 20న జాతీయ లోక్ అదాలత్

### పెండింగ్ కేసుల పరిష్కారానికి సువర్ణావకాశం

### - జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి రత్న పద్మావతి

### సత్వర న్యాయం.. సమన్యాయం

### -న్యాయమూర్తి నాగేశ్వరరావు

**జగిత్యాల,జిల్లా ప్రతినిధి జూన్ 12,గాండీవం:**

ప్రజలకు త్వరితగతిన, సులభంగా, తక్కువ ఖర్చుతో న్యాయం అందించాలనే లక్ష్యంతో రాజీ మార్గమే రాజ మార్గం గా జిల్లా న్యాయ సేవల సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి రత్న పద్మావతి తెలిపారు.శుక్రవారం జిల్లా కోర్టు సముదాయం లో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని అన్ని కోర్టులతో పాటు వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల సహకారంతో నిర్వహించనున్న ఈ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ ద్వారా పరిష్కరించదగిన అనేక రకాల కేసులను విచారించి పరస్పర అంగీకారంతో పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు.చెక్కు బౌన్స్ కేసులు, బ్యాంకు రుణాలకు సంబంధించిన వివాదాలు, మోటారు వాహన ప్రమాద పరిహార కేసులు, కుటుంబ వివాదాలు, విద్యుత్ బిల్లుల వివాదాలు, రెవెన్యూ సంబంధిత సమస్యలు, కార్మిక వివాదాలు, వినియోగదారుల




ఫిర్యాదులు, ట్రాఫిక్ చలానాలు, ఇతర రాజీ ద్వారా పరిష్కరించదగిన సివిల్ మరియు క్రిమినల్ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు.

**జిల్లా న్యాయ సేవల సంస్థ కార్యదర్శి నాగేశ్వర్ రావు మాట్లాడుతూ**

జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి మరిన్ని వివరాల కోసం జిల్లా న్యాయ సేవల సంస్థ, జగిత్యాల కార్యాలయాన్ని లేదా సమీప న్యాయ సేవల కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. జిల్లాలోని ప్రజలు, న్యాయవాదులు, ప్రభుత్వ శాఖలు, బ్యాంకులు, బీమా సంస్థలు మరియు సంబంధిత పక్షాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ వివాదాలను రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సీనియర్ సూపరింటెండెంట్, శ్రీనివాస్, కోర్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచబాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ చేసిన

(సిద్దిపేట గాండీవందినపత్రిక జూన్ 12)

అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ పి జ్యోతిఈరోజు సిద్దిపేట జిల్లా కేంద్రంలోని సెట్విన్ కార్యాలయంలో సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ మరియు బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షులు వలస సుభాష్ చంద్రబోస్ రూపొందించిన నేడు ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం పోస్టర్ ఆవిష్కరణ సిద్దిపేట అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ పి జ్యోతి ఉమ్మడి మెదక్ జిల్లా మై భారత్ కార్యక్రమ అధికారి జి కిరణ్ కుమార్ గారు చేతుల మీదుగా ఆవిష్కరణ చేయడం జరిగింది ఈ సందర్భంగా సిద్దిపేట అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ పి జ్యోతి మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలిద్దామని ఆమె అన్నారు బాలల హక్కులు పకడ్బందీగా అమలు చేస్తున్నట్టు ఆమె తెలిపారు బాలల చే ఎవరైనా పని చేసినట్లయితే టోలి ఫ్రీ నెంబర్ 1098కు సమాచారం అందించాలని వారు తెలిపారు లేబర్ కార్డు యొక్క ప్రాముఖ్యతను వారు వివరించారు గజ్వేల్ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎండి వికార్ వారు మాట్లాడుతూ లేబర్ డిపార్ట్మెంట్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను విద్యార్థులకు వివరించారు ఉమ్మడి మెదక్ జిల్లా మై భారత్ కార్యక్రమ అధికారి జి కిరణ్ కుమార్ శిక్షణ పొందుతున్న విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ బాల్యం చాలా గొప్పదని విద్యార్థులను బడిలో చేర్పించాలని విద్య ద్వారానే సమాజ అభివృద్ధికి దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం అందరం కృషి చేద్దామని ఆయన పేర్కొన్నారు బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షులు వలస సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ బడి వీడిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఆయన తల్లిదండ్రులు



కోరారు గత రెండు దశాబ్దాలుగా బాలల హక్కుల కోసం ఎంత గాను రాష్ట్రవ్యాప్తంగా కృషి చేస్తున్నట్టు ఆయన తెలిపారు రాష్ట్రవ్యాప్తంగా మా బాలల హక్కుల ప్రజా వేదిక ఆధ్వర్యంలో నేడు ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం ప్రజలను చైతన్యం చేసేందుకు అన్ని జిల్లా కేంద్రాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సెట్విన్ ఇన్చార్జ్ శ్రీనివాస్ జిల్లా యువజన సంఘాల జిల్లా అధ్యక్షులు అధికం రాజ గౌడ్ రాష్ట్ర యువజన అవార్డు గ్రహీత దొమ్మాట రాజు చైల్డ్ హెల్ప్ లైన్ జిల్లా ప్రతినిధి బాయికాడి లక్ష్మణ్ బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పిడిశెట్టి రాజు సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ కోఆర్డినేటర్ బైరి చంద్రశేఖర్ సెట్విన్ సిబ్బంది తరుణం కుమార్ సెట్విన్ లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు సిద్దిపేట జిల్లా బాలల హక్కుల ప్రజా వేదిక సంకల్ప సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# కోతూర్ వై-జంక్షన్ అండర్‌పాస్‌ను పరిశీలించిన డీసీపీ శివమ్ ఉపాధ్యాయ్

## వర్షాకాల సన్నద్ధతపై అధికారులకు కీలక ఆదేశాలు

గాండీవం న్యూస్ జూన్ 12

జాతీయ రహదారి–44పై కోతూర్ వై–జంక్షన్ అండర్‌పాస్ వద్ద వర్షాకాలంలో ఏర్పడే నీటి నిల్వ సమస్యలను పరిశీలించేందుకు ఫ్యూచర్ సిటీ ట్రాఫిక్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) శివమ్ ఉపాధ్యాయ్, ఐపీఎస్ శుక్రవారం తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో షాద్‌నగర్ ట్రాఫిక్ సిబ్బందితో పాటు నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు. తనిఖీ సందర్భంగా అండర్‌పాస్ నిర్మాణం భారీ వర్షాలకు నీటి నిల్వకు అనుకూలంగా ఉండటం వల్ల ద్విచక్ర వాహనాలు, తక్కువ ఎత్తు వాహనాలకు ప్రమాదకర పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని గుర్తించారు. డ్రైనేజీ వ్యవస్థలో మట్టి, నిర్మాణ వ్యర్థాలు, తాత్కాలిక కాంక్రీట్ అడ్డంకులు నీటి పారుదలపై ప్రభావం చూపుతున్నట్లు గమనించారు. అలాగే బహిర్గతమైన యుటిలిటీ కేబుళ్లు, కొనసాగుతున్న నిర్మాణ మార్పులు కూడా భద్రతాపరమైన ఆందోళనలు కలిగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీసీపీ శివమ్ ఉపాధ్యాయ్ ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు డ్రైనేజీ కాలువలను తక్షణమే శుభ్రపరచి వర్షపు నీరు వేగంగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, శాశ్వత బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాఫిక్ పోలీసులకు నీటి మట్టం ప్రమాదకర స్థాయికి చేరినప్పుడు వెంటనే ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టాలని, ఎన్‌హెచ్‌ఏఐ అత్యవసర బృందాలతో సమన్వయం చేసుకుని నిలిచిపోయిన వాహనాలను తొలగించి రాకపోకలను పునరుద్ధరించాలని ఆదేశించారు. ప్రజలకు సూచనలువర్షాకాలంలో నీటి లోతు తెలియని అండర్‌పాస్‌లలో వాహనాలను నడపవద్దని, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు నీటితో నిండిన అండర్‌పాస్‌లను పూర్తిగా నివారించాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. లేన్ క్రమశిక్షణ పాటించాలని, ట్రాఫిక్ పోలీసుల సూచనలను తప్పనిసరిగా అనుసరించాలని కోరారు. అలాగే వర్షాకాలంలో ప్రయాణానికి ముందు వాహనాల బ్రేకులు, వైపర్లు, హెడ్‌లైట్లు, టెయిల్‌లైట్లు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో తనిఖీ చేసుకోవాలని సూచించారు. వర్షాకాలంలో ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ అన్ని అవసరమైన చర్యలు చేపడుతున్నామని ట్రాఫిక్ పోలీసులు, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు తెలిపారు



# కరాటే లో నేషనల్ మరియు ఇంటర్నేషనల్ ఛాంపియన్స్ ని సత్కరించిన

గాండీవం న్యూస్ జూన్ 12

కరాటే లో నేషనల్ మరియు ఇంటర్నేషనల్ ఛాంపియన్స్ ని సత్కరించిన మోర్తాడ్ ఎస్సై రాము అభినందించడం జరిగింది అలాగే నిజాంబాద్ జిల్లా తెలంగాణ స్టేట్ లో కూడా స్టేట్ లెవెల్ పాల్గొనడం జరిగింది వీరి పేరు దమ్మాయి శ్రీనిధి శ్రీకృతి వీరు చూపించిన కరాటే విన్యాసానికి ముద్దులైన స్టేట్ లెవెల్ ప్రజలు ఇంటర్నేషనల్ ఛాంపియన్స్ గా ముందుకు వెళు_న్న వీరిని గ్రామ ప్రజలు అడగడం జరిగింది ఇంటర్నేషనల్ ఛాంపియన్స్ లో గోల్డ్ మెడల్ తెచ్చిన ఘనత మోర్తాడ్ మండలంలోని మోర్తాడ్ గ్రామానికి చెందిన పిల్లలు గణనీయమైన మెడల్ తేవడంతో కనీవిని ఎరగని రీతిలో గ్రామ ప్రజలు వీరిని కొని ఆడడం జరిగింది . వీరి తల్లిదండ్రులు కూడా వారి పేర్లు దమ్మాయి గంగాధర్ దమ్మాయి వాణి ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేశారు వీరి పిల్లలు ఇంకా ముందుకు వెళ్లాలంటూ వీరి ఆశలోని నెరవేర్చినందుకు పిల్లల సంతోషాలకు సంబంధించిన మరి ఇంకా ఎన్నో మంచి పనులు ఇంకా ఎన్నో మెడల్స్ సాధించాలని కోరడం జరి కరాటే అవినాష్ గారు పిల్లలు ఇద్దరి భవిష్యత్తు కోసం కరాటేని నేర్పించడం జరిగింది . వీరు నేర్చుకున్న పద్ధతి చాలా కఠినమైనది పిల్లలు సాధనకు చాలా అనుసంధానంగా ఉండటం వలన వీరు ముందుకు వెళ్లడం జరిగిందని అవినాష్ వీరిని కొనియాడారు మాస్టర్ శివాని కరాటే మాస్టర్ కూడా పిల్లలు ముందుకెళ్లిన ఆనందంలో మేము దేనికైనా సహకరిస్తాం పిల్లల విషయంలో అని శివాని చెప్పడం జరిగింది . దాంతోపాటు కోరుట్ల ఎమ్మెల్యే చేతుల మీదుగా బ్లాక్ బెల్ట్ మెడలు తీసుకోవడం జరిగింది వీరు భవిష్యత్తులో ముందుకు వెళ్లాలంటూ కోరుట్ల ఎమ్మెల్యే వీరిని అభినందించారు ఇంకా ముందు ముందు భవిష్యత్తులో చాలా సాధించాలంటూ ముందుకు ఇలాగనే మీరు వెళుతూ ఉండండి నా సహకారం మీకు ఉంటుందని చెప్పడం జరిగింది వీరి ముందు తరం కు సంబంధించిన ప్రణాళిక కోసం ఇంకా ఎవరైనా వీరికి సపోర్ట్ కారంగా అండ్ డబ్బులపరంగా వీరికి సహకరించే వాళ్ళు వీళ్ళని సపోర్ట్ చేస్తూ వీరిని ఇంకా ప్రోత్సాగర్ ఇస్తూ వీరిని ముందుకు తీసుకోవాలని వీరి తల్లిదండ్రుల కోరిక వీరి ఆశలు ఇంకా ముందుకు జరగాలని కోరుతున్నారు





# 100 గ్రాముల గంజాయి స్వాధీనం.. ముగ్గురికి కౌన్సెలింగ్

## ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ బృందం దాడులు.. తహసీల్దార్ ఎదుట బైండోవర్

గాండీవం న్యూస్ జూన్ 12:

నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం భీంగల్ మండలంలోని సంతోష్ నగర్ తండా సమీపంలో ఎక్సైజ్ ఏసీ ఎన్ఫోర్స్మెంట్ బృందం నిర్వహించిన దాడుల్లో 100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. భీంగల్ మండల పరిధికి చెందిన షేక్ మజాస్ (తండ్రి యునస్ అహ్మద్, భీంగల్ మున్సిపాలిటీ నివాసి) వద్ద నుంచి 100 గ్రాముల గంజాయితో పాటు ఒక మొబైల్ ఫోన్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గంజాయి సేవిస్తున్న ముగ్గురు వ్యక్తులను గుర్తించిన అధికారులు, వారి తల్లిదండ్రుల సమక్షంలో గంజాయి వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. తర్వాత వారిని భీంగల్ తహసీల్దార్ ఎదుట హాజరుపర్చి బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. మత్తు పదార్థాల వినియోగానికి దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ వేణు మాధవరావు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.



# జంట హత్యల కేసులో నిందితురాలి మృతి

తెలంగాణ జూన్ 12: గాండీవం


తెలంగాణ : – రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ ఫాంహౌస్ వద్ద జరిగిన జంట హత్యల కేసులో ప్రధాన నిందితురాలు కరీమాబీ ఆస్పత్రిలో మృతి చెందింది. అప్పు తీర్చాలని ఒత్తిడి తెచ్చిన ఇద్దరు మహిళలను హత్య చేసి పూడ్చిపెట్టిన కేసులో ఆమె నిందితురాలు. విచారణ నిమిత్తం పోలీస్‌స్టేషన్‌కు తీసు కువచ్చినప్పుడు, కరీమాబీ బాత్‌రూమ్ క్లీనింగ్ యాసిడ్‌ను సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. 24 రోజుల చికిత్స అనంతరం బుధవారం రాత్రి ఆమె మరణించింది. ఈ ఘటనలో నిర్లక్ష్యం వహించిన ఇద్దరు కానిస్టేబుళ్లను వికారాబాద్ ఎస్పీ సస్పెండ్ చేశారు...



# యూరియా బుకింగ్ యాప్ లో మండల స్థాయి ప్రాతిపదికను మార్చాలి

ఆర్మూర్, గాండీవం, జూన్ 12 :-

ఆర్మూర్ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం యూరియా బుకింగ్ యాప్ లో మండల స్థాయి ప్రాతిపదికను మార్చి స్థానిక సొసైటీలు మరియు ఫర్టిలైజర్ షాపులకు అందుబాటులో తేవాలని అలాగే ఎకరానికి యూరియా కేటాయింపులపై స్పష్టత ఇవ్వాలని పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంచెట్టి గంగాధర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆన్లైన్ ఎరువుల బుకింగ్ యాప్ వల్ల రైతులు క్షేత్రస్థాయిలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రభుత్వం గానీ అధికారులు గానీ ఏమాత్రం పట్టించుకోవడంలేదని అయితే ప్రస్తుత విధానంలో యాప్ ద్వారా యూరియాను బుక్ చేసుకునేందుకు మండలాన్ని ప్రామాణికంగా తీసుకోవడం క్షేత్రస్థాయిలో రైతులకు ఇబ్బందులను కలిగిస్తుందని, మండల కేంద్రం లేదా యాప్ సూచించిన పంపిణీ కేంద్రాలు అనేక గ్రామాలకు దూరంగా ఉన్నాయి. దీనివల్ల బుక్ చేసుకున్న యూరియా బస్తాలను తమ గ్రామాలకు తరలించుకోవడానికి రైతులు అదనపు ఖర్చులు భరించడంతో పాటు వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి యాప్ లో మండల యూనిట్ కి బదులుగా రైతులకు అత్యంత చేరువలో ఉండే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను లేదా స్థానికంగా గుర్తింపు పొందిన ఫర్టిలైజర్ దుకాణాలకు పంపిణీ యూనిట్లుగా మార్చాలని కోరారు. అలాగే ఎకరానికి యూరియా బస్తాల కేటాయింపు పై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ ధర్నాలో కౌన్సిలర్లు ఖాందేశ్ ప్రశాంత్, పాన్ శ్రీనివాస్, ధోండి ఈశ్వర్, అరుణ్, జెస్సు అనిల్, ద్యాగ ఉదయ్, పులి యుగంధర్, మీసాల రాజేశ్వర్, విజయానంద్, కొడిగెల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి చిన్నారి బడిబాట పట్టాలి

## జాబితాపూర్‌లో బడిబాట కార్యక్రమం

## విద్యార్థుల చేరికల పెంపే లక్ష్యంగా ఇంటింటా అవగాహన

## -- జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల కృషి

జగిత్యాల జిల్లా ప్రతినిధి జూన్ 12,గాండీవం:

జగిత్యాల రూరల్ మండల పరిధిలోని జాబితాపూర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల వయస్సు గల ప్రతి చిన్నారి తప్పనిసరిగా విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలనే లక్ష్యంతో గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శేషశలపతి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, డిజిటల్ విద్య వంటి అనేక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని కోరారు. ఉపాధ్యాయులు గ్రామంలోని వీధుల వెంట ర్యాలీ నిర్వహించి, ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులకు విద్య ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి బాలబాలిక బడిబాట పట్టి విద్యావంతులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆత్మ చరణ్ రావు, రాజసాగర్, అమరేశ్వరి, శ్రీధర్, రాజు, విద్య, శ్రీనివాస్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.




# ప్రభుత్వ బడులే పిల్లల బంగారు భవిష్యత్తుకు బడిబాట

## కొనసముందర్‌లో బడిబాట కార్యక్రమం..

## ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల చేరికకు అవగాహన

గాండీవం న్యూస్ జూన్ 12:

నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం కమ్మర్‌పల్లి మండలంలోని కొనసముందర్ గ్రామంలో పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బెజ్జారం రాకేష్, ప్రధానోపాధ్యాయులు మధుపాల్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతను వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, ఆధునిక బోధన విధానాలు, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, డిజిటల్ తరగతులు వంటి అనేక సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. పిల్లల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వ పాఠశాలలే ఉత్తమ వేదికలని పేర్కొన్నారు. ప్రతి చిన్నారి విద్య హక్కును సాకారం చేయడంలో భాగంగా తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి భవిష్యత్తును బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భలే రావు శంకర్, ఉపాధ్యాయులు, విద్యా కమిటీ సభ్యులు, అంగన్వాడీ టీచర్లు ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



# బదిలీపై వెళ్తున్న ఏఈఓలు దయా రమేష్, నైతం హరీష్‌కు వీడ్కోలు

## ,కొత్తగా చేరిన ఏఈఓలు

## యాస్మిన్, శ్రీనివాస్ లను సన్మానించిన-

## మండల వ్యవసాయాధికారి కే. సతీష్ కుమార్

ద్వారక నగర్ జూన్ 12 గాండీవం

పెద్దపల్లి జిల్లా అంతార్గం మండలం బ్రాహ్మణపల్లి రైతు వేదిక లో ఉన్నటువంటి ఏ ఈ ఓలు దయ రమేష్, నైతం హరీష్ కు వీడ్కోలు, కొత్తగా చేరి న యాస్మిన్ కి స్వాగతం పలికి ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి సతీష్ కుమార్ మాట్లాడుతూరైతులకు అండగా నిలుస్తూ వ్యవసాయ రంగ అభివృద్ధికి విశేష సేవలు అందించిన అగ్రికల్చర్ అసిస్టెంట్ ఎక్స్టెన్షన్ అధికారులు (ఏఈఓలు) దయా రమేష్, నైతం హరీష్ బదిలీపై వెళ్తున్న సందర్భంగా శుక్రవారం బ్రాహ్మణపల్లి రైతు వేదికలో వీడ్కోలు సన్మాన సభ నిర్వహించారు. అదేవిధంగా కొత్తగా వచ్చిన ఏఈ ఓ లు యాస్మీన్, శ్రీనివాస్ కి స్వాగతం తెలుపుతూ రైతులు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ సిబ్బంది సమక్షంలో, అంతర్గాం వ్యవసాయ అధికారి సతీష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సభకు అంతర్గాశీ మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల సర్పంచులు, రైతులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై సన్మాన కార్యక్రమం చేపట్టడం జరిగింది. అలాగే రైతుల సమస్యల పరిష్కారంలో, పంటల నిర్వహణలో, ప్రభుత్వ పథకాల అమలులో దయా రమేష్, నైతం హరీష్ అందించిన సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కే. సతీష్ కుమార్,సర్పంచ్ లు, ప్రజాప్రతినిధులు,రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# తల్లిదండ్రులు ప్రైవేటు బడుల పట్ల మోజు వీడాలి

## -- శ్రీరాంపూర్ ఎంఈఓ మహేష్

**కాల్వ శ్రీరాంపూర్, జూన్ 12, గాండీవం :**

ప్రభుత్వం కోట్లాది రూపాయల ఖర్చుతో ప్రభుత్వ పాఠశాలలను నిర్వహిస్తూ అద్భుతమైన ఫలితాలు సాధిస్తోందని, తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల పట్ల మోజువీడి తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని మండల విద్యాధికారి సిరిమల్ల మహేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జడ్పీహైస్కూల్లో ప్రధానోపాధ్యాయులు, మధ్యాహ్న భోజన పనివారికి నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలను కల్పించడమే కాకుండా అన్ని పాఠశాలలను ప్రతిరోజు పర్యవేక్షణ చేస్తూ పాఠశాల పిల్లల్లో అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు ప్రైవేట్ బడుల్లో చేర్పించి వేలాది రూపాయలు వృధా చేసుకోవద్దని, ఉచితంగా నాణ్యమైన విద్యను అందించే ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లల్ని చదివించాలని ఆయన కోరారు. ప్రభుత్వ పాఠశాలలు ఈనెల 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్నందున ప్రధానోపాధ్యాయులు పాఠశాల గదులను, పరిసరాలను, మధ్యాహ్న భోజనం వండేవారు వంటగదులు, పాత్రలు, ఇతర సామాగ్రిని శుభ్రం చేసుకోవాలని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కోరారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం వండడంలో మెలకువలు, జాగ్రత్తలను వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మహేష్, శ్రీరాంపూర్, పెగడపల్లి, మల్యాల స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మధ్యాహ్న భోజనం పనివారు, సిఆర్పిలు చందర్, వి.వీరయ్య, కుంట కుమారస్వామి, చంద్రకళ, ఎం ఆర్ సి సి బంద్ సుంకరి జాలిగం రమేష్, తదితరులు పాల్గొన్నారు.



# బోయిన్ పల్లి మార్కెట్ యార్డ్ పక్కన 8 ఎకరాల భూమి వివాదం

రూ.400 కోట్ల ప్రభుత్వ భూమి ప్రైవేటు ఎలా అయింది? -- టీఆర్ఎస్ నేత మన్నే క్రిశాంక్ ప్రశ్న

ఈ భూమి వివాదం పై ఎమ్మెల్యే, కంటోన్మెంట్ అధికారులు ఎందుకు మౌనం?

ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడంపై పలు అనుమానాలు

ఇందులో ఎవరి వాటా ఎంత? తేల్చాల్సిన సమయం వచ్చిందన్న క్రిశాంక్

**సికింద్రాబాద్, జూన్ 12:తెలంగాణ గాండీవం**

బోయిన్పల్లి మార్కెట్ యార్డ్ సమీపంలోని సుమారు 8 ఎకరాల భూమి వివాదం మరోసారి రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. సుమారు రూ.400 కోట్ల విలువైన ఈ భూమిని ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లేలా ప్రభుత్వం సహకరించిందని టీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నే క్రిశాంక్ ఆరోపించారు.శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గతంలో ప్రభుత్వ భూమిగా పేర్కొన్న ఈ స్థలం ఇప్పుడు ప్రైవేట్ వ్యక్తుల పేర్లతో బోర్డులు వెలుస్తుండడం వెనుక అనేక అనుమానాలు ఉన్నాయని అన్నారు. ఒకప్పుడు ఈ భూమిని ప్రభుత్వ ఆస్తిగా ప్రకటించి కాపాడాలని డిమాండ్ చేసిన నాయకులే నేడు మౌనం వహించడం ఆశ్చర్యకరమని పేర్కొన్నారు.ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యే శ్రీ గణేష్ గతంలో తన సోషల్ మీడియా వేదికగా ఈ భూమిని ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ చేసిన పోస్టులను ఇప్పుడు బయటపెట్టి ప్రజలకు చూపిస్తున్నామని తెలిపారు. అప్పుడు ప్రభుత్వ భూమి అయిన స్థలం ఇప్పుడు ప్రైవేట్ ఆస్తిగా ఎలా మారిందో ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వంలోని కొందరు మంత్రులు, కంటోన్మెంట్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలతో ఈ భూమిని కబ్జా చేసే ప్రయత్నాలు జరిగాయని ఆరోపించారు. కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడంలో ఎవరి పాత్ర ఎంత ఉందో పూర్తిస్థాయిలో విచారణ జరిపి బయటపెట్టాలని




డిమాండ్ చేశారు.కంటోన్మెంట్ ప్రాంతంలో ఉన్న ఈ విలువైన భూమిని పేదల కోసం డబుల్ బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణానికి వినియోగించాల్సిందిపోయి, ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లడం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని ఆయన అన్నారు.ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులపై ఉందని, అయితే ఈ వ్యవహారంలో ఎమ్మెల్యే, కంటోన్మెంట్ అధికారులు, పోలీసులు ఎందుకు మౌనం పాటిస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు.ఈ భూమి వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి నిజాలు వెలుగులోకి తీసుకురావాలని, లేకపోతే కంటోన్మెంట్ ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు, ధర్నాలు నిర్వహిస్తామని మన్నే క్రిశాంక్ హెచ్చరించారు.

# కోదాడ మండలం ద్వారకుంట సమీపంలో నెమలిపురి గ్రామంలో విద్యుత్ షాక్ తో అసిస్టెంట్ లైన్‌మెన్ మృతి...

**తెలంగాణ జూన్ 12: గాండీవం**



కోదాడ మండలం ద్వారకుంట సమీపంలో నెమలిపురి గ్రామంలో విద్యుత్ షాక్ తో అసిస్టెంట్ లైన్‌మెన్ మృతి...నెమలిపురి గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో, దానిని పునరుద్ధరించే క్రమంలో ఘటన..రెడ్డిబోయిన గోపి అనే యువకుడు అదే గ్రామంలో మీటర్ రీడర్‌గా పనిచేస్తూనే, లైన్‌మెన్‌కు అసిస్టెంట్‌గా పనిచేసేవాడు...

# ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన ఫలితాలు

## -- రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఈర్ల సమ్మయ్య

**కాల్వ శ్రీరాంపూర్, జూన్ 12, గాండీవం :**

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన ఫలితాలు వస్తున్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ఊషన్నపల్లి ప్రభుత్వ ఆంగ్ల మాధ్యమ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య కోరారు. శుక్రవారం ఆయన ఊషన్నపల్లిలో మహిళా సంఘాల సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతను వివరించారు. ఒక ప్రభుత్వ పాఠశాల నడవాలంటే నెలకు సుమారుగా 8 నుంచి 10 లక్షల రూపాయల ఖర్చు అవుతుందని, ఆ డబ్బంతా ప్రజలదేనన్నారు. ఉన్న ఊరు కన్నతల్లి లాంటి ప్రభుత్వ పాఠశాలలు అందుబాటులో ఉండగా, సుదూర ప్రాంతాలకు వెళ్లి, ప్రైవేటులో చదువుకొనడం అవసరమా అని ఆయన ప్రశ్నించారు. కష్టపడి సంపాదించిన డబ్బును తల్లిదండ్రులు వృధా చేసుకోవద్దని, తమ గ్రామంలోనే ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల్ని చేర్పించి, అక్కడి ఉపాధ్యాయుల చేత చక్కగా చదువు చెప్పించుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలతో పాటు, సాంకేతిక విద్య అందుబాటులో ఉందని, అంకిత భావం కలిగిన ఉపాధ్యాయుల సేవలను తల్లిదండ్రులు వినియోగించుకోవాలని ఈర్ల సమ్మయ్య కోరారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులకు ఆయన ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు.



# మైత్రి డ్రగ్స్ టెక్నాలజీ సెంటర్ పరిశ్రమలో విషాదం

## జూనియర్ ఎగ్జిక్యూటివ్ కార్మికుడు మృతి

**(గుమ్మడిదల గాండీవం దినపత్రిక జూన్ 12)**



మైత్రి డ్రగ్స్ టెక్నాలజీ సెంటర్ పరిశ్రమలో విషాదంజూనియర్ ఎగ్జిక్యూటివ్ కార్మికుడు మృతివిధులు నిర్వహిస్తుండగా ప్రమాదానికి గురైన జూనియర్ ఎగ్జిక్యూటివ్ ప్రవీణ్ కుమార్ (25)చికిత్స పొందుతూ మృతి చెందిన కార్మికుడుమృతుడు మెదక్ జిల్లా హత్నూర మండలం కసల గ్రామానికి చెందిన వ్యక్తిమూడు రోజుల క్రితం పరిశ్రమలో ప్రమాదంవిషయం బయటకు రాకుండా సమీపంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలింపుఆరోగ్య పరిస్థితి విషమించడంతో నిమ్స్ ఆస్పత్రికి తరలింపుచికిత్స పొందుతూ మృతి చెందిన ప్రవీణ్ కుమార్ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉందిపరిశ్రమ భద్రతా ప్రమాణాలపై ప్రశ్నలు వ్యక్తం చేస్తున్న స్థానికులు, కార్మికులుమృత కార్మికుడి కుటుంబానికి మద్దతుగా సీపీఎం కార్మిక నాయకులుబాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్న కార్మిక సంఘాలు, వివిధ పార్టీల నాయకులు, స్థానికులు

# రోడ్లపై అక్రమ కట్టడాలు పెరుగుతున్న ప్రమాదలు

కొనసముందర్ గ్రామంలో అనుమతులు లేకుండానే నిర్మాణాలు --

గ్రామపంచాయతీ కార్యదర్శుల కుమ్మక్కు ఉందని స్థానికుల ఆరోపణ.

**గాండీవం న్యూస్ 12:**


నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం కమ్మర్ పల్లి మండలంలో కొనసముందర్ గ్రామంలో రోడ్లపై అక్రమ కట్టడాలు రోజురోజుకు పెరుగుతున్నాయని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నరు. అనుమతులు లేకుండానే కొందరు గ్రామాల్లో ఇళ్ల ముందు వరకు రోడ్లను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపిస్తున్నారు.కొన్ని చోట్ల ఇళ్ల ముందు బెడ్లు మెట్లు,ప్లాట్‌ఫారాలు నిర్మించడం వల్ల రహదారులు ఇరుకుగా మారి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.ముఖ్యంగా అత్యవసర సేవల వాహనాలు, వ్యవసాయ వాహనాలు,స్కూల్ బస్సులు వెళ్లేందుకు కూడా ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పేర్కొంటున్నారు.గతము లో విధులు నిర్వహించిన గ్రామపంచాయతీ కార్యదర్శు సహకారంతోనే ఈ అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి గ్రామంలో రోడ్ల ఆక్రమణలను తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అధికారులు విచారణ నిర్వహించి వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.



# తునిలో పోలీసులకు సవాల్ గా చిన్నారి జ్ఞానేశ్వరి మిస్సింగ్ కేస్...

**తెలంగాణ జూన్ 12, గాండీవం :**

"ఆరు రోజులైన తెలియని జ్ఞానేశ్వరి ఆచూకీ"జ్ఞానేశ్వరి కోసం గాలిస్తున్న 12 పోలీస్ బృందాలు, ఎస్డీఆర్ఎఫ్, సిబ్బంది..ఇవాళ పెంపుడు కుక్క సాధారణ స్థితికి వస్తే జిపిఎస్ ట్రాకర్ అమర్చి గాలింపు చర్యలు చేపట్టనున్న పోలీసులు..జ్ఞానేశ్వరి కోసం తల్లడిల్లుతున్న తల్లిదండ్రులు..తమ పాపను ఎవరో కిడ్నాప్ చేసి ఉంటారని అనుమానిస్తున్న తల్లిదండ్రులు...



# యూరియా యాప్ రద్దు చేసి పాత విధానంలోనే ఎరువుల పంపిణీ చేయాలి

తహసీల్దార్‌కు బీజేపీ నేతల వినతిపత్రం

రైతులకు ఇబ్బందులు కలిగిస్తున్న యూరియా యాప్ : సూర శ్రీకాంత్

**ఆలూర్ జూన్ 12 గాండివం**

రైతులకు ఇబ్బందులు కలిగిస్తున్న యూరియా యాప్‌ను వెంటనే రద్దు చేసి, గతంలో అమలు చేసిన విధంగానే ఎలాంటి ఆంక్షలు లేకుండా యూరియా ఎరువులు అందించాలని ఆలూర్ బీజేపీ మండల అధ్యక్షుడు సూర శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు తహసీల్దార్ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సూర శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న యూరియా యాప్ కారణంగా రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. యాప్‌లో సాంకేతిక సమస్యలు, నమోదు ప్రక్రియలో ఇబ్బందులు, ఎరువుల పంపిణీలో జాప్యం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. వ్యవసాయ పనులు కీలక దశలో ఉన్న సమయంలో రైతులకు యూరియా సకాలంలో అందకపోవడం ఆందోళన కలిగించే విషయమన్నారు.రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని యాప్ విధానాన్ని వెంటనే రద్దు చేసి, పాత విధానంలోనే యూరియా పంపిణీ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోతే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి పోల్కం వేణు, మండల ప్రధాన కార్యదర్శి హరీష్, డాక్టర్ అరుణ్, సుభాష్, బాస సురేష్, ప్రళయ్ తేజ్, మండల ఉపాధ్యక్షుడు పోశెట్టి, మోర్చా అధ్యక్షుడు నడిశారం మల్లయ్య, కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి మహేష్, సీనియర్ నాయకులు నాగేష్, సురేష్ గౌడ్, అజయ్, సాయి పటేల్ తదితరులు పాల్గొన్నారు.






# ప్రజల సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా ప్రజల వద్దకే నేరుగా వెళ్లి సమస్యలు తెలుసుకుంటున్న-

## రాజన్న సేవా సమితి ఛైర్మన్ మనాలి ఠాగూర్

**ద్వారక నగర్ జూన్ 12 గాండీవం**

పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం లంబాడి తండా గ్రామంలో రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ ఆదేశానుసారం వారి సతీమణి,రాజన్న సేవా సమితి ఛైర్మన్ మనాలి ఠాగూర్ ఉపాధి హామీ పథకం (100 రోజుల పనులు) కూలీలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసు కోవడం జరిగింది.ఈ సందర్భంగా రాజన్న సేవా సమితి ఛైర్మన్ మనాలి ఠాగూర్ కూలీలతో నేరుగా మాట్లాడి వారి ఇబ్బందులను ఆత్మీయంగా విన్నారు.పనుల అమలులో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి సంబంధిత అంశాలపై చర్చించారు. పెండింగ్ వేతనాలు, చెల్లింపుల అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు.సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.కూలీల సంక్షేమం, శ్రేయస్సు కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.మీ సమస్యలు మా బాధ్యతవాటి పరిష్కారం కోసం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఎల్లప్పుడూ మీతోనే ఉంటారని మనాలి రాజ్ ఠాకూర్ భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ సతీమణి, రాజన్న సేవా సమితి ఛైర్మన్ మనాలి ఠాగూర్, రామగుండం మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ మడ్డి తిరుపతి గౌడ్, బ్రాహ్మణపల్లి గ్రామ సర్పంచ్ గద్దల విమల–రాజయ్య,కాంగ్రెస్ పార్టీజిల్లా నాయకులు మాజీ ఎంపీపీ ఉరిమెట్ల రాజలింగం, పెద్దపల్లి జిల్లా ఓబీసీ,బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పెండ్యాల మహేష్, పెద్దపల్లి జిల్లా డిసిసి ప్రధాన కార్యదర్శి పూదారి సత్తయ్య గౌడ్, సింగం కిరణ్ గౌడ్, జిల్లా యువజన కార్యదర్శి నక్క రాజ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# గోదావరిఖని ఆర్టీసీడిపో మేనేజర్ గా బాధ్యతలు స్వీకరించిన సిహెచ్ కవిత

ప్రస్తుత డిఎం నాగభూషణం కరీంనగర్ కు బదిలీ

కొత్త డిఎం ను ఘనంగా సన్మానించిన ఖని ఆర్టీసీ బృందం

**గోదావరిఖని జూన్ 12 గాండీవం**

గోదావరిఖని డిపో మేనేజర్ గా. గతంలో ఈ డిపోలోనే ఉన్న పదవులు చేపట్టి తిరిగి ప్రమోషన్ పై ఈ డిపోకు వచ్చిన కొత్త డిఎం కవితను ఈ డిపోలో పలు పదవులు నిర్వహిస్తున్న డిపార్ట్మెంట్ల అధికారులు శాలువాతో సన్మానం చేసి స్వీట్ తినిపించారు ఈ కార్యక్రమంలో గోదావరిఖని డిపో వెల్ఫేర్ కమిటీ మెంబర్స్ లిజి.పద్మావతి గౌడ్ ,జి ఆర్ రెడ్డి , టి ఐ టు.గ్రా.లింగన్న, ఎడిసి శ్రీనివాస్ కండక్టర్ బుకింగ్స్ సీనియర్ డ్రైవర్ ఎం.ఎల్ నారాయణ, సీనియర్ కండక్టర్స్ టి .రాణి, సిహెచ్ కృష్ణకుమారి తో పాటుగా పలువురు ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు



Publisher : AT Rajarao, 5-36/1,ismailkhanpet, Sangareddy, Telangana, E.mail: arimishettiatrajarao640@gmail.com, Cell: 9948462690. PRGI TGTEL/25/A0888,
Printed at SMILYS ONLINE 6-7-48, VANASTHALIPURAM SHOPPING COMPLEX, RANGAREDDY

# నంద్యాలలో... వెన్నుపోటుకు రెండేళ్ల నిరసన.. భారీర్యాలీ... కదం తొక్కిన వైసీపీ శ్రేణులు!

కూటమి ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజం...

మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి

డా. వైఎస్సార్ విగ్రహాన్ని మళ్లీ ప్రతిష్ఠిస్తాం.. శిల్పా రవిరెడ్డి సవాల్

రాష్ట్రంలో అవినీతి, అరాచకాలు, దౌర్జన్యాలు పేట్రేగిపోతున్నాయని, ప్రజలకు అండగా.. వైసీపీ

తెలంగాణ గాండీవం దినపత్రిక జూన్ 12

నంద్యాలలో కూటమి ప్రభుత్వ వైఖరిపై వైఎస్సార్సీపీ పోరుబాట పట్టింది. చంద్రబాబు నాయుడి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజలను, రైతులను, యువతను వంచించి రెండేళ్లు పూర్తయిందంటూ వైఎస్సార్సీపీ శ్రేణులు భారీ నిరసన ర్యాలీ చేపట్టాయి. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలు, మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి పిలుపు మేరకు నంద్యాల జిల్లా కేంద్రంలో "వెన్నుపోటుకు రెండేళ్లు" పేరిట ఈ నిరసన కార్యక్రమం మిన్నంటింది. మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి కార్యాలయం నుండి శ్రీనివాస సెంటర్ వరకు వేలాది మంది కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించారు. శ్రీనివాస సెంటర్ వద్ద దివంగత ముఖ్యమంత్రి డా. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వ మోసాలకు నిరసనగా నాయకులు ఎడ్లబండ్లు ఎక్కి, గాడిదలపై పచ్చ గుడ్డలు కప్పి వినూత్న రీతిలో తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ భారీ నిరసన కార్యక్రమంలో మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, సీఈసీ సభ్యులు పీపీ నాగిరెడ్డి, సాయినాథ్ రెడ్డి, రామలింగారెడ్డి, శ్రీశైలం నియోజకవర్గ పరిశీలకుడు పీపీ మధుసూధన్ రెడ్డి, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రత్నబాబు చౌదరి, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి శశికళారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నీసా, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్లు పురుషోత్తం రెడ్డి, విజయశేఖర్ రెడ్డి, మహేశ్వరరెడ్డి, ఎంపీపీలు శెట్టి ప్రభాకర్, ఆర్థర్ సైమన్, వైసీపీ నంద్యాల, గోస్పాడు మండలాల అధ్యక్షులు బసవేశ్వరరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, వైసీపీ నాయకులు ప్రహల్లాదరెడ్డి, రామసుబ్బారెడ్డి, రాష్ట్ర ఎస్టీ సెల్ సెక్రెటరీ శంకర్ నాయక్, జిల్లా కార్యవర్గ సభ్యులు, నంద్యాల నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు, మాజీ సర్పంచ్లు, మాజీ ఎంపీటీసీలు, మాజీ కౌన్సిలర్ లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు.కూటమి ప్రభుత్వ తీరుపై మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు నిప్పులు చెరిగారు....అధికారంలోకి వస్తే ఆడబిడ్డ నిధి కింద 1500 రూపాయలు, నిరుద్యోగ భృతి కింద 3000 రూపాయలు, తల్లికి వందన కింద 15 వేలు ఇస్తామని చెప్పి ఇప్పుడు లబ్ధిదారులను కుదించి ప్రజలను వంచించారని మండిపడ్డారు. గత వైసీపీ ప్రభుత్వంలో రైతులకు మద్దతు ధర ఇచ్చి పంటలు కొనుగోలు చేస్తే.. నేడు కూటమి ప్రభుత్వంలో రైతులకు యూరియా, సాగునీరు అందక రోడెక్కి నిరసనలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. 'అన్నదాత సుఖీభవ' కింద 20 వేలు ఇస్తామని చెప్పి మోసం చేశారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి ప్రజల నడ్డి విరిచారని.. అభివృద్ధిని గాలికి వదిలేసి ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతికి తెరలేపారని విమర్శించారు. డీఎస్సీ స్పోర్ట్స్ కోటా అవినీతిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు.డా. వైఎస్సార్ విగ్రహాన్ని మళ్లీ ప్రతిష్ఠిస్తాం: శిల్పా రవిరెడ్డి సవాల్....నంద్యాల



శ్రీనివాస సెంటర్లో డా. వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేయడంపై శిల్పా రవిరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి విధ్వంసాలు కూటమి ప్రభుత్వంలోనే జరగడం శోచనీయమన్నారు."విగ్రహ విధ్వంసం జరిగిన చోటే.. నంద్యాల ప్రజల సాక్షిగా డా. వైఎస్సార్ కాంస్య విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించి తీరుతా. ఎవరైనా అడ్డుకుంటే ఊరుకునేది లేదు. ప్రభుత్వం బాధ్యత తీసుకోకపోతే నా సొంత ఖర్చులతోనే విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి సవాల్ చేశారు. అధికార బలంతో వైఎస్సార్ కళ్యాణ మండపం, శిల్పా సహకార్ సూపర్ మార్కెట్ దుకాణాలను లాక్కున్నారని.. శిల్పా సేవా కార్యక్రమాలను అడ్డుకోవాలని చూస్తే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. జర్నలిస్టులకు ఇస్తామన్న 5 సెంట్ల ఇళ్ల స్థలాల హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో వైఎస్సార్సీపీ మళ్లీ అధికారం చేపట్టడం ఖాయమని, కార్యకర్తలు ధైర్యంగా ప్రజా సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ఎమ్మెల్సీలు ఇసాక్ బాష, కల్పలతా రెడ్డి కూటమి ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చలేదని, ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారని విమర్శించారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం చేశారని, ప్రధానంగా రైతులు, యువత, మహిళలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని ఆరోపించారు. రాష్ట్రంలో అవినీతి, అరాచకాలు, దౌర్జన్యాలు పేట్రేగిపోతున్నాయని, ప్రజలకు వైసీపీ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు వైసీపీ భలోపేతాలనికి అహర్నిషలు పనిచేయాలని రాన్ను రోజుల్లో వైసీపీ అధికారం చేపట్టడం జరుగుతుందని భరోసానిచ్చారు. రెండేళ్ల పాలనలో కూటమి ప్రజలకు చేసిన వెన్నుపోటును విస్తృతంగా ప్రచారం చేయాలని కూటమి ప్రభుత్వాన్ని గద్దె దింపాలని పిలుపునిచ్చారు.

# నమ్మకానికి ప్రతిరూపంగా - ఎన్డీయే కూటమి!

-తెలుగుదేశం పార్టీ,శ్రీకాళహస్తి నియోజకవర్గం

తెలంగాణ గాండీవం దినపత్రిక జూన్ 12

శ్రీకాళహస్తి.ప్రతి కుటుంబానికి భరోసా కల్పిస్తూ, ప్రతి ప్రాంతానికి అభివృద్ధి ఫలాలు అందిస్తూ, సంక్షేమాన్ని ప్రజల చెంతకు చేర్చి రెండేళ్లలో ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ఎన్డీయే కూటమి ప్రభుత్వం నమ్మకానికి ప్రతిరూపంగా నిలిచిందని శ్రీకాళహస్తి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు కొనియాడారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్నిర్మాణం కోసం గత రెండు సంవత్సరాలుగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం చేస్తున్న అనేక సంక్షేమ మరియు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలతో కలిసి పంచుకోవడానికి తిరుపతి సమీపంలోని దామినేడు వద్ద ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి నాయకత్వంలో శ్రీకాళహస్తి నియోజకవర్గం నుండి విశేషంగా తరలివచ్చి విజయవంతం చేయడం జరిగిందని తెలిపారు.పేద ప్రజల కడుపు నిండితేనే జీవితం ముందుకు సాగుతుందనే భావనతో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్లను పునరుద్ధరించడం జరిగిందని, కేవలం రూ.5 లకే నాణ్యమైన భోజనం అందిస్తూ రాష్ట్రవ్యాప్తంగా 269 అన్న క్యాంటీన్ల ద్వారా 9 కోట్లకు పైగా భోజనాలు పెట్టి, రెండేళ్ల కూటమి పాలనలో పేదల కడుపు నింపిన గొప్ప సంక్షేమ కార్యక్రమంగా అన్న క్యాంటీన్ సేవలు చరిత్రలో నిలిచిపోతాయని గర్వంగా చెబుతున్నారు. రైతు బాగుంటేనే సమాజం బాగుంటుందని, సమాజం బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందనే మహోన్నత సంకల్పంతో చంద్రబాబు నాయుడు మరియు పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం, నరేంద్ర మోడీ సహకారంతో "అన్నదాత సుఖీభవ" పథకాన్ని అమలు చేస్తూ, కేవలం రెండేళ్ళ సుపరిపాలనలోనే దాదాపు 46 లక్షల మంది రైతులకు రూ.8,985 కోట్ల ఆర్థిక సాయం అందించడం ద్వారా వ్యవసాయానికి అండగా నిలిచిన ఘనత ఎన్డీయే కూటమి యొక్క డబుల్ ఇంజిన్ సర్కార్ దే అని కొనియాడారు.పేదల సొంతింటి కలను సాకారం చేస్తూ ఎన్డీయే కూటమి ప్రభుత్వం రెండేళ్ళ పాలనలో 5.5 లక్షల ఇళ్లను అందించిందని, మరో 5 లక్షల ఇళ్ల నిర్మాణానికి సిద్ధమవుతూ వేలాది కుటుంబాలకు శాశ్వత గృహ భరోసా కల్పిస్తున్న గొప్ప ప్రభుత్వం చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీయే కూటమిదే అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు డా.యం.ఉమేష్ రావు, కాసరం రమేష్,వజ్రం కిషోర్,డిల్లీ బాబు, పేట బాలాజీ,కుమార్,కోట చంద్రశేఖర్, యం.యస్.రెడ్డి,అనిల్,రాము,రామ్మూర్తి, రాకేష్,నవీన్, కోలా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



# విడాకుల కేసులో ఊహించని మలుపు:

మామ ప్రాణం కాపాడిన అల్లుడు..

కోర్టులోనే విడాకుల పత్రాలు చింపేసిన భార్య!

తెలంగాణ గాండీవం దినపత్రిక జూన్ 12

జీవితం ఎప్పుడు ఏ మలుపు తిరుగుతుందో ఎవరూ ఊహించలేరు. అహంకారాలు, మనస్పర్థలతో విడిపోయిన బంధాలను కాలం ఒకే ఒక్క ఘటనతో మళ్లీ ఎలా ముడివేస్తుందో చెప్పడానికి ఈ ఘటనే ఒక నిదర్శనం. చిన్న చిన్న కారణాలతో కోర్టుల చుట్టూ తిరుగుతూ విడాకులు తీసుకుంటున్న నేటి కాలపు జంటలకు, దిల్లీకి చెందిన శిఖ, సౌరభ్ల కథ ఒక గొప్ప కనువిప్పుగా నిలుస్తోంది.

**వరకట్నం కేసు.. చితికిపోయిన కుటుంబం**

దిల్లీకి చెందిన శిఖ సింగ్, సౌరభ్ల వివాహం 2020లో జరిగింది. అయితే, పెళ్లైన కొద్దిరోజులకే వీరి మధ్య మనస్పర్థలు రావడంతో గొడవలు మొదలయ్యాయి. ఈ క్రమంలోనే శిఖ తన భర్తపై వరకట్నం కేసు పెట్టి విడాకులకు దరఖాస్తు చేసింది. కూతురు కేసు కోసం శిఖ తండ్రి తన జీవితాంతం సంపాదించిన డబ్బునంతా లాయర్ల ఫీజులు, కోర్టు ఖర్చులకే తగలేశాడు. ఒకవైపు కూతురు కాపురం ముక్కలైందనే బాధ, మరోవైపు ఆర్థిక ఇబ్బందులు ఆయనను తీవ్ర ఒత్తిడికి గురిచేశాయి. ఈ క్రమంలోనే ఆయన ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది.

**ప్రాణాపాయ స్థితిలో మామ.. అండగా నిలిచిన అల్లుడు**

కనీసం చికిత్స చేయించుకోవడానికి కూడా డబ్బు లేని స్థితిలో, శిఖ తండ్రికి హఠాత్తుగా గుండెపోటు వచ్చింది. ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లే స్తోమత లేక, శిఖ తన తండ్రిని ఒక ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి, ఆయన బతుకుతాడో లేదోనని కన్నీరుమున్నీరుగా విలపించసాగింది.



ఈ విషయం తెలిసిన వెంటనే భర్త సౌరభ్ కోపతాపాలను పక్కనపెట్టాడు. మానవత్వంతో స్పందించి వెంటనే ఆ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నాడు. తన మామగారిని అక్కడి నుండి తరలించి, గుర్గావ్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన 'మేదాంత' ఆసుపత్రిలో చేర్పించాడు. తన సొంత ఖర్చులతో మెరుగైన వైద్యం అందించడంతో శిఖ తండ్రి పూర్తిగా కోలుకుని, ఆరోగ్యంగా ఇంటికి తిరిగొచ్చారు.

**కోర్టులోనే భావోద్వేగ దృశ్యం.. వైరల్ వీడియో**

ఆ తర్వాత దిల్లీ కోర్టులో వీరి విడాకుల కేసు తదుపరి విచారణకు వచ్చింది. కోర్టుకు చేరుకున్న శిఖ.. కష్టకాలంలో తమకు అండగా నిలిచి, తండ్రి ప్రాణాలు కాపాడిన భర్త మనసును అర్థం చేసుకుంది. జడ్జి ముందే

# చీరాల మండలం ఈపూరుపాలెంలో ఓ ప్రైవేటు ఐటీఐ కళాశాలలో శుక్రవారం కత్తిపోట్ల ఘటన కలకలం రేపింది.

కళాశాలలో పనిచేస్తున్న సిబ్బందిపై మాజీ ప్రిన్సిపల్ అబ్దుల్ సత్తార్ కత్తితో దాడి

తెలంగాణ గాండీవం దినపత్రిక జూన్ 12



ఈ దాడిలో ఒకరు మృతిచెందగా,మరికరి పరిస్థితి విషమంగా ఉంది.క్షతగాత్రులను హుటాహుటిన చీరాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.. ఈపూరుపాలెం ఎస్కె బ్రహ్మానాయుడు ఐటిఐ కాలేజీలో జరిగిన ఈ ఘటనతో గ్రామ ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.మాజీ ప్రిన్సిపల్ అబ్దుల్ సత్తార్ కి ప్రస్తుతం ఉన్న యాజమాన్యానికి కొంతకాలంగా ఆర్థిక లావాదేవీలు విషయంలో వివాదాలు జరుగున్నాయి.. కమిటీ మీటింగ్ జరుగుతున్న సమయంలో కళాశాలలోకి కొడుకు జిలానితో కలసి చేరుకున్న అబ్దుల్ సత్తార్ కమిటీ మెంబర్స్ పై కత్తితో దాడి చేశారు..ఈ దాడిలో హుస్సేన్( 55) మృతిచేందగా.. ప్రిన్సిపల్ శేషయ్య పరిస్థితి విషమంగా ఉంది.పోలీసులు విచారణ చేపట్టారు...

# తెలంగాణలో ప్రభుత్వ స్కూల్ విద్యార్థులకు ఉచితంగా వర్క్ బుక్స్...

తెలంగాణ గాండీవం దినపత్రిక జూన్ 12


ఈ 2026-27 విద్యా సంవత్సరం నుండి 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు కూడా వర్క్ బుక్స్ పంపిణీ...కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, గురుకులాల్లోని సుమారు 12 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం...జులై మొదటి వారంలోగా పంపిణీ పూర్తి చేయాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశం...




# వన్డే ప్రపంచ కప్ 2027 షెడ్యూల్ విడుదల

తెలంగాణ జూన్ 12: గాండీవం

2027 వన్డే ప్రపంచ కప్ షెడ్యూల్?ను ఐసీసీ విడుదల చేసింది. గురువారం అహ్మదాబాదులో జరిగిన ఐసీసీ బోర్డు సమావేశంలో మ్యాచ్‌ల నిర్వహణ తేదీలను ప్రకటించారు. వచ్చే ఏడాది అక్టోబర్ 4 నుంచి నవంబర్ 21 వరకు దాదాపు 48 రోజుల పాటు ఈ టోర్నీ కొనసాగుతుంది. చాలా వరకు మ్యాచ్‌లు దక్షిణాఫ్రికాలో జరుగుతాయి, మొత్తం 54 మ్యాచ్‌లలో 41 దక్షిణాఫ్రికాలో, 8 నుంచి 10 జింబాబ్వేలో, మిగిలిన 3 నమీబియాలో నిర్వహిస్తారు. గతంలో 10 జట్లు పాల్గొన్న ఈ టోర్నీలో, 2027లో మళ్లీ 14 జట్ల విధానాన్ని అమలు చేస్తున్నారు....



# జూదంపై తర్లుపాడు పోలీసుల ఉక్కుపాదం...

కేతగుడిపి శివారులో ఆరుగురు పట్టివేత

తెలంగాణ జూన్ 12, గాండీవం :

అక్రమ జూదం మరియు అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనే లక్ష్యంగా మార్కాపురం జిల్లా తర్లుపాడు పోలీస్ స్టేషన్ ఎస్సై గారు కేతగుడిపి గ్రామ శివారులో జూదంపై ప్రత్యేక దాడి నిర్వహించారు.ఈ దాడిలో జూదానికి పాల్పడుతున్న 6 మంది వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.వారి వద్ద నుంచి రూ.1,010 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు. జూదం వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలు కుటుంబాలు, యువత మరియు సమాజంపై ప్రతికూల ప్రభావం చూపుతాయని పోలీసులు తెలిపారు. జిల్లాలో జూదం, మట్కా, క్రికెట్ బెట్టింగ్ మరియు ఇతర అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని పేర్కొన్నారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో జూదం లేదా ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలు గమనించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు...



# ఏప్రిల్ 9వ తేదీలోగా అందరికీ రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లిస్తామని చెప్పారు కదా? ఇంకా ఎందుకు చెల్లించలేదు?

రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ అంశంలో ప్రభుత్వంపై హైకోర్టు మరోసారి ఆగ్రహం

తెలంగాణ జూన్ 12: గాండీవం

ఏప్రిల్ 9వ తేదీ లోగా అందరికీ బెనిఫిట్స్ చెల్లిస్తామని చెప్పి, ఇప్పటివరకు చెల్లించలేదని ఆర్థిక శాఖపై దాఖలైన కోర్టు ధిక్కరణ పిటిషన్ ఈ పిటిషన్ విచారిస్తూ ఆర్థిక శాఖపై ఆగ్రహం వ్యక్తం చేసిన హైకోర్టు ఇంతవరకు ఎంతమంది రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్ ఇచ్చారు, ఇంకా ఎంతమందికి ఇవ్వాలి, టోకెన్లు ఎంతమందికి ఇచ్చారు అనే వివరాలతో 2 వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శికి హైకోర్టు ఆదేశాలు




# "నిరసన నినాదాలతో మారుమోగిన ప్రత్తిపాడు..!"

"చంద్రబాబు రెండేళ్ల వెన్నుపోటును గుర్తు చేస్తూ భారీ నిరసన ర్యాలీ నిర్వహించిన - బలసాని"

తెలంగాణ గాండీవం దినపత్రిక జూన్ 12

ప్రత్తిపాడు నియోజకవర్గం, ఈరోజు ఉదయం, మాజీ ముఖ్యమంత్రి వర్యులు గౌరవ వై.యస్.ఆర్ సీ.పీ అద్యక్షులు "శ్రీ వై.యస్ జగన్ మోహన్ రెడ్డి" గారి ఆదేశాల మేరకు, ప్రత్తిపాడు మండలం, ప్రత్తిపాడు గ్రామంలో, చంద్రబాబు రెండేళ్ళ వెన్నుపోటును ప్రజలకు గుర్తు చేస్తూ "భారీ నిరసన ర్యాలీ" నిర్వహించిన, ప్రత్తిపాడు నియోజకవర్గ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త "శ్రీ బలసాని కిరణ్ కుమార్" గారు. ముందుగా, (మల్లయపాలెం రోడ్డులో) గల దివంగత ముఖ్యమంత్రి, మహానేత "వై.యస్ రాజశేఖరరెడ్డి" గారి విగ్రహానికి పూల మాలల వేసి నివాళులు అర్పించి, అక్కడి నుండి నియోజకవర్గ ప్రజలతో వేలాదిగా భారీ ర్యాలీగా బయలుదేరి, చంద్రబాబు కూటమి ప్రభుత్వ వైఫల్యాలను, అబద్ధపు హామీల నినాదాలతో ప్రజలకు గుర్తు చేస్తూ, న్యూ పెట్రోల్ బంక్ వద్ద గల "డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్" గారి విగ్రహం వరకు భారీ ర్యాలీతో చంద్రబాబు కూటమి ప్రభుత్వంపై నిరసన తెలపటం జరిగినది.ఈ కార్యక్రమంలో, ప్రత్తిపాడు నియోజకవర్గ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ, మండల పార్టీ అధ్యక్షులు మరియు రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ మరియు మండల, గ్రామ, డివిజన్ స్థాయిలో వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, అనుబంధ విభాగాల వారు మరియు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు. "ఇట్లు""ప్రత్తిపాడు నియోజకవర్గ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం."



# ఒకరికి ఆత్మీయ వీడ్కోలు.. మరొకరికి ఘన స్వాగతం

హసకొత్తూర్‌లో ఎస్సై అనిల్ రెడ్డికి సన్మానం  నూతన ఎస్సై సీహెచ్ సతీష్‌కు

స్వాగతం పలికిన పోలీసులు, ప్రజాప్రతినిధులు

**కమ్మర్‌పల్లి, జూన్ 12: గాండీవం**

నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలంలోని హసకొత్తూర్ గ్రామంలోని గురడి రెడ్డి కళ్యాణ మండపంలో శుక్రవారం భావోద్వేగ వాతావరణంలో వీడ్కోలు,స్వాగత సభ నిర్వహించారు.బదిలీపై వెళ్తున్న కమ్మర్‌పల్లి ఎస్సై అనిల్‌రెడ్డికి ఆత్మీయ వీడ్కోలు సన్మానం నిర్వహించగా, నూతనంగా కమ్మర్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చిన ఎస్సై సీహెచ్ సతీష్‌కు ఘన స్వాగతం పలికారు.ఈ కార్యక్రమానికి భీంగల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పొన్నం సత్యనారాయణ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా మాట్లాడిన పలువురు ప్రజాప్రతినిధులు,పోలీసు సిబ్బంది ఎస్సై అనిల్‌రెడ్డి తన విధి నిర్వహణలో నిష్పాక్షికత,ప్రజలతో స్నేహపూర్వక వైఖరి,శాంతిభద్రతల పరిరక్షణలో చూపిన చొరవతో ప్రజల మనసులు గెలుచుకున్న అధికారిగా గుర్తింపు పొందారని కొనియాడారు.అదే సమయంలో నూతన ఎస్సై సీహెచ్ సతీష్‌కు పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించి స్వాగతం పలికారు.కమ్మర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉండి సమర్థవంతమైన పోలీసింగ్ అందిస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పాలేపు నర్సయ్య,కాంగ్రెస్ పార్టీ డిస్టిక్ కిషన్ కేత్ ఉపాధ్యక్షులు ప్రవీణ్ రెడ్డి,మార్కెట్ కమిటీ డైరెక్టర్ జై డి శ్రీనివాస్,వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,వివిధ పార్టీ నాయకులు,సర్పచ్ లు,పోలీసు సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.




# నీట్ రీటెస్ట్ లో ఎన్టీఏ కీలక మార్పులు..! సమయం పెంపు..!

**తెలంగాణ  గాండీవం దినపత్రిక జూన్ 12**

ఈఏడాది వైద్య విద్య ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ యూజీ పరీక్ష (చీజుజు ఖ+ 2026)ప్రశ్నాపత్రం లీక్ కావడంతో జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ దాన్ని రద్దు చేసింది.ఇప్పుడు జూన్ 21న మరోసారి పరీక్ష (చీజుజు తీవీవర్ 2026) నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. అయితే ఈసారి పరీక్షలో కొన్ని మార్పులు చేస్తోంది. వీటిని ఇవాళ ఓ ప్రకటన ద్వారా వెల్లడించింది. కాబట్టి ఈసారి నీట్ పరీక్ష రాసే అభ్యర్థులు వీటిని గమనించాల్సి ఉంటుంది.నీట్ పరీక్షను పారదర్శకంగా, సురక్షితంగా, అభ్యర్థుల అవసరాలకు అనుగుణంగా నిర్వహించేందుకు కట్టుబడి ఉన్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తెలిపింది. ఈ ప్రయత్నంలో భాగంగా జూన్ 21న జరగనున్న చీజుజు (ఖ+) 2026 పరీక్ష కోసం అభ్యర్థులకు అనుకూలమైన కొన్ని మార్పులు ప్రవేశపెడుతున్నట్లు వెల్లడించింది. గత కొన్నేళ్లుగా అభ్యర్థుల నుండి వచ్చిన అభిప్రాయాల ఆధారంగా, పరీక్ష సమయాన్ని 195 నిమిషాలకు పొడిగించారు. దీంతో మధ్యాహ్నం 2:00 గంటల నుండి సాయంత్రం 5:15 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. అలాగే హాజరు పత్రాలపై సంతకాలు చేయడం, ఇతర పర్యవేక్షణ (అఅజఅస్త్రఅశ్రీఫ్‌అశీఅ) ప్రక్రియల వంటి తప్పనిసరి పరీక్షా లాంఛనాలకు అవసరమైన సమయం కూడా ఇందులో కలిసి ఉంటుంది. పరిపాలనాపరమైన ప్రక్రియల వల్ల పరీక్ష రాసే అవకాశం తగ్గుతుందనే భావన లేకుండా, అభ్యర్థులు కేటాయించిన పరీక్ష సమయాన్ని పూర్తిగా వినియోగించుకునేలా ఈ సవరించిన సమయ విధానాన్ని రూపొందించారు. అదనంగా ప్రశ్నపత్రం బుక్‌లెట్‌లో 'రఫ్ వర్క్' (తీశీబస్త్రష్ట షశీతీఎ) కోసం కేటాయించిన స్థలాన్ని కూడా పెంచుతున్నట్లు ఎన్టీఏ తెలిపింది.




# లారీ, కారు ఎదురెదురుగా ఢీ

## ప్రమాదంలో ఇద్దరు మృతి

## మరో ముగ్గురికి తీవ్ర గాయాలు

**జనగామ,జూన్12 గాండీవం**

జనగామ జిల్లా లింగాలఘనపురం మండలంలోని నవాబుపేట వద్ద జనగామ–సూర్యాపేట జాతీయ రహదారిపై గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ఘటనలో మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేటకు చెందిన ఎండీ ఇమ్రాన్, ఎండీ సుభాని, హనుమకొండకు చెందిన మాజీద్, సమీర్, ఖమ్మం జిల్లాకు చెందిన ఎండీ నూర్ బంధుమిత్రులు కలసి మిర్యాలగూడలో జరిగిన వివాహ వేడుకలో పాల్గొని కారులో తిరిగి వస్తున్నారు. జనగామ వైపు నుంచి సూర్యాపేట వైపు ధాన్యం లోడుతో వెళ్తున్న లారీ, కారు నవాబుపేట గ్రామం ప్రధాన కూడలి మూలమలుపులో ఎదురెదురుగా ఢీకొన్నాయి. కారు అమాంతం లారీ కిందకు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న సుభాని(30) ప్రమాద స్థలంలోనే మృతి చెందాడు. 108లో తరలిస్తుండగా ఇమ్రాన్(28) మృతి చెందాడు. మాజీద్, నూర్, సమీర్‌లను 108 సిబ్బంది జనగామ జిల్లా ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులను వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బండి శ్రవణ్ కుమార్ తెలిపారు.




# ఒత్తిడి కోరల్లో సచివాలయ ఉద్యోగులు

గుంటూరులో అడ్మిన్ సెక్రటరీకి బ్రెయిన్ స్ట్రోక్!

పనుల భారంతో కుప్పకూలుతున్న సిబ్బంది..

రాత్రి 10 గంటల వరకు ఉన్నతాధికారుల వేధింపులు..

జి.ఎం.సి.లో వింత తీరుపై ఆగ్రహం..

**తెలంగాణ జూన్ 12: గాండీవం**

రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన సచివాలయ వ్యవస్థ, ఇప్పుడు అధికారుల మితిమీరిన ఒత్తిడితో ఉద్యోగుల పాలిట యమపాశంగా మారుతోంది. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను గమనించకుండా, కేవలం టార్గెట్ల వేటలో ఉన్నతాధికారులు వేధిస్తుండటంతో సిబ్బంది ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. దీనికి నిదర్శనమే గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 162వ వార్డు సచివాలయంలో చోటుచేసుకున్న విషాద ఘటన.

**వరుస సర్వేల సెగ.. ప్రాణం మీదకు!**

162వ వార్డు అడ్మిన్ సెక్రటరీగా పనిచేస్తున్న నాగూర్ గత కొంతకాలంగా విపరీతమైన పని ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. కేవలం సాధారణ సచివాలయ పనులే కాకుండా..ా×= (ాజూవఎఋశ్రీ ×త్‌వఅంఅజవ =వజఅంఅశీఅ), దీూా (దీశీశ్రీష్ట ావజవశ్రీ ాటటఅఎవతీ) విధులు యోగాంధ్ర, వఖ్‌జ, ఖఖీూ (ఖఅఅటఅవఎ ఖీశీబఅఎ్‌అశీఅ ాబతీజవఎ) అక్షరాంధ్ర, తల్లికి వందనము వంటి అనేక రకాల సర్వేలు ఆయనపై అదనపు భారాన్ని మోపాయి. వీటికి తోడు 'స్వర్ణ వార్డు', 'స్వర్ణ సచివాలయం' పేరుతో వస్తున్న కొత్త నిబంధనలు సిబ్బందికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఈ ఒత్తిడి తట్టుకోలేక నాగూర్ గారు అకస్మాత్తుగా పక్షవాతం (ఋఖీఋశ్రీఎంఅం కేఖీశీనివ) బారిన పడ్డారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి ఆందోళనకరంగా ఉంది.



**సూపర్‌వైజర్లు ఎక్కువ.. పనిచేసే వారు తక్కువ!**

జి.ఎం.సి. (+వీజ) కార్యాలయంలో వింత పరిస్థితి నెలకొంది. పనులు చేసే సిబ్బంది సంఖ్య తక్కువగా ఉంటే, వారిని పర్యవేక్షించే (ాబజూవతీజఅంశీతీం) అధికారుల సంఖ్య మాత్రం అధికంగా ఉంది. ఉన్న కొద్దిమంది సిబ్బందిని కూడా వేరే విభాగాలకు డెప్యూటేషన్ (ఱవజూఒ్‌ఆశీఅ) పై పంపించడంతో, మిగిలిన వారిపై పని భారం రెట్టింపు అవుతోంది. తక్కువ మందితో ఇన్ని రకాల సర్వేలు ఎలా సాధ్యమని ప్రశ్నిస్తే, అధికారుల నుంచి వేధింపులు తప్పడం లేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రాత్రి 10 గంటల వరకు 'క్లాసుల' పర్వం!**

ఒకవైపు సర్వేలు తక్కువగా ఉన్నాయని సాకులు చెబుతూ, మరోవైపు సచివాలయ సిబ్బందిని రాత్రి 7 గంటల సమయంలో కార్పొరేషన్ కార్యాలయానికి పిలిపిస్తున్నారు. అక్కడ రాత్రి 10గంటల వరకు ఉంచి, అసభ్య పదజాలంతో తిట్టడం నిత్యకృత్యంగా మారింది. జి.ఎం.సి.లోని ఒక ఉన్నతాధికారి తీరు వల్లే ఈ వేధింపులు పెరిగిపోయాయని, ఉద్యోగుల కనీస వ్యక్తిగత జీవితం కూడా నాశనమవుతోందని సిబ్బంది వాపోతున్నారు.

**డిమాండ్:**

పని ఒత్తిడితో ఆరోగ్యం క్షీణించి ఆసుపత్రి పాలైన నాగూర్ గారికి ప్రభుత్వం అండగా నిలవాలని, సచివాలయ సిబ్బందిపై ఉన్న ఈ అమానవీయ ఒత్తిడిని వెంటనే తగ్గించాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. డెప్యూటేషన్లను రద్దు చేసి సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించకపోతే ఆందోళన తప్పదని హెచ్చరిస్తున్నారు....

# అభివృద్ధి పథంలో ఆంధ్రప్రదేశ్ కూటమి రెండేళ్ల పాలనపై ఎంపీ పుట్టా మహేష్ కుమార్.

**?ఏలూరు, జూన్ 12: గాండీవం**




ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం విజయవంతంగా రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసిన ఎంపీ, గత ప్రభుత్వ విధ్వంస పాలన వల్ల నిర్వీర్యమైన వ్యవస్థలన్నింటినీ చక్కదిద్దుతూ అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన లక్ష్యంగా రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, యువనేత రాష్ట్ర ఐటీ విద్యా శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ లకు ఎంపీ అభినందనలు తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నుంచి తమ మద్దతును అందిస్తూ, కూటమి ప్రభుత్వానికి నిరంతరం సహకరిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ, అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా ప్రజారంజక పాలన అందిస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజల సంపూర్ణ మద్దతు ఉంటుందని విశ్వాసం వ్యక్తం చేసిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్.. ప్రజల విశ్వాసంతో ప్రారంభమైన ఈ ప్రయాణం మరిన్ని విజయాలు సాధించి, స్వర్ణాంధ్ర లక్ష్యాన్ని చేరుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు తన ప్రకటనలో వెల్లడించారు. ప్రధాని, ముఖ్యమంత్రి స్ఫూర్తితో ఏలూరు పార్లమెంట్ అభివృద్ధికి చిత్తశుద్ధితో తన కృషిని కొనసాగిస్తానని ఈ సందర్భంగా ఎంపీ పుట్టా మహేష్ కుమార్ స్పష్టం చేశారు.

# విటుడి పై 'ట్రాఫికింగ్' చెల్లదు-తెలంగాణ హై కోర్టు

**హైదరాబాద్ :జూన్ 12: గాండీవం**

సెక్స్ వర్కర్ సేవలు పొందిన వ్యక్తిని కేవలం విటుడు అన్న కారణంతో ఐపీసీ సెక్షన్ 370 (ట్రాఫికింగ్/మానవ అక్రమ రవాణా) కింద నేరస్తుడిగా పరిగణించలేమని హైకోర్టు స్పష్టం చేసింది. అయితే కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఐపీసీ సెక్షన్ 370ఏ(2) కింద అతనిపై చర్యలు తీసుకోవచ్చని పేర్కొంది. సదరు సెక్స్ వర్కర్.. అక్రమ రవాణాకు గురైన మహిళ అనే విషయం అతనికి తెలిసినా లేదా తెలిసేందుకు అవకాశమున్నా సెక్షన్ 370(ఏ)(2) వర్తిస్తుందని చెప్పింది.




# 25 నుంచి ఇంటింటి సర్వే గణన

## సర్ ప్రక్రియకు పార్టీలన్నీ సహకరించాలి

## రాజకీయ పార్టీల నేతలతో ఎన్నికల కమిషనర్ సుదర్శన్ రెడ్డి

**హైదరాబాద్,జూన్12 గాండీవం**



ఈ నెల 25 నుండి జరగబోయే ప్రత్యేక సమగ్ర సవరణ సర్వే కార్యక్రమానికి పూర్తి సహాయ సహకారాలు అందజేసి సర్వే కార్యక్రమం సజావుగా జరిగేవిధంగా అన్ని రాజకీయ పార్టీలను తెలంగాణ ఎన్నికల కమిషనర్ సి. సుదర్శన్ రెడ్డి కోరారు. శుక్రవారం బి ఆర్ కె భవన్ లోని సిఇఓ కార్యాలయంలో ఎస్ఐఆర్ పక్రియపై అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన సిఇఓ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం అర్హులైన పౌరులను ఓటర్ల జాబితాలో చేర్చి, అనర్హులను తొలగించి స్వచ్ఛమైన ఓటరు జాబితాను తయారు చేసేందుకే ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని చేపట్టిందని, దీనికి అన్ని రాజకీయ పార్టీల వారు రాష్ట్రంలో సజావుగా నిర్వహించేందుకు తమ సహాయసహకారాలు అందజేయాలని సిఇఓ కోరారు.  ఎస్ఐఆర్ పక్రియలో భాగంగా ఈనెల 25 నుండి జులై 24 వరకు ఇంటింటి సర్వే గణన ప్రారంభం కానునందున బిఎల్ఒలు తమ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను అందిస్తారని, వీటిని పూరించే  విషయంలో రాజకీయ పార్టీలు వారి బిఎల్ఎ ద్వారా సరైన విధంగా ఎన్యుమరేషన్ పక్రియను పూర్తి చేసేందుకు సహకారాలను అందించాలని, ఇందుకు సంబంధించి బిఎల్ఎలకు తగిన అవగాహన కల్పించాలని, ఎస్ఐఆర్ పై ప్రజలకు ఎలాంటి అపోహలు, అనుమానాలు కలుగకుండా ప్రజలకు తమవంతు బాధ్యతగా ఎస్ఐఆర్ ముఖ్య ఉద్దేశంపై అవగాహన కల్పించాలని సూచించారు. సర్వే జరిగే సమయంలో ఎలాంటి శాంతిభద్రతల సమస్య తెలెత్తకుండా సహకరించాలని కోరారు.

# రిజర్వేషన్లపై కేంద్రానికి నివేదిక సమర్పించనున్న జస్టిస్ బాలకృష్ణన్..

**న్యూఢిల్లీ, జూన్12: గాండీవం:**



మతం మారిన దళితులకు రిజర్వేషన్ల అమలుపై కేంద్రం నియమించిన సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి, జస్టిస్ కేజీ బాలకృష్ణన్ కమిషన్..తన నివేదికను సిద్ధం చేసింది. దళిత క్రైస్తవ, ముస్లింల ఎస్సీ హోదాతోపాటు మతం మారిన దళితులకు ఎస్సీ హోదా కల్పనపై జస్టిస్ బాలకృష్ణన్ కమిషన్ నివేదికను పూర్తి చేసింది. త్వరలో ఈ నివేదికను కేంద్ర ప్రభుత్వానికి ఈ కమిషన్ అందజేయనుంది. ఈ అంశాలపై దాదాపు నాలుగేళ్ల పాటు సుదీర్ఘ అధ్యయనం చేసి ఈ నివేదికకు జస్టిస్ కేజీ బాలకృష్ణన్ కమిషన్ రూపొందించింది.జస్టిస్ కేజీ బాలకృష్ణన్ కమిషన్ నివేదికపై దేశవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది. క్రైస్తవ, ఇస్లాం మతాల్లోకి మారిన దళితులకు ఎస్సీ హోదా ఇవ్వాలా? వద్దా? అనే అంశంపై ఈ కమిషన్ అధ్యయనం చేసింది. ప్రస్తుతం పుస్తక రూపంలో ఈ కమిషన్ నివేదిక ముద్రణలో ఉంది. మరి కొద్ది రోజుల్లో కేంద్రానికి ఈ నివేదికను కమిషన్ అందజేయనుంది. జూన్ 10వ తేదీతో జస్టిస్ కేజీ బాలకృష్ణన్ కమిషన్ గడువు ముగిసింది. అయితే మరో10 రోజులపాటు ఈ కమిషన్ గడువును కేంద్రం పొడిగించింది.మతం మారిన తర్వాత కూడా దళితులు సామాజిక వివక్షను ఎదుర్కుంటున్నారా? అనే అంశంపై ప్రజల్లోకి వెళ్లి ఈ కమిషన్ ఆరా తీసింది. 1950 నాటి రాజ్యాంగం ఉత్తర్వు ప్రకారం హిందూ, సిక్కు, బౌద్ధ మతాల్లోని దళితులకు మాత్రమే ఎస్సీ హోదా ఇస్తున్నారు. ముస్లిం, క్రైస్తవ మతాల్లోని దళితులకు కూడా ఎస్సీ హోదా కల్పించాలని చాలా కాలంగా దళిత సంఘాల డిమాండ్ చేస్తున్నాయి.ఇస్లాం, క్రైస్తవ మతాల్లో కుల వ్యవస్థ లేదంటూ ఇప్పటికే సుప్రీంకోర్టులో కేంద్రం అఫిడవిట్ దాఖలు చేసింది. ఇస్లాం, క్రైస్తవ మతాల్లో చేరిన దళితులకు రిజర్వేషన్లు వర్తించవని ఇటీవల సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు వెలువరించిన విషయం విదితమే. ఈ కమిషన్ సిఫార్సులపై దేశవ్యాప్తంగా అటు రాజకీయాల్లోనూ, ఇటు సామాజిక వర్గాల్లోనూ తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

# ప్రశంసా పత్రం అందుకున్న కానిస్టేబుల్ ముజమ్మిల్

**నారాయణఖేడ్, జూన్ 12 గాండీవం**

విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన నారాయణఖేడ్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ ముజమ్మిల్‌కు శనివారం ఎస్పీ పరితోష్ పంకజ్ ప్రశంసా పత్రాన్ని అందజేశారు. పోలీసు శాఖలో విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో చూపిన కృషిని గుర్తించి ఎస్పీ ఈ ప్రశంసా పత్రాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నారాయణఖేడ్ సిఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్సై రాసుల శ్రీశైలంతో పాటు సహచర పోలీసు సిబ్బంది ముజమ్మిల్‌ను అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా ఇదే సేవా స్ఫూర్తితో పనిచేయాలని ఆకాంక్షించారు.




# ఏపీలో పాఠశాలల పునఃప్రారంభం.. నేటి నుంచి తరగతులు షురూ

**తెలంగాణ  గాండీవం దినపత్రిక జూన్ 12**

ఏపీలో వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు నేటి నుంచి పునఃప్రారంభం కానున్నాయి. విద్యా సంవత్సరం మొదటి రోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అలాగే, మధ్యాహ్న భోజన పథకాన్ని యథావిధిగా అమలు చేయనున్నారు. విద్యార్థుల హాజరును పెంచడంపై దృష్టి సారించాలని, ఉపాధ్యాయులందరూ సకాలంలో విధులకు హాజరు కావాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.



# ప్రైవేట్ స్కూళ్ళను రద్దు చేయటమే పరిష్కారం!

**గాండీవం దినపత్రిక జూన్ 12**

నాణ్యమైన విద్య అందాలంటే దేశంలో ప్రైవేట్ పాఠశాలలను పూర్తిగా రద్దు చేయడం ఒక్కటే పరిష్కార మార్గంగా కనపడుతుంది. అప్పుడు ముఖ్యమంత్రుల పిల్లలు, మనుమలూ మనుమరాళ్ళు, అధికారుల పిల్లలు, ధనవంతుల పిల్లలు, పేద వారి పిల్లలు అందరినీ ప్రభుత్వ బడిలో మాత్రమే చదివించాల్సి వుంటుంది. దాంతో బడుల పని విధానం, సౌకర్యాలు, విద్య నాణ్యత అన్నీ మెరుగవుతాయి. మండలానికి ఆరు నుండి పది పాఠశాలలు పెట్టి మిగతా చిన్న గ్రామాలకు రవాణా వ్యవస్థ ఏర్పాటు చేయడం ద్వారా పాఠశాలల సంఖ్య తక్కువై, సౌకర్యాలు మెరుగై విద్యాప్రమాణాలను పెంపొందుతాయి.భారత రాజ్యాంగంలో పేర్కొన్నట్టు ప్రభుత్వమే అందరికీ నాణ్యమైన విద్యను అందించాలి. ఏ దేశంలో అయినా పేదరికం పోయిందంటే, బాగా అభివృద్ధి జరిగిందంటే దానికి పునాది పాఠశాల విద్య, కాలేజి విద్య, విశ్వవిద్యాలయ విద్య అనేది చారిత్రక సత్యం. కానీ మన దేశంలో ప్రభుత్వ పెద్దలు, రాజకీయ నాయకులు, కాంట్రాక్టులకిచ్చే ప్రాజెక్టు పనుల మీద ఉన్నంత శ్రద్ధ పిల్లలకు నాణ్యత కల్గిన చదువు చెప్పించడం మీద పెట్టలేకపోతున్నారు. సివిల్ ఇంజనీరింగ్ ప్రాజెక్టులు, రియల్ ఎస్టేట్ లావాదేవీలు ఎన్నికలకు అవసరమైన డబ్బు సమకూరుస్తాయి. సర్కారు బడుల మీద పెట్టే పెట్టుబడులు డబ్బులు రాల్చవు కదా! అందుకే రాజకీయ నాయకులకు విద్య మీద సమయం వెచ్చించడం శుద్ధ దండగ అనిపిస్తుంది. అయితే, రాజకీయ చిత్తశుద్ధి ఉంటే అందరికీ నాణ్యమైన విద్య అందించడం మనకు అసాధ్యమేమీ కాదు. ఎలానో చూద్దాం. నేను కలెక్టర్‌గా పని చేసిన ఒక జిల్లాలో ప్రైవేట్ విద్య, ప్రభుత్వ విద్య ఎలా ఉందో విశ్లేషించి చెబుతాను. జిల్లాలో వున్న ఒక ప్రైవేట్ బడిలో ప్రతి 38 మంది విద్యార్థులకు ఒక టీచరు వుంటే, ఆ జిల్లాలో ప్రభుత్వ బడులలో ప్రతి 17 మంది విద్యార్థులకు ఒక టీచర్ వున్నారు. ప్రైవేట్ యాజమాన్యం ప్రతీ విద్యార్థి మీద సగటున ప్రతి సంవత్సరం రూ.6,200 ఖర్చు పెట్టి (ప్రైవేట్ యాజమాన్యం తల్లిదండ్రుల నుండి ఎంత మొత్తం రాబడుతున్నది అనేది వేరే విషయం) 86 శాతం విద్యార్థులకు నాణ్యతలో 'ఏ' గ్రేడ్‌లో తీర్చి దిద్దగలిగితే, మన సర్కారు బడులలో ప్రభుత్వం సగటున విద్యార్థికి ప్రతీ సంవత్సరం రూ.35,000- ఖర్చు పెట్టినా 67శాతం విద్యార్థులు 'సీ' గ్రేడు కంటే దాటలేకపోతున్నారు. ప్రైవేట్ యాజమాన్యం ఒక టీచరుకు నెలకు రూ.5,000 -నుండి రూ.20,000 వరకు (సబ్జెక్టును బట్టి) చెల్లిస్తుంటే ప్రభుత్వం నెలకు ఒక టీచరుకు రూ.35000 నుండి రూ.1,20,000వరకు చెల్లిస్తుంది. మరి, లోపం ఎక్కడ వుంది? ప్రభుత్వ పరిపాలనలోనే అని చెప్పక తప్పదు. ఇదే జిల్లాలలో (వెనకబడిన జిల్లా) ఒక మండలంలో పరిస్థితి విశ్లేషిస్తే నాలుగు పెద్ద గ్రామాలలో వున్న ప్రైవేట్ బడులలో 4500 మంది విద్యార్థులు చదువుతూ ఉంటే అదే మండలంలో 36 గ్రామాలలో వున్న ప్రభుత్వ బడులలో 1400 మంది చదువుతున్నారు. ఆ మండలంలో పేద, మధ్య తరగతి తల్లిదండ్రులు అప్పులు చేసి సంవత్సరానికి ఒక్కొక్క విద్యార్థికి రూ.15,000 నుండి రూ. 30,000 వరకు ఫీజులు కడుతున్నారు. మిగతా మధ్యతరగతి కుటుంబాలు, ఒక మోతాదులో వున్న పెద్ద రైతులు వారి కుటుంబాలను పెద్ద పట్టణాలలో పెట్టి, పిల్లలను ప్రైవేట్ కాన్వెంట్ స్కూళ్లలో చదివించుకుంటున్నారు. 'ప్రభుత్వ బడులలో చదివించాలంటే నామోషీగా అనిపిస్తుంది' అని ఒక గ్రామంలో తల్లిదండ్రులు నాతో అన్నారు. పక్క ఇంటి వాళ్ల పిల్లలు టిప్ టాప్‌గా తయారై టై, బూట్లు వేసుకొని మండల కేంద్రంలోని ప్రైవేట్ బడికి వ్యాన్‌లో పోతుంటే మా పిల్లలను దీనావస్థలోవున్న ఊళ్లోని ప్రభుత్వ బడికి ఎలా పంపించాలని వారు వాపోయారు. ఇటీవలి కాలంలో వాట్సాప్‌లో ఒక 'బొమ్మ' విస్తృతంగా ప్రచారంలోకి వచ్చింది. ప్రైవేట్ బడి భవనం బ్రహ్మాండంగా వుంటుంది కాని ప్రైవేట్ టీచరు ఒక పెంకుటింటిలో నివసిస్తుంటారు. అదే ప్రభుత్వ బడి విషయానికి వస్తే ప్రభుత్వ బడి భవనం అధ్వాన్న స్థితిలో వుంటుంది. కాని ప్రభుత్వ టీచరు ఇల్లు జిల్లా ముఖ్య పట్టణంలో బ్రహ్మాండంగా వుంటుంది.పరిస్థితిని అర్థం చేసుకోవడానికి చాలా చక్కని ఉదాహరణ అది. మరో సంఘటన-- నేను 16 సంవత్సరాల క్రితం చైనాకు వెళ్ళినప్పుడు గ్రామాలలో నాకు కనిపించిన దృశ్యాన్ని ఇక్కడ ప్రస్తావించుకోవాలి. అక్కడ గ్రామంలో ఆధునికమైన భవనంలో ప్రభుత్వ బడులు, ప్రభుత్వం కట్టించిన భవనాలలో టీచర్లు నివాసం వుంటారు. అక్కడి ప్రభుత్వం 1950లలో ప్రాథమిక విద్య మీద పెట్టిన పెట్టుబడి, శ్రద్ధ వల్లనే ఈ రోజు చైనా ప్రపంచంలోనే ఒక అగ్రగామి దేశంగా భాసిల్లుతోంది. 'మీరు ప్రభుత్వ బడులకు మీ పిల్లలను ఎందుకు పంపించరు?' అని నేను చాలా గ్రామాలలో తల్లిదండ్రులను అడిగితే వారు నాకు ఈ విషయాలను చెబుతుండేవారు: ఇంగ్లీషు మీడియం లేదు; మరుగు దొడ్లు, శుభ్రమైన తాగు నీరు, తరగతి గదిలో ఫర్నీచర్ వంటి కనీస సౌకర్యాలు ఉండవు; బోధనలో నాణ్యత వుండదు అన్నారు. అంతేకాదు, ఎల్‌కేజీ, యూకేజీలు లేకపోవడాన్నీ వారు ఎత్తి చూపారు. ఒక ప్రైవేట్ బడి యజమాని ఎవరు అంటే కృష్ణా రెడ్డి అనో, శ్రీనివాస్ రావు అనో (ఉదాహరణకు) ఒక పేరు చెబుతారు. అదే మీ వూరిలో వున్న సర్కార్ బడి యజమాని ఎవరు అంటే ప్రభుత్వం అని చెబుతారు.ఇక్కడ సమస్యల్లా ఏమిటయ్యా అంటే? అదే కృష్ణా రెడ్డి, శ్రీనివాస్ రావు బడులలో విద్యా నాణ్యతకు సంబంధించి, బడిలోని సౌకర్యాలకు సంబంధించి తీసుకునే చర్యలు మనకు ప్రభుత్వ బడులలో కానరావు. అక్కడ ఉపాధ్యాయులు స్కూలు యజమానులకు జవాబుదారీగా వుంటారు. మరి ప్రభుత్వ బడుల ఉపాధ్యాయులు ఎవరికి జవాబుదారీగా వుంటారు అనేదే పెద్ద ప్రశ్న. కొంత మంది అనొచ్చు వారు ప్రభుత్వానికి జవాబుదారీతనం వహించాలి అని, కానీ ఇక్కడ రెండు ప్రశ్నలు ఉద్భవిస్తాయి. ఒకటి, విద్యకు సంబంధించినంత వరకు ప్రభుత్వం కనపడని ఒక విచిత్ర వ్యవస్థ. రెండు, ప్రభుత్వానికి ఉపాధ్యాయులు భయపడుతున్నారా? లేక, ఉపాధ్యాయులకు ప్రభుత్వాలు భయపడుతున్నాయా? అన్నది. దీనికి పరిష్కార మార్గంగా తల్లిదండ్రులను సమీకరించి కమిటీగా ఏర్పరచి ఆ కమిటీలను పటిష్ఠ పరిచి వారికి బడి పరిపాలనలో భాగస్వామ్యం కల్పించి ప్రతి తల్లి/ తండ్రి ప్రతి విద్యార్థికి సంవత్సరానికి వెయ్యి రూపాయలు (రెండు విడతలలో) స్కూల్ కార్పస్ ఫండ్ కింద కట్టించగల్గితే తల్లిదండ్రులకు ఉపాధ్యాయులను ప్రశ్నించే అధికారం వస్తుంది. విద్య నాణ్యతను సమీక్ష చేసుకునే సామర్థ్యం సహజంగా వస్తుంది. ప్రజల భాగస్వామ్యం లేకపోతే ప్రభుత్వం ఎంత డబ్బు ఖర్చు పెట్టినా ప్రభుత్వ బడులు బాగుపడవు. ప్రభుత్వం ఖర్చు పెట్టే ప్రతీ రూపాయి తల్లిదండ్రుల కమిటీ ద్వారానే ఖర్చు పెట్టించగలిగితే పనుల నాణ్యత, వేగం పెరుగుతుంది. పాత తరంలో ప్రైవేట్ బడులు లేని కాలంలో గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వ బడులలో నాణ్యత, ఉపాధ్యాయులలో దృఢ సంకల్పం బాగా కనపడేవి. అప్పుడు గ్రామంలోని మోతుబరులు, అక్కడే నివసించే ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు వారి పిల్లలను ప్రభుత్వ బడులలోనే చదివించే వాళ్ళు. వారు శ్రద్ధగా బడిలో జరిగే కార్యక్రమాల నాణ్యతను పరిశీలించేవారు. ఉపాధ్యాయులు జవాబుదారీగా ఉండేవారు. ఇప్పుడు ఏ ప్రభుత్వ ఉద్యోగి (గ్రామ పంచాయితీ కార్యదర్శితో సహా) గ్రామంలో నివసించడం లేదు (అంగన్‌వాడి టీచరు తప్ప). చాలా గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు కూడా నివసించడం లేదు. పెద్ద రైతులు, ప్రజా ప్రతినిధులు వారి కుటుంబాలను పట్టణాలలో పెడుతున్నారు. పేద కుటుంబాలు మాత్రమే వారి పిల్లలను ప్రభుత్వ బడులలో చదివిస్తున్నాయి. వారికి ఉపాధ్యాయులను ప్రశ్నించే సామర్థ్యం గాని, వారి పిల్లలకు సంబంధించి చదువును పరిశీలించే జ్ఞానంగాని లేవు. అమెరికాలోనూ, యూరప్ దేశాలలోనూ 'స్కూల్ డిస్ట్రిక్ట్' అనే విధానం వుంటుంది. అంటే ఆవాసంలోని పిల్లలందరూ ప్రభుత్వ బడులలో విధిగా చదివించాలి. అక్కడ రెసిడెన్షియల్ స్కూళ్లు చాలా తక్కువగా వుంటాయి. మన ఊరికి దగ్గరలోనే మంచి స్కూల్ ఉన్నట్లయితే దూరంగా వున్న గురుకుల పాఠశాలలకు (ప్రైవేట్ కార్పొరేట్, ప్రభుత్వం.. ఏదైనా కావొచ్చు) పిల్లలను పంపాల్సిన అవసరం వుండదు కదా! నాణ్యమైన విద్యకు ఖరీదైన గురుకుల పాఠశాలలు పరిష్కారమే కాదు. గురుకుల పాఠశాలలో చదివే పిల్లలు వారి బాల్య హక్కులను, తల్లిదండ్రులు పిల్లలతో గడపాల్సిన సంతోష కాలాన్ని కోల్పోతున్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో అన్ని తరగతులకు ఇంగ్లీషు మీడియంను తక్షణమే (10వ తరగతి తెలుగు మీడియం తప్ప) ప్రవేశ పెట్టవలసిన అవసరం ఎంతైనా వుంది. ఇక్కడ చర్చించిన విషయాలను, మన సమాజ పరిస్థితులను, రాజకీయ వ్యవస్థను, కుల వ్యవస్థను పరిశీలిస్తే నాణ్యమైన విద్య అందాలంటే దేశంలో ప్రైవేట్ పాఠశాలలను పూర్తిగా రద్దు చేయడం ఒక్కటే పరిష్కార మార్గంగా కనపడుతుంది.అప్పుడు ముఖ్యమంత్రుల పిల్లలు, మనుమలు/ మనుమరాళ్ళు మంత్రుల పిల్లలు, అధికారుల పిల్లలు, ధనవంతుల పిల్లలు, పేద వారి పిల్లలు అందరినీ ప్రభుత్వ బడిలో మాత్రమే చదివించాల్సి వుంటుంది. దాంతో బడుల పని విధానం, సౌకర్యాలు, విద్య నాణ్యత అన్నీ మెరుగవుతాయి. మండలానికి ఆరు నుండి పది పాఠశాలలుపెట్టి మిగతా చిన్న గ్రామాలకు రవాణా వ్యవస్థ ఏర్పాటు చేయడం ద్వారా పాఠశాలల సంఖ్య తక్కువై మంచి సౌకర్యాలు, మెరుగైన సమీక్షల ద్వారా విద్య ప్రమాణాలను పెంపొందించుకోవచ్చు. అన్ని కులాల విద్యార్థులు ఒకటే బడికి పోవడం ద్వారా విద్యార్థుల మధ్య సౌభ్రాతృత్వం, సుహృద్భావం ఏర్పడుతుంది. కుల వ్యవస్థ కూడా బలహీన పడటానికి అవకాశం ఏర్పడుతుంది. నాణ్యమైన విద్య అందించే మానవ వనరులు, సాంకేతికత, ఆర్థిక వనరులు మన దగ్గర ముఖ్యంగా మన రాష్ట్రానికి పుష్కలంగా ఉన్నాయి. కావాల్సిందల్లా.. అన్ని వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను ప్రాథమిక హక్కుగా అందించాలి అనే నిబద్ధత ప్రభుత్వాలకు ఉండడమే! ఈ విషయంలో సర్కారు చిత్తశుద్ధి చూపితే రాష్ట్రంలో, దేశంలో పేదరికం లేకుండా చేయొచ్చు. ఒక లౌకిక సమాజాన్ని, బంగారు తెలంగాణను, బంగారు భారతాన్ని నిర్మించవచ్చు.ఆకునూరి మురళి, ఐ.ఎ.ఎస్ఒక పౌరుడిగా



# ఎసిబికి చిక్కిన ఎంపిడివో,ఎంపివో

## లంచం తీసపుకుంటుండగా పట్టివేత

## పటాకులు కాల్చి సంబరం చేసుకున్న గ్రామస్థులు

**మహబూబాబాద్,జూన్12 గాండీవం**

భూమి లేఅవుట్ అభివృద్ధి పనులకు లంచం తీసుకున్న ముగ్గురిని ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మహబూబాబాద్ జిల్లా నర్సిములపేట మండలానికి చెందిన ఎంపీడీవో రాధిక, ఆమె కుమారుడు నాగార్జున, ఎంపీవో యాకయ్యపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. మండలంలోని పద్మావతిగూడెం గ్రామంలో లేఅవుట్‌కు సంబంధించిన భూమిని గ్రామ పంచాయతీ వద్ద తాకట్టు పెట్టేలా పంచాయతీ సచివాలయానికి ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ బాధితుడు ఎంపీడీవో రాధికను, ఎంపీవో యాకయ్యను సంప్రదించాడు. దీంతో వారు లంచం డిమాండ్ చేయడంతో శుక్రవారం ఎంపీడీవో కుమారుడు నాగార్జునకు మొత్తం 45 వేల రూపాయలు అందజేశాడు. దీంతో అక్కడే మాటు వేసిన ఏసీబీ అధికారులు ముగ్గురిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి వరంగల్ ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. కాగా ఎంపీడీవో రాధిక ఏసీబీ అధికారులకు పట్టుబడడంతో స్థానికులు ఎంపీడీవో కార్యాలయం ఎదుట పటాకులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు.




# తల్లిపై కర్రతో దాడి..

## కుమారుడికి రెండేళ్ల జైలు శిక్ష

**జగిత్యాల జిల్లా ప్రతినిధి జూన్ 12,గాండీవం:**

ఆస్తి పంపకాల విషయంలో తలెత్తిన కుటుంబ కలహాల నేపథ్యంలో తన తల్లిపై దాడి చేసి తీవ్ర గాయాలకు గురిచేసిన కేసులో నిందితుడు సుద్దాల రాజయ్యకు కోర్టు రెండేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. అదనంగా రూ.2,000 జరిమానా కూడా విధిస్తూ జగిత్యాల కోర్టు న్యాయమూర్తి లావణ్య శుక్రవారం తీర్పు వెలువరించారు.వివరాల్లోకి వెళితే, జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అంతర్గాం గ్రామానికి చెందిన సుద్దాల రాజయ్య 2022 మార్చి 6న ఆస్తి పంపకాల విషయంలో తలెత్తిన వివాదంతో తన తల్లి లచ్చవ్వపై కర్రతో దాడి చేసి గాయపరిచినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనపై నమోదైన ఫిర్యాదు మేరకు జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నం.60/2022గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.అప్పటి ఎస్ఐ అనిల్ కుమార్ నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసులో సమర్పించిన సాక్ష్యాధారాలు, సాక్షుల వాంగ్మూలాలను పరిశీలించిన కోర్టు నిందితుడు సుద్దాల రాజయ్య (42)ను ఐపీసీ సెక్షన్ 326 కింద దోషిగా నిర్ధారించింది. దీంతో అతనికి రెండేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.2,000 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది.ఈ కేసులో ప్రభుత్వ తరఫున ఏపీపీ కె. శ్రీనివాస్ వాదనలు వినిపించారు.

# సైబరాబాద్ పరిధి లో సబ్-ఇన్‌స్పెక్టర్లకు వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు పై ప్రత్యేక అవగాహన సదస్సు

## జీవిత సవాళ్లను అవకాశాలుగా మలుచుకుంటేనే విజయాలు సాధ్యం: సీపీ డా. ఎం. రమేష్

**శేరిలింగంపల్లి గాండీవం దినపత్రిక జూన్ 12 ::**

సైబరాబాద్ సీపీ డా ఎం. రమేష్ ఆధ్వర్యంలో సైబరాబాద్ పోలీస్ కమీషనరేట్ పరిధి లోసబ్-ఇన్‌స్పెక్టర్ల కోసం ఈ రోజు సీపీ ఆఫీస్ ఆడిటోరియం లో ప్రత్యేక ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సైకాలజిస్ట్ శ్రీ సుధీర్ సాంద్ర పాల్గొని వ్యక్తిత్వ వికాసం, ఒత్తిడి నిర్వహణ, భావోద్వేగ నియంత్రణ, నాయకత్వ లక్షణాల పెంపు, వృత్తిపరమైన నైపుణ్యాల అభివృద్ధి వంటి అంశాలపై అవగాహన కల్పించారు. పోలీసు విధుల్లో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొంటూ మానసిక దృఢత్వంతో విధులు నిర్వహించాల్సిన అవసరాన్ని వివరించారు.ఈ సందర్భంగా సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్ మాట్లాడుతూ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, స్ట్రెస్ మేనేజ్‌మెంట్, హెల్త్ మేనేజ్‌మెంట్‌తో పాటు కుటుంబ జీవితం, ఉద్యోగ బాధ్యతల మధ్య సమతుల్యతను పాటించడం ప్రతి అధికారికి ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. మంచి ఆలోచనలు, ఉన్నత ఆశయాలు, స్పష్టమైన లక్ష్యాలతో ముందుకు సాగితే జీవితంలో విజయాలను సాధించడం సులభమవుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమను తాము ప్రతిరోజూ విశ్లేషించుకుంటూ, భవిష్యత్ లక్ష్యాల దిశగా కృషి చేయాలని సూచించారు.పోలీసు శాఖ ఒక విశ్వసనీయ బ్రాండ్ అని, దానికి తగిన నైతిక విలువలు, క్రమశిక్షణ, ప్రజాసేవా దృక్పథాన్ని ప్రతి అధికారి కాపాడాలని సీపీ సూచించారు. దర్యాప్తు నిర్వహణలో వృత్తిపరమైన నైపుణ్యాలు, విశ్లేషణాత్మక ఆలోచన, ప్రజలతో సమన్వయం, చట్టబద్ధతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. కేసుల దర్యాప్తులో



నిజాయితీ, నిబద్ధత, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు.జీవితంలో ఎదురయ్యే అవాంతరాలు, ఒత్తిళ్లు, సవాళ్లను అవకాశాలుగా మలుచుకోవాలని, అపజయాలను పాఠాలుగా స్వీకరించి ముందుకు సాగాలని సీపీ సూచించారు. నేటి బిజీ జీవితంలో నైతిక విలువలపై దృష్టి తగ్గుతోందని, వాటిని మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. "అపకారికి ఉపకారం" అనే విలువను ఆచరిస్తూ సమాజంలో ఆదర్శప్రాయమైన పోలీసు అధికారులుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఎవరూ పరిపూర్ణులు కాదని, నిరంతర అభ్యాసం, ఆత్మవిశ్వాసం, సానుకూల దృక్పథంతోనే ఉన్నత విజయాలు సాధించగలమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ అన్నపూర్ణ, క్రైమ్స్ డీసీపీ ముత్యం రెడ్డి ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# నేడు జగిత్యాల టౌన్-2 పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేత

**జగిత్యాల జిల్లా ప్రతినిధి జూన్ 12,గాండీవం:**

జగిత్యాల పట్టణంలోని 33/11 కేవీ విద్యానగర్ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనుల కారణంగా శనివారం ఉదయం 9:00 గంటల నుంచి 10:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డివిజనల్ ఇంజినీర్ కె. గంగారం తెలిపారు.టౌన్-2 సెక్షన్ పరిధిలోని తహశీల్ చౌరస్తా, పాత బస్టాండ్, అన్నపూర్ణ చౌరస్తా, పోచమ్మవాడ, బ్రాహ్మణవాడ, విద్యానగర్, ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల పరిసరాలు, రాజీవ్ చౌక్, ధర్మపురి బైపాస్ రోడ్, గాయత్రి దేవాలయం ప్రాంతం, గొల్లపల్లి రోడ్, విజయపురి, దయాల్‌నగర్, సీతారాం నగర్ కాలనీ, బుక్కవాడ, శివవీధి, టవర్ సర్కిల్, గంజ్‌వీధి, కొత్తవాడ, బీరయ్య ఆలయ ప్రాంతం, శంకులపల్లి, సూతారిపేట్, తిప్పన్నపేట్, గోపాలరావుపేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది.అందువల్ల ఆయా ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు.

# శాంతిభద్రతల కారణంగానే పవన్ సభకు నిరాకరణ

**తెలంగాణలో ఎవరైనా రాజకీయం చేసుకోవచ్చు- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పక్కా తెలంగాణ ద్రోహి- తెలంగాణ కోసం ఏ ఒక్క మంచి పని చేయలేదు- కెటిఆర్ చెప్పినట్లల్లా ఢిల్లీలో డ్రామాలు ఆడుతున్నాడు- హిట్లర్ ఆదర్శమని ఎవరైనా చెబుతారా- మీనాక్షి సీట్ చోరీకి బిజెపి కుట్ర రాజకీయాలు- మీడియాతో చిట్‌చాట్‌లో సిఎం రేవంత్- ఢిల్లీలో కాంగ్రెస్ నేత రాహుల్‌తోనూ భేటీ**

**న్యూఢిల్లీ,జూన్12 గాండీవం**

తెలంగాణకు వచ్చేందుకు.. వెళ్లేందుకు.. పోటీ చేసేందుకు.. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌కు పూర్తి స్వేచ్ఛ ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎవరు ఎక్కడైనా రావచ్చు..పోవచ్చన్నారు. ఇందుకు పవన్ కళ్యాణ్ అతీతుడు కాదన్నారు. న్యూఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ప్రజలకు వ్యతిరేకంగా మాట్లాడినందునే.. పవన్ కల్యాణ్‌పై తమ మంత్రులు మాట్లాడారన్నారు. తెలంగాణకు వచ్చివెళ్లేందుకు.. పోటీ చేసేందుకు పవన్‌కల్యాణ్‌కు పూర్తి స్వేచ్ఛ ఉందన్నారు. ప్రజలకు వ్యతిరేకంగా మాట్లాడినందునే పవన్ విషయంలో మా మంత్రులు స్పందించారు. శాంతిభద్రతల కారణంతోనే ఆయన సభకు అనుమతి ఇవ్వలేదు. ఏపీలో చాలాసార్లు జగన్ సభలకు అనుమతి ఇవ్వలేదు. ఎందుకు అనుమతి ఇవ్వలేదో పవన్‌కల్యాణ్ చెప్పాలన్నారు. తనకు హిట్లర్ ఆదర్శం అని తానెప్పుడూ చెప్పలేదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఉన్నవారు ఎవరైనా.. హిట్లర్ తమకు ఆదర్శం అని చెబుతారా? అని ప్రశ్నించారు. పార్టీ అధిష్ఠానంతో జరిగిన సమావేశంలో మంత్రివర్గ విస్తరణపై చర్చ జరగలేదని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీతో జరిగిన భేటీలో తనను ఆయనే కౌగిలించుకున్నారని .. తాను కౌగిలించుకోలేదని సీఎం రేవంత్ వెల్లడించారు. తెలంగాణపై కేంద్రం వివక్ష చూపుతోందని సీఎం రేవంత్ ఆరోపించారు. బీఆర్ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆదేశాలను ఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పాటిస్తున్నారని విమర్శించారు. పలు ప్రాజెక్టులకు నిధులు విడుదల కాకపోవడానికి కిషన్‌రెడ్డే కారణమని మరోమారు కుండబద్దలు కొట్టారు. రీజినల్ రింగ్ రోడ్డుకు కూడా కిషన్‌రెడ్డి అడ్డుపడ్డారని గుర్తు చేశారు. తుమ్మిడిహెట్టి కోసం మహారాష్ట్ర సీఎంతో కిషన్‌రెడ్డి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. తెలంగాణ కోసం ప్రధానితో ఒక్కసారైనా మాట్లాడారా అని కిషన్ రెడ్డిని సీఎం రేవంత్ రెడ్డి నిలదీశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఎక్కడైనా తెలంగాణకు అనుకూలంగా మాట్లాడినట్లు నిరూపించాలన్నారు. ఎవరి వద్ద వ్యతిరేకంగా మాట్లాడారో వాళ్లే నాకు చెప్పారు. పోలవరం



కోసం 5 మండలాలను ఏపీలో కలిపారు. అదేరీతిలో తెలంగాణ కోసం మహారాష్ట్ర నుంచి 1500 ఎకరాలు సాధించలేరా?మహారాష్ట్రను ఒప్పించే వరకు క్యాబినెట్ సమావేశానికి రానని కిషన్‌రెడ్డి, రాజీనామా చేస్తామని 8 మంది భాజపా ఎంపీలు చెప్పలేరా?ఆ పార్టీ ఎంపీలు గట్టిగా అడిగితే రాష్ట్రానికి నిధులు వస్తాయి కదా! రీజినల్ రింగ్ రోడ్డు ను కూడా కిషన్‌రెడ్డి అడ్డుకుంటున్నారు. కేటీఆర్ చెప్పినట్లు కిషన్‌రెడ్డి డ్రామా ఆడుతున్నారని మండిపడ్డారు. గాడ్సేనే కాదు.. కిమ్‌ను కూడా బీజేపీ ఆదర్శంగా తీసుకుందని సీఎం రేవంత్ రెడ్డి వ్యంగ్యంగా అన్నారు. బీజేపీకి తెలిసింది ఓట్ చోరీ.. లేకపోతే సీట్ చోరీ అని ఎద్దేవా చేశారు. మధ్యప్రదేశ్‌లో సంఖ్యాబలం లేకపోయినా మూడో అభ్యర్థిని నిలబెట్టినప్పుడే బీజేపీ దుర్బుద్ధి బయటపడిందన్నారు. మీనాక్షి నామినేషన్ తిరస్కరణ అప్రజాస్వామిక చర్య అని అభివర్ణించారు. ఆమె నామినేషన్ తిరస్కరణ అత్యంత బాధాకరమన్నారు. మీనాక్షి నటరాజన్‌పై అసలు కేసే లేదని స్పష్టం చేశారు. మహిళా వ్యతిరేకి బీజేపీ అని సీఎం రేవంత్ విమర్శించారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ వ్యవహారంలో రిటర్నింగ్ అధికారి (ఆర్వో) భాజపా కార్యకర్తలా వ్యవహరించారని విమర్శించారు. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌ను భాజపా ఆదర్శంగా తీసుకుందని.. ఆ పార్టీ నేతలు ఆయనలా ప్రవర్తిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఉత్తర కొరియాలోనూ ఎన్నికలు జరుగుతాయని, ఫలితాలు మాత్రం అధ్యక్షుడు చెప్పిన విధంగా వస్తాయన్నారు. ఇదిలావుంటే ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌తో సిఎం రేవంత్ భేటీ అయ్యారు. మర్యాదపూర్వకంగానే అయనను కలిసినట్లు తెలిసింది.

# ఉద్యోగుల పట్ల కాంగ్రెస్ వివక్ష

## హెల్త్ కార్డులు ఇవ్వకుండా రాజకీయం

## మండిపడ్డ మాజీమంత్రి శ్రీనివాసగౌడ్

**హైదరాబాద్,జూన్12 గాండీవం**




ప్రభుత్వ ఉద్యోగుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. ఉద్యోగులకు తక్కువ చేసి చూస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో కార్పొరేషన్ మాజీ చైర్మన్ జి .దేవీప్రసాద్, టీఎన్జీవో అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్‌తో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ మొండి వైఖరి వల్ల తెలంగాణలో 10 నుంచి 15 లక్షల కుటుంబాల ఉద్యోగులు, పెన్షన్ దారులు ఆందోళనలో ఉన్నారని ఆరోపించారు. హెల్త్ కార్డ్స్ ఇవ్వకుండా ప్రభుత్వం జాప్యం చేస్తుందని మండిపడ్డారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నర యేండ్లలో ఇంతవరకు ఉద్యోగులకు, పెన్షన్ దారులకు హెల్త్ కార్డ్స్ ఇవ్వలేదని ఆరోపించారు.కాంట్రాక్టు ఉద్యోగులకు సకాలంలో జీతాలు రావడం లేదని అన్నారు.హెల్త్ కార్డ్స్ ఇష్యూపై కమిటీ వేశారే తప్పా హెల్త్ కార్డ్స్ మాత్రం ఇవ్వడం లేదని పేర్కొన్నారు.కమిటీ ముఖ్యమంత్రి మాట వినడం లేదా? ముఖ్యమంత్రి మాట కమిటీ వినడం లేదా అర్థం కావడం లేదని విమర్శించారు. పీఆర్సీ 6 నెలల్లో క్లియర్ చేస్తామని చెప్పి ఇంతవరకు ఆ ఊసే లేదని అన్నారు.బీఆర్ఎస్ హయంలో ఉద్యోగులను కాపాడుకున్నా మని వెల్లడించారు. ఒక్కో ఉద్యోగి నుంచి నెలకు 2 వేల నుంచి 3 వేల వరకు డబ్బులు కట్ అవుతున్నాయి. ఉద్యోగి జీతం నుంచి డబ్బులు కట్ చేయమని ఈ ప్రభుత్వానికి చెప్పింది ఎవరని ప్రశ్నించారు. ఉద్యోగులను తక్కువ చేసి చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఆరోగ్యం విషయంలో ఉద్యోగులు చనిపోతే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. జూన్ 1 నుంచి హెల్త్ కార్డ్స్ ఇస్తామని చెప్పి ఇంతవరకు ఇవ్వలేదని విమర్శించారు. హెల్త్ కార్డ్స్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం గందరగోళం సృష్టిస్తుందని దేవి ప్రసాద్ అన్నారు. ద్యోగి సమ్మతి లేకుండా జీతం కట్ చేయవద్దని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పినా కూడా కాంగ్రెస్ ప్రభుత్వం వినిపించుకోవడం లేదని తెలిపారు. కేసీఆర్ పరిపాలనలో అంగన్‌వాడీ వర్కర్స్ కు ఏ రాష్ట్రంలో లేని విధంగా జీతాలు ఇచ్చారని గుర్తు చేశారు.

# భారత నావికుల మృతిపై స్పందించని ప్రధాని

## అమెరికాకు లొంగిపోయాడంటూ రాహుల్ విమర్శలు

**న్యూఢిల్లీ,జూన్12 గాండీవం**

గతవారం అమెరికా బలగాలు ఒమన్ తీరం వద్ద ఉన్న 'సెట్టిబెల్లో' నౌకపై చేసిన దాడిలో ముగ్గురు భారతీయ నావికులు మృతి చెందారు. ఈ ఘటనపై ప్రధాని మౌనం వహించడంపై శుక్రవారం లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, 'అంతర్జాతీయ జలాల్లో మూడు నౌకలపై అమెరికా జరిపిన దాడుల్లో మూడు రోజుల్లోనే ముగ్గురు భారతీయులు మరణించారు. అమెరికాకు లొంగిపోయిన మన ప్రధాని మాత్రం ఇప్పటివరకు ఈ ఘటనపై ఒక్కమాట కూడా మాట్లాడలేదు. ఏదైనా విదేశీ శక్తి ఒక భారతీయుడిని హత్య చేసినప్పుడు ప్రధాని స్పందించాలి. కానీ, ఆయన ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం దురదృష్టకరం. మన నావికుల్ని హత్య చేసిన కొద్దిరోజులకే.. అంటే వచ్చేవారమే జి7 సమావేశం జరుగుతుంది. ఈ సమావేశంలో మోడీ గారు చిరునవ్వు చిందిస్తూ.. ఆలింగనం చేసుకుంటూ.. ఒప్పందాలపై సంతకాలు చేస్తారు. కానీ చనిపోయిన ఈ ముగ్గురు భారతీయుల గురించి మాత్రం ఆయన ఒక్కమాట కూడా మాట్లాడరు. తమ ప్రాణాలను బలిగొన్న వారిని ఎదిరించే ధైర్యం గానీ, శక్తి గానీ లేని ఒక లొంగిపోయిన ప్రధానమంత్రి 'భారతమాత' బిడ్డలను రక్షించలేరు' అని మోడీ తన సామాజిక మాధ్యమం ఎక్స్ పోస్టులో మోడీని తీవ్రంగా విమర్శించారు.




# శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఊరుకోం

## కఠినంగా వ్యవహరిస్తామని సిఎం సువేందు హెచ్చరిక

**కోల్‌కతా,జూన్12 గాండీవం**



శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ విధ్వంసం, హింస, పోలీసులపై దాడులకు పాల్పడేవారిని ఉపేక్షించబోమని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి గట్టి హెచ్చరిక చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు ఆటంకం కలిగించే ఏ ఒక్కరినీ విడిచిపెట్టేది లేదని, కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు. అలాంటి ఘటనలు పునరావృతమైతే తనకంటే చెడ్డవాడు ఎవరూ ఉండరని హెచ్చరించారు. నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న తరుణంలో రాష్ట్ర బీజేపీ ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం మాట్లాడుతూ, తమ ప్రభుత్వ ప్రాధాన్యతా క్రమాల్లో శాంతిభద్రతల పరిరక్షణ అత్యంత కీలకమని చెప్పారు. సంఘ విద్రోహ శక్తులను ప్రభుత్వం అనుమతించే ప్రసక్తేలేదని, విధ్వంసకాండకు పాల్పడినా, చట్టాన్ని సవాలు చేసినా తీవ్ర పరిణామాలు తప్పవని అన్నారు. అలాంటి ఘటనలు పునరావృతమైతే తనకంటే చెడ్డవాడు ఉండడని హెచ్చరించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని సంఘటనలు చోటుచేసుకున్నాయని, వాటి వ్యవహారంలో చాలా కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు. పార్క్ సర్కస్, ఆసన్‌సోల్‌లో చెదురుమదురు ఘటనలు చోటుచేసుకున్నా మొత్తంగా చూస్తే శాంతిభద్రతల పరిస్థితి చాలామటుకు అదుపులోనే ఉందన్నారు. మోదీ నాయకత్వం, గైడెన్స్‌లో డబుల్ ఇంజన్ ప్రభుత్వం స్వల్ప వ్యవధిలోనే కొన్ని పనులు పూర్తి చేసిందని అన్నారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వ ప్రయోజనాలు ఇప్పటికే ప్రజలకు అందడం మొదలైందని, రాబోయే రోజుల్లో ప్రజలకు మరిన్ని ప్రయోజనాలు చేకూరుతాయని చెప్పారు. సరిహద్దుల్లో బోర్డర్ మేనేజిమెంట్, సెక్యూరిటీ ప్రాజెక్టుల కోసం బీఎస్‌ఎఫ్‌కు భూములు అప్పగించామని, ఈ ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. చికెన్ నెక్ కారిడార్‌కు ఆనుకున్న ప్రాంతాల్లో ఫెన్సింగ్ పనులు మొదలయ్యాయని చెప్పారు.

# గంజాయితో పట్టుబడ్డ మోడల్ మిస్ హర్ష సన్నీ

## బ్యాంకాక్ నుంచి ముంబై రాగా పట్టివేత

**ముంబై,జూన్12 గాండీవం**

మోడలింగ్ రంగంలో రాణిస్తూ.. కేరళ అందాల పోటీల్లో పాల్గొన్న ఓ యువతి, ఒక్క రాత్రిలో డ్రగ్స్ స్మగ్లర్‌గా మారి జైలుపాలైంది. బ్యాంకాక్ నుంచి ముంబైకి రూ.11.82 కోట్ల విలువైన హై-క్వాలిటీ 'హైడ్రోపోనిక్ గంజాయి'ని స్మగ్లింగ్ చేస్తూ.. మాజీ 'మిసెస్ కేరళ' కంటెస్టెంట్ హర్ష సన్నీ (28) ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులకు అడ్డంగా దొరికిపోయింది. ఎయిర్ ఇండియా విమానం ద్వారా బ్యాంకాక్ నుంచి ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి హర్ష సన్నీ చేరుకుంది. లగేజీ క్లియరెన్స్ సమయంలో ఆమె ప్రవర్తన కాస్త అనుమానాస్పదంగా ఉండటాన్ని ఎయిర్ ఇంటెలిజెన్స్ యూనిట్, కస్టమ్స్ అధికారులు గమనించారు. ఆమెను పక్కకు పిలిచి, ఆమె వద్ద ఉన్న ట్రావెల్ బ్యాగ్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆ బ్యాగులో ప్యాక్ చేసిన 12 ప్లాస్టిక్ ప్యాకెట్లు కనిపించాయి. వాటిలో పచ్చటి పదార్థం ఉంది. వెంటనే అధికారులు 'ఎన్‌డిపిఎస్' కిట్‌తో కెమికల్ టెస్ట్ చేయగా, అది అత్యంత ఖరీదైన, నాణ్యమైన 'హైడ్రోపోనిక్ మారిజువానా' (గంజాయి) అని తేలింది. సాధారణ గంజాయితో పోలిస్తే ల్యాబ్‌లలో నియంత్రిత వాతావరణంలో పెంచే ఈ హైడ్రోపోనిక్ గంజాయికి మార్కెట్లో విపరీతమైన డిమాండ్, ధర ఉంటుంది. హర్ష సన్నీ వద్ద దొరికిన 11 కిలోల గంజాయి విలువ అంతర్జాతీయ బ్లాక్ మార్కెట్లో సుమారు రూ.11.82 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. దీంతో ఆమెపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. కోర్టు ఆమెకు జ్యుడీషియల్ కస్టడీ విధించింది.




# ముందుంది కష్ట కాలం.. రాష్ట్రాలను హెచ్చరించిన ప్రధాని నరేంద్ర మోదీ...

**తెలంగాణ గాండీవం దినపత్రిక జూన్ 12**



భారత్‌లో భవిష్యత్తులో ఎదురయ్యే వాతావరణ సవాళ్లపై ప్రధాని మోదీ రాష్ట్ర ప్రభుత్వాలను అప్రమత్తం చేశారు. నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశంలో మాట్లాడిన ఆయన, ఎల్ నినో పరిస్థితులు ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్న నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు.దేశ అభివృద్ధి లక్ష్యాలను దృష్టిలో పెట్టుకుని నిర్వహించిన నీతి ఆయోగ్ 11వ పాలక మండలి సమావేశంలో వాతావరణ మార్పులు ప్రధాన చర్చాంశంగా నిలిచాయి. ఈ సమావేశంలో పలు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రతినిధులు పాల్గొన్నారు. భవిష్యత్తు తరాలకు నీటి భద్రత కల్పించాలంటే ఇప్పటి నుంచే సమర్థవంతమైన ప్రణాళికలు అమలు చేయాల్సిన అవసరం ఉందని ప్రధాని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించాలని చెప్పారు.ప్రపంచ వాతావరణ సంస్థ (ఔమీూ) సహా పలు అంతర్జాతీయ వాతావరణ సంస్థలు 2026 మధ్యకాలంలో ఎల్ నినో ప్రభావం కనిపించే అవకాశాలు ఉన్నాయని ఇప్పటికే అంచనా వేశాయి. ఈ పరిణామాలు ప్రపంచవ్యాప్తంగా వాతావరణ వ్యవస్థపై ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఆసియా దేశాల్లో వర్షపాతం నమూనాలు మారిపోవడం, ఉష్ణోగ్రతలు పెరగడం వంటి పరిస్థితులు తలెత్తే అవకాశాలు ఉన్నాయని హెచ్చరిస్తున్నారు.ఎల్ నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలోని మధ్య, తూర్పు ప్రాంతాల్లో సముద్ర జలాల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడం వల్ల ఏర్పడే వాతావరణ పరిస్థితి. దీని ప్రభావం ప్రపంచంలోని అనేక దేశాలపై కనిపిస్తుంది. భారతదేశంలో అయితే ఇది రుతుపవనాలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. సాధారణంగా ఎల్ నినో ప్రభావం పెరిగిన సంవత్సరాల్లో వర్షపాతం తగ్గడం, వడగాలులు అధికమవడం, కొన్ని ప్రాంతాల్లో కరవు పరిస్థితులు ఏర్పడటం వంటి సమస్యలు కనిపిస్తాయి. వ్యవసాయ రంగంపై కూడా దీని ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉంటుంది.భవిష్యత్తులో నీటి కొరత సమస్యలను ఎదుర్కోవాలంటే ఇప్పటి నుంచే నీటి సంరక్షణ చర్యలను వేగవంతం చేయాలని ప్రధాని రాష్ట్రాలకు సూచించారు. వర్షపు నీటిని నిల్వ చేసే వ్యవస్థలను విస్తరించడం, భూగర్భ జలాలను పరిరక్షించడం, సాగునీటిని సమర్థంగా వినియోగించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నీటి నిర్వహణకు సంబంధించి కొత్త విధానాలు రూపొందించాలని కూడా సూచించారు.

# తెలంగాణ రాష్ట్రానికి కీలకమైన పలు మౌలిక వసతుల ప్రాజెక్టులపై కేంద్రం సహకారం అందించాలి

**ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి గారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారిని కోరారు. సాగు, తాగునీటి అవసరాల దృష్ట్యా గోదావరి జలాలను సమర్థంగా వినియోగించుకునేలా మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలకు కేంద్రం సహకరించాలని విజ్ఞప్తి**

**తెలంగాణ గాండీవం దినపత్రిక జూన్ 12**



రాష్ట్ర భవిష్యత్తు అవసరాలకు గోదావరి జలాల వినియోగం అత్యంత ముఖ్యమని చెప్పారు. నీతి ఆయోగ్ సమావేశం అనంతరం ముఖ్యమంత్రి గారు ప్రధానమంత్రి గారిని కలిసి హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్--2 విస్తరణతో పాటు పలు ప్రతిపాదనలను అందించారు. మెట్రో ఫేజ్--2లో 7 కారిడార్లలో 122.9 కిలోమీటర్ల మెట్రో విస్తరణకు ?38,595 కోట్ల ప్రతిపాదనలు సమర్పించినట్టు తెలిపారు. ఈ ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా మంజూరు చేయాలని కోరారు. హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు పనులకు వెంటనే ఆమోదం తెలపాలని ముఖ్యమంత్రి గారు కోరారు. ఉత్తర భాగంలో భూసేకరణ ఖర్చులో 50 శాతం వాటా భరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించిందని గుర్తుచేస్తూ, ఎన్‌హెచ్‌ఏఐకి రూ. 626 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. ఉత్తర భాగానికి సంబంధించి 90 శాతానికి పైగా భూసేకరణ అవార్డు పూర్తయిందని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. రీజినల్ రింగ్ రోడ్డు దక్షిణ భాగం నిర్మాణం కూడా తెలంగాణ రాష్ట్రానికి అంతే కీలకమని ముఖ్యమంత్రి గారు వివరించారు. చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు దక్షిణ కారిడార్ నిర్మాణం పూర్తయితే హైదరాబాద్ చుట్టూ రవాణా వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని తెలిపారు.దక్షిణ భాగానికి సంబంధించిన అలైన్‌మెంట్ మ్యాపులు, హెచ్‌ఎండీఏ మాస్టర్ ప్లాన్ నోటిఫికేషన్లను ఇప్పటికే కేంద్ర రోడ్డు రవాణా శాఖకు అందించామని, ఉత్తర, దక్షిణ కారిడార్లను ఒకేసారి ఆమోదించి అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. "హైదరాబాద్ -- అమరావతి -- బందర్ పోర్ట్ ఎక్స్‌ప్రెస్‌వేకు కేంద్రం అనుమతి ఇవ్వాలి. హైదరాబాద్ నుంచి అమరావతి మీదుగా బందర్ పోర్టును కలిపే 12 లేన్ల ఎక్స్‌ప్రెస్‌వే తెలంగాణకు వ్యూహాత్మకంగా ఉపయోగపడుతుంది. 120 మీటర్ల రైట్ ఆఫ్ వే తో ప్రతిపాదించిన ఈ హైవే ద్వారా సముద్ర తీరం లేని తెలంగాణకు పోర్ట్ కనెక్టివిటీ లభిస్తుంది. ఫార్మా, ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల ఎగుమతులకు ఇది కీలక మార్గంగా నిలుస్తుంది" అని ప్రధానమంత్రి గారికి వివరించారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్ పనులను ప్రారంభించాలన్న అంశాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రధానంగా ప్రస్తావించారు. "వరంగల్ విమానాశ్రయానికి అవసరమైన భూసేకరణ ఇప్పటికే పూర్తిచేసి ఎయిర్ పోర్ట్ అథారిటీకి అప్పగించాం. వరంగల్ ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణ పారిశ్రామిక, విద్యా, పర్యాటక రంగాలకు మరింత ప్రయోజనం చేకూరుతుంది" అని చెప్పారు.హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు చేయాలని కోరారు. "ఐఐఎంకు అవసరమయ్యే 200 ఎకరాల స్థలం కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. తెలంగాణలో ఇప్పటికే ఐఐటీ, ఐఐఐటీ, నల్సార్, టీఐఎఫ్ఆర్ వంటి ప్రముఖ జాతీయ విద్యాసంస్థలున్నాయి. ఐఐఎం ఏర్పాటు చేస్తే నూతన విద్యావిధానం-2020 ఆశించిన లక్ష్యం కూడా నెరవేరుతుంది" అని ప్రధానమంత్రి గారికి వివరించారు.

# రేవంత్ రెడ్డి.. నీ హిట్లర్ పాలనను అంతం చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు

## మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు

**జమ్మికుంట, జూన్ 12, గాండీవం :**



జమ్మికుంట పట్టణంలోని ఎంపీఆర్ గార్డెన్లో శుక్రవారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిట్లర్ పాలనను అంతం చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఘాటుగా హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2004 నుండి ఇప్పటివరకు ఒక్క ఉపఎన్నిక తప్ప ఏ ఎన్నిక వచ్చినా ఎప్పుడూ ఎగిరిన జెండా గులాబీ జెండా అని అన్నారు.ప్రపంచమే అబ్బురపడ్డ రైతు బంధు, దళిత బంధు పథకాలు ప్రారంభమైంది హుజురాబాద్ నుంచే అని గుర్తు చేశారు.ఉద్యమ సమయంలో ఉప్పల్ రైల్వే స్టేషన్‌లో రైల్ రోకోతో ఢిల్లీని స్తంభింప చేసిన గడ్డ ఈ హుజురాబాద్ గడ్డ అని అన్నారు. ఒకప్పుడు సభ్యత్వ నమోదు రసీదులు ఉండేవి. ఇప్పుడు అంతా ఆన్‌లైన్‌లోనే. ప్రతి నియోజకవర్గంలో కార్యకర్తలకు శిక్షణా తరగతులు నిర్వహించి కాంగ్రెస్ మోసాలను గ్రామగ్రామానికి తీసుకుపోయే కార్యక్రమాన్ని పార్టీ ప్రారంభించబోతోందన్నారు. కేసీఆర్ రైతు బంధు, రైతు బీమా, కల్యాణ లక్ష్మి, ఆసరా పింఛన్లు, కేసీఆర్ కిట్ లాంటి ఎన్నో పథకాలను తెస్తే రేవంత్ రెడ్డి లేనిపోని ఆశలు పెట్టాడు అని మండిపడ్డారు.ఇన్ని చేశాం కదా, ప్రజలు కృతజ్ఞతతో ఓట్లు వేస్తారు అనుకుంటే కృతజ్ఞతకు, ఆశకు జరిగిన పోరాటంలో రేవంత్ రెడ్డి పెట్టిన ఆశల వలయంలో ప్రజలు చిక్కుకున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పును గౌరవించాల్సిందే అని అన్నారు. రైతు వ్యతిరేక కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసే పరిస్థితి లేదు. కేసీఆర్ హయాంలో కరోనా వచ్చినా రైతు బంధు ఆగలేదు. 11 సార్లు 74 వేల కోట్ల రూపాయలను రైతుల అకౌంట్లలో వేసిన ఈ దేశంలోనే ఒకే ఒక్క నాయకుడు కేసీఆర్ అని చెప్పారు. రేవంత్ రెడ్డి వచ్చాక ఒక రైతు బంధు మొత్తం ఎగ్గొట్టాడు. ఈసారి 2 ఎకరాలకే ఇచ్చాడు. 20 వేల కోట్ల రైతు బంధు ఎగొట్టి రుణమాఫీ చేశానని సంకలు గుద్దుకుంటున్నడు.కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎండకాలం వచ్చినా కరెంట్ పోలేదు, తాగడానికి నీళ్లకు ఇబ్బంది రాలేదు, కాల్వల్లో నీళ్లు పారినాయి. కానీ.. ఇవాళ కాంగ్రెస్ రాజ్యంలో కరెంట్ కోతలు మొదలైనాయి. తాగడానికి నీళ్లు లేవు, సాగునీరు లేక పంటలు ఎండిపోయినాయి. రైతులు కన్నీరు పెడుతున్నారు.రైతు బీమా బంద్ అయ్యింది. ఎల్ఐసికి డబ్బులు కట్టలేదు రేవంత్ రెడ్డి. కేసీఆర్ తెచ్చిన పథకమని రైతులకు ఉపయోగపడే పథకాన్ని ఆపడం తగునా రేవంత్ రెడ్డి అని ప్రశ్నించారు.రేవంత్ రెడ్డి వచ్చిండు, ఎరువుల కష్టాలు మొదలయ్యాయి. తరుగు లేకుండా వడ్లు కొనడం లేదు. రైతులు 40, 50 రోజులకు పైగా వడ్లు అమ్ముకోవడానికి, మక్కలు అమ్ముకోవడానికి పడిగాపులు కాస్తున్నారు. రైతు బంధు పోయింది, రైతు బీమా పోయింది, వడ్లు కొనమంటే చుక్కలు చూపిస్తున్నారు, యాసంగి పంటకు బోనస్ ఎగ్గొట్టిన్రు.కేసీఆర్ ఉన్నప్పుడు రైతులకు 24 గంటలు కరెంట్ ఇస్తే.. ఇప్పుడు కాంగ్రెస్ 11 గంటలే కరెంట్ ఇస్తుంది.ఈ రేవంత్ రెడ్డి రైతు డిస్కం పేరిట 24 గంటల కరెంట్‌కు ఉరేస్తున్నడు.. రైతులను ఆగం చేయాలని చూస్తున్నడు.రైతు డిస్కం కనుక అమలులోకి వస్తే ఇప్పుడొచ్చే 11 గంటలు కూడా రైతులకు కరెంట్ రాదు.. 5, 6 గంటలు మాత్రం వస్తుంది.రైతు అనేవాళ్లు ఇక కాంగ్రెస్‌కు ఓటేసే పరిస్థితి లేదు. రేవంత్ రెడ్డి ఏం మాట్లాడినా అబద్ధాలే. ఆయన పనైపోయింది అని ఎద్దేవ చేశారు.విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎగ్గొట్టిండు, 4000 పెన్షన్ ఇస్తానని అవ్వా తాతలను మోసం చేసిండు, 2500 ఇస్తానని మహిళలను మోసం చేసిండు.జూబ్లీహిల్స్‌లో ఆయనకున్న ప్యాలెస్ సరిపోదని 100 కోట్లతో ఇంకో క్యాంప్ ఆఫీస్ కట్టిండు, ఫ్యూచర్ సిటీ అని పెట్టి అక్కడ మరో 100 కోట్లతో క్యాంప్ ఆఫీస్ కట్టిండు, హెలికాప్టర్ ఉన్నది చాలదని నెలకు 5 కోట్లు ఖర్చు పెట్టి కొత్త హెలికాప్టర్ కొంటున్నడు, ఫుట్‌బాల్ షోలకు, అందాల పోటీలకు వందల కోట్లు ఖర్చు పెట్టిండు. పక్క రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగితే మూటలు పంపడానికి డబ్బులుంటాయి.రేవంత్ రెడ్డి గుర్తు పెట్టుకో.. నీ హిట్లర్ పాలనను అంతం చేయడానికి ప్రజలు కంకణం కట్టుకున్నారు.బీఆర్ఎస్ పార్టీకి ప్రతిపక్ష హోదా రాదంటున్నడు ఈ రేవంత్ రెడ్డి. బీఆర్ఎస్ పార్టీకి ప్రతిపక్ష హోదా కాదు, పాలకపక్ష హోదా రాబోతుంది. నీ పార్టీకి డిపాజిట్లు కూడా రావు, గుర్తుపెట్టుకో రేవంత్ రెడ్డి అని హెచ్చరించారు.దేశంలో సీఎంలు ఓడిపోయే ట్రెండ్ నడుస్తుంది. బెంగాల్, తమిళనాడులో అదే జరిగింది. నెక్స్ట్ తెలంగాణలో అదే రిపీట్ అయితది అని జోష్యం చెప్పారు.రాష్ట్రంలో ఎక్కడ చూసినా ఒక్కటే మాట.. కాంగ్రెస్ పోవాలే, కేసీఆర్ రావాలే. గ్యారంటీగా రాసి పెట్టుకోండి, మళ్లీ వచ్చేది కారే.. ఏర్పడేది కేసీఆర్ సర్కారే.ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి బాగా పనిచేస్తున్నాడు. డంపింగ్ యార్డ్ గురించి పోరాడితే కేసులు పెట్టి సిఐడి ఆఫీసుల చుట్టూ తిప్పారు. అయినా తగ్గలేదు, మీ తరపున గట్టిగా నిలబడ్డాడు.వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఈ డంపింగ్ యార్డ్ సమస్యపై బీఆర్ఎస్ పార్టీ గళమెత్తుతుందన్నారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్లు అయ్యింది. ఇప్పటి వరకు మేడిగడ్డ రిపేర్ చేయలేదు. అప్పుడు కొట్టుకుపోయిందన్నారు, ఇప్పుడు రిపేర్లు చేస్తాం అంటున్నారు.కాళేశ్వరం విలువ కాలం కానప్పుడే తెలుస్తుంది. ఈ సంవత్సరం కాంగ్రెస్‌కు అది అర్థం అయ్యింది.2021లోనే ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచింది. చాలా మంది బిఆర్ఎస్ కార్యకర్తల మీద అక్రమ కేసులు పెడుతున్నారు. అయినా కూడా పార్టీ కోసం కార్యకర్తలు కష్టపడుతున్నారు.కష్టకాలంలో పార్టీకి అండగా ఉండే కార్యకర్తలే మాకు దేవుళ్లు అని అన్నారు.మాట్లాడితే బూతులు మాట్లాడుతాడు రేవంత్ రెడ్డి..రాష్ట్రంలో వాయు కాలుష్యం లాగా ధ్వని కాలుష్యం నడుస్తుంది.రేవంత్ రెడ్డి బూతులతో ధ్వని కాలుష్యం నడుస్తుంది.ఈ ధ్వని కాలుష్య రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పాలని ప్రజలు డిసైడ్ అయిపోయారు.మళ్లీ కేసీఆర్ రావాలి, మంచి రోజులు రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు.

# నగర జిమ్‌లలో స్టెరాయిడ్స్ వినియోగం

## యువతను పక్కదారి పట్టిస్తున్న ట్రైనర్లు

## కఠిన చర్యలు తీసుకోవాలని సిపికి రాజాసింగ్ లేఖ

**హైదరాబాద్,జూన్12 గాండీవం**



మహానగరంలోని జిమ్‌లలో అక్రమంగా స్టెరాయిడ్ ఇంజెక్షన్ల విక్రయంపై గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని కట్టడి చేయడానికి చర్యలు తీసుకోవాలని నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్‌కు ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు నగర సీపీకి ఎమ్మెల్యే రాజా సింగ్ శుక్రవారం బహిరంగ లేఖ రాశారు. త్వరగా కండలు పెంచుకోవాలని యువతను కొందరు ట్రైనర్లు, కోచ్‌లు ప్రోత్సహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యుల పర్యవేక్షణ లేకుండా ఈ ఇంజెక్షన్ల వినియోగం ఆరోగ్యానికి చాలా ప్రమాదకరమన్నారు. ఇలాంటి జిమ్‌లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా నగర సీపీని గోషామహల్ ఎమ్మెల్యే కోరారు. జిమ్‌లలో అనాబాలిక్ స్టెరాయిడ్ ఇంజెక్షన్ల అక్రమ విక్రయం, వినియోగం వేగంగా పెరుగుతోందని రాసిన లేఖలో ఎమ్మెల్యే రాజా సింగ్ స్పష్టం చేశారు. ఇది యువత ఆరోగ్యానికి తీవ్రమైన ముప్పుగా మారుతోందని తెలిపారు. స్టెరాయిడ్‌ల వాడకం వల్ల గుండె, కాలేయం, హార్మోన్ల సమస్యలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. కొందరు జిమ్ నిర్వాహకులు, ట్రైనర్లు అక్రమంగా ఈ ఇంజెక్షన్ల సరఫరాలో పాల్గొంటున్నారనే ఆరోపణలు ఉన్నాయని నగర పోలీస్ కమిషనర్ దృష్టికి ఎమ్మెల్యే రాజాసింగ్ ఈ లేఖ ద్వారా తీసుకెళ్లారు. నగరంలోని జిమ్‌లపై పోలీసులు ప్రత్యేక దాడులు నిర్వహించాలని సీపీకి గోషా మహాల్ ఎమ్మెల్యే సూచించారు. స్టెరాయిడ్ ఇంజెక్షన్ల సరఫరా, పంపిణీ చేస్తున్న వారిని గుర్తించాలన్నారు. ఈ తరహా చర్యలకు పాల్పడే నిందితులపై కఠినంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. యువతకు స్టెరాయిడ్‌ల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. అక్రమ స్టెరాయిడ్ మాఫియాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సీపీని ఎమ్మెల్యే రాజా సింగ్ కోరారు. యువత ఆరోగ్యాన్ని కాపాడేందుకు కఠిన చర్యలు అవసరమని ఆ లేఖలో సీపీ సజ్జనార్‌కు ఎమ్మెల్యే రాజా సింగ్ తెలిపారు.

Publisher : AT Rajarao, 5-36/1,ismailkhanpet, Sangareddy, Telangana, E.mail: arimishettiatrajarao640@gmail.com, Cell: 9948462690. PRGI TGTEL/25/A0888,
Printed at SMILYS ONLINE 6-7-48, VANASTHALIPURAM SHOPPING COMPLEX, RANGAREDDY